
వచ్చే సంచికనుండి
ప్రారంభం!
బాలమిత్ర పాఠకులను అలరింపజేసే....
వినూత్న జానపద సాహసికసీరియల్..
గండభేరుండ దీవి
రచన: బి.ఆర్. వరదరాజులు *



# గండభేరుండడు

అది పెద్ద ఎడారి ప్రాంతం. ఎండ నిప్పు వలె నిగిడికాస్తున్నది. ఇసుకలో నుండి ఆవేడికి పొగలు వస్తున్నాయి. సామాన్యంగా ఆ ఎడారి ప్రాంతంలో మనుష్యసంచారమూ, జంతుసంచారమూ వుండదు. అటువంటిది ఈ రోజున ఐదు ఒంటెలు ఎదురు వైపునుండి వస్తున్నాయి. ఒంటెలపై ఐదుగురు వ్యక్తులు కూర్చుని, వాటిని నడుపుతున్నారు. ఈ ఒంటెలనుండి ఐదు బలమైన త్రాళ్ళు వాటి వెనుక ఒ వ్యక్తి చేతులకు కట్టబడ్డాయి. ఒంటెలు పోయే వేగానికి ఆవ్యక్తి శరీరం వేడి, వేడి ఇసుకకు రాచుకుని బట్టలంతా చినిగి, శరీర మంతా రక్తగాయాలతో నిండి,

రచన: బి.ఆర్. వరదరాజులు



దొర్లుకుంటూ వస్తున్నాడు ఆ వ్యక్తి. అతడు దీనంగా ఒంటెలు నడుపుతున్నవారిని చూస్తున్నాడు. వారు కొంచెంసేపు విశ్రాంతి తీసుకుంటే, తన బాధ కొంత తగ్గుతుందని అతని ఆశ; కానీ వారికళ్లలో క్రూరత్వం నిండివుంది. వారు ఆ వ్యక్తిపై కొంచెమైనా కరుణ చూపలేదు. వారి మనసులో ఏముందోగాని, ఆ వ్యక్తి బాధతో ఎంత అరుస్తున్నా, వారు అతని వైపు చూడకుండా ఒంటెలను ఇంకా వేగంగా తోలుకుపోతున్నారు.

ఒంటెలు తోలేవారిలో ఓ స్త్రీ, "వర్మా! ఇక మనం ఆగుదాం; లేకుంటే అతను చనిపోతాడు. తరువాత మనం ఇంతకష్టపడి ప్రయోజనం లేకుండా పోతుంది!" అన్నది.

"రేఖా! ఏమిటి అంత భయపడి పోతున్నావు? అతని నోటినుండి విషయాలు రాబట్టాలంటే, అతను కష్టపడాలి; లేకుంటే అతను సులభంగా వాటిని మనకు చెప్పడు!" అన్నాడు వర్మ.

అంతలో ఇంకో వ్యక్తి, "వర్మా! ఇప్పటికే చాలాదూరం వచ్చాం. అతనికి బాగా గాయాలు తగిలాయి. ఇప్పుడడిగామంటే, సులభంగా చెప్పేయగలడు. అ గు దా ం ఇక్కడ!" అన్నాడు.

"అలాగే సా ర ం గా! నిమాటప్రకారం అదీ చూద్దాం!" అంటూ వర్మ తన ఒంటెను ఆపాడు; తక్కిన ఒంటెలు ఆగాయి. తరువాత ఐదుగురూ ఒంటెలనుండి క్రిందికి దిగి, ర క్త గాయాలతో వున్న వ్యక్తి చేతులకు కట్టిన త్రాళ్ళను విప్పారు.

"రత్నసింహా! ఇప్పటికే చాలా దెబ్బలు తిన్నావు; శరీరమంతా హూనమైంది; ర క్తం పారుతున్నది; ఇప్పటికైనా ఆ వజ్రాలు ఎక్కడ దాచావో చెప్పు!" అని ఉరిమాడు మాణిక్యవర్మ.

గాయాలతో అవస్థపడుతున్న వ్యక్తి మెల్లగా కళ్లు తెరచి, "దాహం...దాహం!" అని సన్నగా మూలిగాడు.

చిత్రరేఖ తన ఒంటె మీదవున్న చిన్న కుండను తెచ్చి, దానిలోని నీటిని అతని నోటిలో పోసింది. కొంతసేపటికి ఆ వ్యక్తికి

దాహం తిరి, బాగా కళ్లు తెరచి చూశాడు. "మీ రడిగ వజ్రాలు నావికావు; ఒకరు నాకు ఇచ్చారు; నేను వాటిని మీకు ఇచ్చి, నాపేరు చెడగొట్టుకోవడం నాకు ఇష్టంలేదు. మీరు నా ప్రాణం తీసినా, మీకు వాటిని ఇవ్వను. ఇదే నా ఆఖరి జవాబు!" అని విసుగ్గా అన్నాడు.

"నీకంత పొగరా? చూడు పొగరణు స్తాను!" అంటూ చేతిలోని కొరడాను ఝళి పించాడు వర్మ.

అంతలో పెనుగాలి వీచింది దూరంలో నుండి ఇసుక తెరలు తెరలుగా దొర్లుతూ వస్తున్నది. అది చూసిన సారంగుడు, "వర్మా! మనం ఇక్కడ క్షణమైనా ఇక వుండకూడదు; ఆలావుంటే మనం ఆ ఇసుక తెరలమధ్య సజీవసమాధిలోకి పోతాము. త్వరగా ఒంటె లపై ఎక్కండి!" అంటూ ఒంటెలపై ఎక్కి వాటిని నడుపుతూ పోయాడు; ప్రాణ భీతితో మిగతావారు క్రింద పడివున్న రత్నసింహుణ్ని వదలి, వేగంగా ఒంటెలపై ఎక్కి దూరంగా వెళ్ళిపోయ-యి.

అందరూ వెళ్ళాక రత్నసింహుడు మెల్లగా పైకి లేచాడు. ఇక అక్కడ వుంటే, వెళ్ళిన వాళ్ళు తిరిగి తనను పట్టుకుంటారని వేగంగా మరోవైపు నడిచాడు చాలాదూరం నడిచినా, అది అంతా ఇసుక మయం. అతను తప్పించు కునేందుకు, తలదాచుకునేందుకు మార్గమే లేదు చివరికి అతను పెద్ద ఇసుక కుప్ప వెనుక

ప్రక్కన నక్కాడు. చాలాదూరం నడవటం వల్ల అలసి, అలాగే నిద్రపోయాడు.

* * *

రత్నసింహుని వద్దవున్న వజ్రాలు కాంచన పురం పాలించే ప్రచండసేనునివి. ఆయన వజ్రాలు-పెద్ద గజదొంగల ముఠాను అడవిలో పట్టుకున్నపుడు, వారినుండి సంపాదించాడు. అవి చాలా విలువైనవని వాటిని గురించి ఎవరికీ చెప్పకుండా, ఆస్థాన వజ్రాల నిపుణుడు రత్నసింహుణ్ని పిలిపించి, పరిక్షించమన్నాడు; అతను వాటిని బాగా పరిశీలించి, అవి చాలా విలువైనవని, ఒక్కొక్కటి లక్షవరహాల విలువ వుంటుందని చెప్పాడు.

తరువాత మహారాజు వాటిని ఆస్థాన జ్యోతిష్కుని రావించి, అంతటి నిలువైన వజ్రాలు తన వద్దవుంటే, తనకు ఏమైనా ఆపద సంభవిస్తుందా?- అని ప్రశ్నించాడు. జ్యోతిష్కుడు ఏవేవో లెక్కలు వేసి, ఇంక సంవత్సరం వరకు ఆ వజ్రాలు ఎవరి వద్ద వున్నా, వారికి చాలా కీడు మూడుతుందని, ప్రాణాపాయం కూడా కలగవచ్చునని రాజు గారికి చెప్పాడు. రాజు జ్యోతిష్కునితో తన వద్దవున్న వజ్రాల సంగతి ఎవరికీ చెప్పవద్దని గట్టిగా చెప్పి, తన విశ్రాంతి మందిరానికి వెళ్ళి పోయాడు.

మరునాడు మహారాజు రత్నసింహుని తన వద్దవున్న ఐదు వజ్రాలను అతనికిచ్చి, వాటివల్ల తనకు కీడు మూడనున్నదని, సంవత్సరం వరకు దాచి, తరువాత తనకిమ్మని చెప్పి పంపాడు. రాజుగారికి రత్నసింహునిపై అపారమైన నమ్మక ముంది. అందుకే ఇంతటి విలువైన వజ్రాలు అతనికిచ్చాడు.

రాజుగారు వెళ్లాక రత్నసింహుడు ఆ వజ్రాలు ఎక్కడ దాచాలా - అని ఆలోచించ సాగాడు. ఆ సమయంలో అతని కుమారుడు మనోహరుడు వ్యాపారం నిత్తం విదేశాలకు వెళ్ళాడు. ఇంట్లో అవి వుంటే, దొంగలు దోచుకుంటారని వాటిని తీసుకెళ్ళి ఎడారిలో ఓ స్థలంలో దాచిపెట్టి, దానికి కొన్నిగుర్తులు పెట్టుకుకుని ఇంటికి వచ్చేశాడు.

రత్నసింహుడు గుట్టంపై ఎడాగికి ఒంటరిగా వెళ్ళి, రాత్రికి తిరిగిరావడం, ప్రక్క ఇంటిలో వున్న కంసాలి కూర్మయ్య గమనించాడు. అతనిపై ఏదో అనుమానం కలిగింది. రత్నసింహుడు ఎప్పుడూ ఒంటరిగా ప్రయాణం చేయడు. మెల్లగా రత్నసింహుని ఇంటిలోకి వెళ్ళి ఆవరణలో కట్టివున్న గుర్రాన్ని పరీక్షించి చూశాడు. దాని నోటినుండి తెల్లటి నురగలు వస్తున్నాయి. దానికాళ్లు ఇసుకతో నిండివున్నాయి. దాంతో కూర్మయ్య కొంత ఆలోచనలో పడ్డాడు. రత్నసింహుడు ఆక్కడికి కొద్దిదూరంలో వున్న ఎడారికి వెళ్ళి, ఒట్టిచేతులతో వచ్చాడంటే, అందులో ఏదో మర్మం వుండివుంటుందని గ్రహించి, తన



ఇంటికి వెళ్ళి, సెవకుని ద్వారా మాణిక్య వర్మకు కబురంపించాడు.

కొంతసేపటికి మాణిక్యవర్మ, కంసాలి ఇంటికి వచ్చాడు. సరిగ్గా ఆటువైపు వస్తున్న మంత్రికూరుడు సారంగడు అతని ప్రియురాలు చిత్రరేఖ, సైనాధిపతి కంసాలి ఇంటికి రాత్రివేళ రావడం చూసి, అనుమానంతో లోపలికి వెళ్ళారు. సరిగ్గా ఆ సమయానికి మాణిక్యవర్మ, కూర్మయ్య నవ్వుకుంటూ బయటికిరావడం చూసి, ఇద్దరూ ప్రక్కన నక్కారు. వర్మ, కూర్మయ్య దొంగల్లా అటూ, ఇటూ చూస్తూ, రత్నసింహుని ఇంటిలోప్రవేశించారు. ఆది సారంగునికి ఇంకా అనుమానం కలిగి, చిత్రలేఖతో రత్నసింహుని ఇంట్లోకి వెళ్లాడు. జరిగే విషయమంతా ఎదురింట్లో వున్న వస్తాదు వీరయ్య గమనించసాగాడు. అర్ధరాత్రి సమయంలో రత్నసింహుని ఇంట్లోకి కలుగురు పొంచి, పొంచి పోతున్నారంటే, అందులో రహస్యం వుండాలని అతను మెల్లగా రత్నసింహుని ఇంట్లోకి వెళ్లాడు.

రత్నసింహుడు ఇంట్లో హాయిగా నిద్ర పోతున్నాడు. ఆ సమయంలో ఐదుగురు మనుష్యులు తన ఇంటిముందున్న సంగతి అతనికి తెలియదు. ఉన్నట్టుండి నిద్రలో "వజ్రాలు, వజ్రాలు" అని కలవరించసాగాడు అదివిన్న ఐదుమంది ఆశ్చర్యపోయారు. "ఆఁ వజ్రాలా?" అనిపెద్దగా అరిచారు. దాంతో ఒకరి సంగతి ఒకరికి తెలిసిపోయింది; వారు ఏకమై కూర్మయ్య ఇంట్లోకి వెళ్ళారు.

మాణిక్యవర్మ అందరితో, "రత్నసింహుడు ఏదో వజ్రాలు సంపాదించి ఎడారిలో దాచినట్టున్నాడు. ఆ సంగతి మనందరికీ తెలుసు. అంచేత మనమందరం ఏకమై, ఎలాగైనా ఆ రహస్యాన్ని రత్నసింహుని వద్ద నుండి తెలుసుకుని, వజ్రాలను పంచుకుందాం; మనందరం ఏకంగా వుండాలి; ఒకరినొకరు మోసం చేసుకోకూడదు. నేను రేపటి ఉదయం ఇక్కడికి వచ్చి, మీతో మాట్లాడుతాను. ఇక మీ ఇళ్లకు మీరు వెళ్ళిపోండి!" అన్నాడు. అందుకు అందరూ సమ్మతించి వెళ్ళిపోయారు.

రోజులు గడవసాగాయి. ఐదుమంది రత్నసింహుని వద్దనుండి వజ్రాల రహస్యం తెలుసుకోలేకపోయారు. వారిప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. చివరికి వారికి విసుగు కలిగి ఓరోజు ఐదుమందీ కలిసి రత్నసింహుని బంధించి ఎడారికి తీసుకెళ్ళి, వజ్రాల గురించి అడిగారు. అతను మాత్రం - వారు ఎంత బాధించినప్పటికీ ఆ రహస్యం ఎవరికీ చెప్పక, పెద్ద పెనుగాలి వీచడంతో వారినుండి తప్పించుకుని, ఇసుక కుప్ప వెనుక నక్కాడు.

పెనుగాలి తగ్గాక, దానికి భయపడి పారిపోతున్న వారు ఆగారు. మాణిక్యవర్మ వెనుకకి తిరిగి, "ఏమిటి ఇలా వచ్చేస్తున్నాం? అసలు రత్నసింహుని సంగతి మరచిపోయామే! రండి వేగంగా! అతను అక్కడే పడివుంటాడు; వాడు తప్పించుకున్నాడంటే, వజ్రాలు మనకికదక్కవు!" అన్నాడు.

అందరూ ఒంటెలను వెనుకకి తిప్పి వేగంగా నడపసాగారు. అంతకు మునుపు తానున్న స్థలంలో రత్నసింహుడు కనిపించలేదు. ఇసుకలో అక్కడక్కడ అతని కాలి అడుగులు మాత్రం కనిపించసాగాయి.

"చూశారా, నేను అనుమానించినట్లే జరిగింది-వాడు తప్పించుకున్నాడు!" అన్నాడు వర్మ.

"వర్మా! మననుంచి ఈ ఎడారిలో వాడు తప్పించుకుని ఎక్కడికి పోగలడు? వాడికి గాయాలు బాగా తగిలాయి. మనకి భయపడి



ఇక్కడే ఎక్కడో ఇసుక కుప్పలో నక్కివుంటాడు. మనం ఒంటెలనుండి దిగి నలువైపుల వెతికామంటే, వాడు దొరికిపోతాడు!" అంటూ సారంగుడు ముందు నడిచాడు; అందరూ ఒంటెలను దిగి, వెతకసాగారు.

రత్నసింహుడు మెల్లగా కళ్ళు తెరిచాడు. అతని శరీరమంతా పచ్చిపుండులా వుంది. మెల్లగా పైకి లేచి, చుట్టు చూశాడు. అతని కనుచూపు మేరలో ఎవరూ కనిపించలేదు. మెల్లగా ముందుకి నడిచాడు. ఉన్నట్టుండి అతనికి వజ్రాల సంగతి జ్ఞప్తికి వచ్చింది వాటిని తీసుకు వెళ్ళిపోదామనుకుని కొంత వేగంగా నడిచాడు. ఓచోట కుప్పలు కుప్ప

లుగా ఖర్జూర చెట్లు కనిపించాయి. వాటిని చూడ్డంతో సంతోషమైంది; వజ్రాలను అక్కడే దాచివుంచాడు. రత్నసింహుడు ఆటువైపు వేగంగా నడవనారంభించాడు. అక్కడ నాలుగు ఖర్జూర చెట్లు మాత్రం విడిగా వున్నాయి; మిగతా చెట్లకూ వీటికీ కొద్ది దూరం వుంది. ఆ నాలుగు ఖర్జూర చెట్ల మధ్యస్థలంలో కొంత ఇసుకను పైకి తోడాడు. లోపల ఓ జత చెప్పులు దొరికాయి. ఎడమ చెప్పులో మూడు వజ్రాలు కుడిచెప్పులో రెండు వజ్రాలు చిన్న ఆకులో చుట్టబడి వున్నాయి. అతడు సంతోషంతో వాటిని చూసి, తిరిగి లోపల పెట్టి తన కాలికి వున్న చెప్పులను అక్కడే వదిలి ఆ చెప్పులను తన కాలికి వేసుకుని బయలుదేరాడు.

రత్నసింహుడు కొంతదూరం ముందుకి నడిచాడు. అంతలో అతనికెదురుగా ఐదు మంది రావడం చూసి భయంతో వెనక్కి తిరిగాడు. కానీ శరీరమంతా గాయాలు తగలి, బాధగా వుండటం వల్ల క్రింద పడ్డాడు వర్మ వేగంగా ముందుకి వచ్చి, "రత్నసింహా! ఇప్పటికైనా ఎక్కడ దాచావో మర్యాదగా చెప్పు; లేకుంటే నీ ప్రాణాలు తీసేస్తాను, జాగ్రత్త!" అని అన్నాడు.

రత్నసింహుడు బదులు పలకకుండా పైకి లేచి నిలబడ్డాడు. అక్కడి కొచ్చిన సారంగుడు రత్నసింహుని కాలికి వున్న కొత్త చెప్పుల్ని చూసి, "వర్మా! ఇదేమిటి ఆశ్చర్యం! ఇంతకుమునుపు రత్నసింహుని చెప్పులు బాగా చినిగి పాతబడిపోయినవి ఇప్పుడు కొత్తగా ప్రకాశిస్తున్నాయి! ఇతనికి ఇంద్రజాలమేదైనా తెలుసునా?" అని ప్రశ్నించాడు.

అందరూ అతని చెప్పులకేసి చూశారు. "సారంగా! ఇంద్రజాలమేదీ ఇందులో లేదు ముందు అతని చెప్పులను తీసి నాకివ్వు!" అన్నాడు వర్మ.

ఆ మాటలకు భయపడి, రత్నసింహుడు వెనక్కి రెండడుగులు వేశాడు.

(ఇంకావుంది)



# గండభేరుండడు

## 2

జరిగిన కథ: కాంచనపుర మహారాజు ఐదు వజ్రాలను దాచమని రత్నసింహుని చేతికిచ్చాడు. వజ్రాలను అతను ఎడారిలో దాచాడు. వర్మ, సారంగుడు, చిత్రరేఖ, కూర్మయ్య, వీరయ్య ఆ సంగతి తెలుసుకుని, రత్నసింహుని ఎడారికి తీసుకుపోయి బాధపెట్టసాగారు. కానీ రత్నసింహుడు వారినుండి తప్పించుకుని, ఎడారిలో ఒకచోట చెప్పులో దాచిన వజ్రాలను తీసుకున్నాడు. ఆంతలో ఐదుమంది అతన్ని చుట్టుముట్టారు. వారిని చూసి భయపడి రత్నసింహుడు వెనక్కి అడుగులు వేయసాగాడు.

రచన: బి.ఆర్. వరదరాజులు

వస్తాడు వీరయ్య కోపంతో రత్నసింహుని ఒక్క తన్ను తన్నాడు. అతను ఎగిరి క్రింద పడ్డాడు. చెప్పులు రెండూ ప్రక్కగా పడ్డాయి. సారంగుడు వాటిని తీసుకెళ్ళి వర్మచేతి కిచ్చాడు. వర్మ చెప్పుల్ని ఆడించి చూశాడు. వాటిలోవున్న చిన్న కాగితంమడత క్రింద పడింది. దాన్ని తెరిచి చూశాడు. అందులో మొత్తం ఐదువజ్రాలు మిలమిల మెరుస్తున్నాయి. వాటిని చూడటంతో వారి ముఖాలు వికసించాయి. ఐదువజ్రాలను ఐదుగురూ పంచుకున్నారు.

తరువాత చిత్రరేఖతప్ప మిగతా నలుగురూ కత్తులతో రత్నసింహునిపై పడి, ఇష్టంవచ్చిన రీతిగా అతణ్ని పొడిచారు. బాధకు తాళలేక అతను పెద్దగా అరవసాగాడు. వారు అతని అరుపులు లెక్కచేయక, అతన్ని ఓమూలకు నెట్టి వెనక్కి తిరిగారు. ఐదుమంది తమ ఒంటెల నెక్కి రాజ్యంవైపు ప్రయాణించారు.

కొంతసేపు అయ్యాక ఎడారిలో ఓ అందమయిన యువకుడు ఈ లవేసుకుంటూ గుర్రంమీద వస్తున్నాడు. అతనికి సమీపంలో ఓవ్యక్తి ఇసుకలో పొర్లుతుండటం చూసి ఆశ్చర్యపోయి, గుర్రాన్ని అక్కడికి పోనిచ్చి ఆపి, క్రిందికి దిగి, అతనివద్ద కెళ్ళి, "యెవరయ్యా నువ్వు?" అంటూ ఆవ్యక్తి ముఖాన్ని తనవైపుకి తిప్పుకున్నాడు. వెంటనే "నాన్నా!" అని గట్టిగా అరిచాడు.

ఆ అరుపువిని రత్నసింహుడు మెల్లగా కళ్లు తెరిచి, "మనోహరా!" అంటూ కన్నీరు మున్నీరుగా కార్చాడు.

"నాన్నా! ఏమిటిదంతా? ఎవరు నిన్నిలా హింసించారు? వారి రక్తాన్ని కళ్ళచూడందే నేను విశ్రమించను!" అని గట్టిగా అరిచాడు.

రత్నసింహుడు, "కుమారా! నావద్ద మహారాజు ఇచ్చిన ఐదువజ్రాలు వున్నాయి. వాటిని దొంగిలించుకు పోడానికి వచ్చి, ఐదుమందీ నన్ను హింసించి, వజ్రాలు తీసుకుని వెళ్ళిపోయారు. ఆ వజ్రాలను సంపాదించి మహారాజుకు ఇచ్చి, నాపేరు నిలబెట్టు; అప్పుడే నా ఆత్మకు శాంతి!" అని మెల్లగా అన్నాడు.

"అలాగే నాన్నా! ఇంతకీ ఆ ఐదుమంది యెవరు? వారి వివరాలు చెప్పు; వారివద్ద

వున్న వజ్రాలు తీసుకొచ్చి రాజుగారికిస్తాను!" అన్నాడు మనోహరుడు.

రత్నసింహుడు జవాబు చెప్పాలని మెల్లగా నోరు తెరిచి, "మా...మా...మా" అంటూ వాళ్ళ వివరాలు చెప్పకుండానే మరణించాడు. మనోహరుడు ఎంతో విచారించాడు. ఎలాగైనా ఆ ఐదుమంచిని పట్టి, వారినుండి వజ్రాలను తీసుకురావాలని మనసులో గట్టిగా తలచి, తండ్రి శవాన్ని ఆ ఇసుకలోనే పాతిపెట్టి పుట్టెడు దుఃఖంతో గుర్రాన్నెక్కి రాజ్యంవైపు నడిపాడు.

మనోహరుడు మెల్లగా ఇల్లు చేరాడు. చుట్టుపక్కల వాళ్ళు రత్నసింహుని గురించి అడిగారు. వారికి వజ్రాల సంగతితప్ప, మిగిలిందంతా చెప్పాడు; అందరూ విచారించారు.

వారంరోజుల తరువాత మనోహరునికి రాజుగారి దగ్గిర్నించి కబురొచ్చింది మనోహరుడు ఆరోజు సాయంకాలమే వెళ్ళి రాజును కలిశాడు.

"మనోహరా! మీ నాన్నగారు చనిపోయినట్లు తెలిసింది; అతను చనిపోయేటపుడు నీతో ఏదయినా రహస్యం చెప్పాడా?" అని అడిగాడు.

"మహారాజా! మా నాన్న అంతా నాకు చెప్పాడు. అసలు ఆయన చనిపోడానికి కారణమే మీ రిచ్చిన వజ్రాలు; కానీ ఆయన ఆ వజ్రాలు ఎవరివనేసంగతి నాకుతప్ప ఎవరికీ చెప్పలేదు. ఆ వజ్రాలు దొంగిలించిన వాళ్ళు ఈ రాజ్యంలోనే వున్నారు. నా ప్రాణం పోయేంతలో ఆ వజ్రాలుతెచ్చి మీకు సమర్పిస్తాను. మా నాన్నను చంపినవారి రక్తం



నా కళ్ళతో చూస్తాను!" అని కోపంగా చెప్పాడు మనోహరుడు.

అదివిన్న మహారాజు చింతిస్తూ, "రత్న సింహుని త్యాగానికి ఎంతో మెచ్చుకోవాలి. నా వజ్రాలవల్ల అతను ప్రాణం పోగొట్టుకున్నాడు. నా వజ్రాలు పోయినా ఫర్వాలేదు. ఆ ద్రోహుల్ని పట్టి తీసుకురా; వారికి తగిన దండన విధిస్తాను. నీకు ఏదయినా సహాయం కావాలంటే కోరుకో!" అంటూ చేతిలోని రాజ ముద్రికను మనోహరుని కిచ్చి, "నీకు యే సహాయం ఎప్పుడు, ఎక్కడ కావాలంటే, నా ముద్రికను చూపించావంటే, వెంటనే లభిస్తుంది; అందరూ దీనికి తల వంచుతారు; ఇక నీవు వెళ్ళవచ్చు!" అన్నాడు.

మనోహరుడు అక్కణ్ణించి తిన్నగా రాజు గారి తోటలోకి వెళ్లాడు. అది సాయం సమయం; చల్లని పిల్లగాలులు వీస్తుండటంవల్ల ఓ చెట్టుక్రింద కూర్చున్నాడు. కొంతసేపటికి ఎదురువైపునుండి ఓ యువతీ, యువకుడూ గుర్రాలపై మాట్లాడుకుంటూ రా సా గా రు. మనోహరుడు వజ్రాలు దొంగిలించిన వాళ్ళ గురించి ఆలోచించసాగాడు. వా రిద్దరూ మనోహరుని దాటి మెల్లగా వెళ్లారు. అప్పుడు వారి మాటలు కొన్ని మనోహరుని చెవులోపడ్డాయి.

"రేఖా! ఈ వ్యక్తి రత్న సిం హు ని లా వున్నాడుకదూ?" అన్నాడు యువకుడు.

తన తండ్రిపేరు వారినోట వి న డం తో మనోహరుడు ఆశ్చర్యంతో అక్కణ్ణించి లేచి వారి వెనకనే కొంత వేగంగా నడుస్తూ, వారి మాటలు వినసాగాడు.

"సారంగా! మనం ఇక ఈ రాజ్యంలో వుండకూడదు. ఆ వజ్రాలతో వేరే రాజ్యం వెళ్ళిపోదాం!" అన్న దా యువతి.

"రేఖా! నేనూ దాన్నిగురించే ఆలోచిస్తున్నాను. త్వరలో మనం ఇక్కణ్ణించి వెళ్ళిపోదాం. అంతవరకూ నీ దగ్గిరున్న వజ్రాన్ని జాగ్రత్తగా దాచు; ఎవరికంట పడనీయకు!" అన్నా డా యువకుడు.

అదివిన్న మనోహరునికి రక్తం వేడెక్కిపోయింది. తన తండ్రిని చంపిన హంతకుల్లో వీరిద్ద రున్నారని, వీరిని చంపాలనే కోపంతో "హంతకులారా! నా తండ్రిని చంపి వజ్రాల్ని దొంగిలించింది మీరేనా?" అని గట్టిగా అరిచాడు.

ఆ మాటలకు ముందు గుర్రాన్ని నడుపుతున్న సారంగుడు, "రేఖా! గుర్రాన్ని వేగంగా నడుపు; లేకుంటే వాడు మనల్ని చంపుతాడు!" అంటూ గుర్రాన్ని గట్టిగా అదిలించాడు. అంతే! క్షణంలో రెండుగుర్రాలూ దుమ్మునులేపుతూ వేగంగా వెళ్ళిపోయాయి. మనోహరుడు ఏమీ చేయలేక అలాగే వారు వెళ్లినవైపు చూస్తూ నిలబడిపోయాడు.

సారంగుడు అంతఃపురం చేరాక, చిత్రరేఖ చేయిపట్టుకుని వేగంగా లోపలికి పరిగెత్తాడు. వారి కెదురుగా వస్తున్న మాణిక్యవర్మ వారి వేగాన్నిచూసి ఆశ్చర్యపోయి ఆగాడు. వర్మని చూడగానే సారంగుడు తన వేగాన్ని తగ్గించి, "వర్మా! నా గదిలోకి రా; నీతో మాట్లాడాలి!" అంటూ వెళ్లిపోయాడు.

మాణిక్యవర్మ ఆశ్చర్యంతో సారంగుని గదిలోకి వెళ్లాడు. "వర్మా! మనకు అపాయం రాబోతుంది. రత్నసింహుని కుమారుడు మనం వజ్రాలు తీసుకున్నసంగతి పసికట్టేశాడు. మనం వెంటనే రాజ్యంనుండి వెళ్ళిపోవాలి!" అన్నాడు.

"సారంగా! ఇలా జరుగుతుందని ముందే నేను ఊహించాను. ఈరోజు గండభేరుండ దీవికి వెళ్తున్నాను; రాజుగారి సమ్మతి తీసుకున్నాను. నెలరోజులు అక్కడవుండి, తరువాత ఇక్కడికి వస్తాను. మీరు ఎక్కడికయినా వెళ్లండి; నేను వెళుతున్నాను!" అంటూ మాణిక్యవర్మ బయటికి వెళ్లిపోయాడు.

"సారంగా చూశావా! వర్మ యెంత నీచమైన వాడో! తన జాగ్రత్తమాత్రం తను తీసుకున్నాడు; మనల్ని గాలికి వదిలేశాడు. ఇప్పుడు మనం ఎక్కడికైనా వెళ్ళిపోదాం!" అంది రేఖ.

"మనం ఎక్కడికి వెళ్దామా?- అనేదే ఆలోచిస్తున్నాను!" అని విచారంతో అన్నాడు సారంగుడు.

"కాంచనపురం వెళదాం. అది యిక్కడినుండి వెయ్యియోజనాల దూరంలో వుంది. అంతదూరానికి వెళ్ళిపోతే, మనల్నిగూర్చి యెవరికీ తెలియదు. రేపే మన ప్రయాణం. ఇక్కట్లించి ఓడద్వారా వెళదాం. మీనాన్నగారికి ఈసంగతి నీవు ఎలాగయినా తెలియజెయ్యి!" అంది రేఖ.

"అలాగే!" అంటూ సారంగుడు తండ్రి గదిలోకి వెళ్ళి, "నాన్నా! నేనూ, చిత్రరేఖా కాంచనపురం వెళ్ళి, కొన్నిరోజు లుండి వస్తాము. రేపే మా ప్రయాణం!" అన్నాడు.

"ఇదేమిటీ! అందరూ ఇలా వెళ్తున్నారు? ఎందుకు మీరు వెళ్ళడం? ఇప్పుడే మాణిక్య వర్మ గండభేరుండదీవికి వెళుతున్నట్టు చెప్పి వెళ్ళాడు!" అన్నాడు మంత్రి.

"ఆ సంగతి నాకు తెలీదు. నేను వారం రోజులముందే అనుకున్నాను. ఇప్పుడు వెళ్ళి తీరాలి; రేపు ఓడలో నేనూ, చిత్రరేఖా వెళుతున్నాము!" అనిచెప్పి వెళ్ళిపోయాడు.

మాణిక్యవర్మ రాజ్యంవదిలి చాలాదూరం ముందుకు వెళ్ళిపోయాడు. గుర్రంపై పోతూ ఏవేవో పగటికలలు కనసాగాడు. తనచేతిలో వున్న వజ్రాన్ని అమ్మి, దానిద్వారా వచ్చే ధనంతో తాను ఎలావుండాలో ఆలోచించ సాగాడు. ఉన్నట్టుండి గుర్రం తక్కున ఆగి పోవడంతో కళ్ళుతెరిచి చూశాడు.

ఎదురుగా వస్తాడు వీరయ్య రెండుచేతు లతో గుర్రాన్ని ఆపివున్నాడు.

"వీరయ్యా, ఏమిటిది? ఎందుకు గుర్రా న్నాపావు?" అని ప్రశ్నించాడు వర్మ.

"నా సంగతికేంగాని, నువ్వేమో దొంగ తనంగా ఎక్కడికో వెళుతున్నావటగా! నాకు తెలీకుండా ఈప్రయాణ మేమిటో మర్యా దగా చెప్పు; లేకుంటే ని న్నిక్కడే పాతే స్తాను!" అని గట్టిగా ఉరిమాడు వీరయ్య.

"వీరయ్యా! నీకు చెబుదామనుకునే వస్తు న్నాను; కాని, సమయం దొరకలేదు. రత్న సింహుని కుమారుడు మనం వజ్రాలు తీసు కున్న సంగతి పసిగట్టాడు. అతను మనల్ని పట్టుకునేలోగా, ఇక్కణ్ణించి చాలాదూరానికి వెళ్ళిపోవాలని గండభేరుండదీవికి ప్రయాణ మయ్యాను. వీలుంటే, నీవు యిక్కడనుండే తప్పించుకో!" అంటూ గుర్రాన్ని వేగంగా ఆది లించాడు. వర్మమాటలు వింటూ వీరయ్య పక్కకి తొలగడంతో, వర్మగుర్రం ముందుకు దూసుకుపోయింది. వర్మమాటలకు బలశాలి అయిన వీరయ్య నీరుగారిపోయాడు; వెంటనే వేగంగా తన ఇల్లు చేరాడు.

కూర్మయ్య ఇంట్లో ఏదో పనిచేసుకుంటూ, వెనక ఆలికిడి కావడంతో తిరిగిచూశాడు.

వస్తాడు వీరయ్య చెమటలు కార్చుకుంటూ నిలబడివుండటం గమనించాడు.

"వీరయ్యా! ఏనిటి రాత్రిపూట నీ కింత చెమట కారుతోంది? ఏదైనా చూసి భయ పడ్డావా?" అని అడిగాడు కూర్మయ్య.

"నీకు ఎగతాళిగావుందా నన్నుచూస్తే? నా కొక్కడికేకాదు నీకూ అపాయం రానుంది. నీ పక్కయింట వున్న మనోహరుడు మనం వజ్రాలు దొంగిలించిన సంగతి తెలుసు కున్నాడు. అతడు వచ్చి మనల్ని పట్టుకునే లోగా మనం ఇక్కణ్ణించి పారిపోవాలి. మిగి లిన ముగ్గురూ వెళ్ళిపోయారు; నేను మత్స్య గంధిపురానికి వెళుతున్నాను. ఆ సంగతి నీకు చెప్పడానికి వచ్చాను. నీవు ఎక్కడికయినా పారిపో!" అనిచెప్పి వేగంగా వెళ్లిపోయాడు-వీరయ్య.

ఆ మాటలకు కూర్మయ్య గతగడ వణికి పోయాడు. అతనికి తప్పించుకుపోడానికి మార్గం కనిపించలేదు. తన ఇంటిని, ఆస్తి పాస్తులను విడిచివెళ్ళడానికి మనసురాలేదు, అక్కడేవుండి, మనోహరుని కన్నుగప్పాలని యోచించాడు. చివరికి ఓ నిశ్చయానికి వచ్చి మనోహరుని ఇంటికి వెళ్లాడు.

"మనోహరా! ఏమిటి విచారంగావున్నావు? ఏమైనా విశేషాలున్నాయా?" అనడిగాడు.

"కూర్మయ్యా! నేను దురదృష్టవంతుణ్ణి. మా తండ్రిని చంపినవారిలో ఇద్దరిని కళ్ళారా చూశాను; కానీ, పట్టుకోలేకపోయాను. అదే నాకు విచారంగా వుంది!" అని చెప్పాడు.

"మనోహరా! చాలా రోజులుగా నీకు ఓ సంగతి చెప్పాలనుకున్నాను. కానీ, ప్రాణ భయంతో వూరకుండిపోయాను. నీ ముఖం చూసినప్పుడల్లా నాగుండె తరుక్కుపోతూంది. ఈ సంగతి నేను చెప్పినట్టు ఎవ్వరికీ చెప్ప కుండా వుంటావా?" అన్నాడు కూర్మయ్య-అతని ముఖంవంక చూస్తూ.

"నేను ఎవ్వరికీ చెప్పను. ఆ సంగతేదో వివ రంగా చెప్పండి; నామీద నమ్మకం లేకపోతే చెప్పకండి!" అన్నాడు మనోహరుడు.

"మీనాన్నను చంపి, వజ్రాలు దొంగిలిం చిన వారిగురించి నాకు తెలుసు!" అన్నాడు.

(ఇంకావుంది)






## 3

జరిగినకథ: రత్నసింహుని యెడారిలో అయిదుమంది చావగొట్టి, అతని దగ్గిరున్న వజ్రాలను తీసుకుని పారిపోయారు. ఆ సంగతి తెలుసుకున్న అతని కుమారుడు మనోహర్ అతనితండ్రిని చంపిని వాళ్ళని చంపుతానని శపథంచేశాడు. ఆ సంగతి తెలుసుకున్న సారంగుడు, చిత్రరేఖ, వీరయ్య, వర్మ- ఆరాజ్యంవదలి పారిపోయారు. కూర్మయ్య మనోహర్ వద్దకువచ్చి, అతని తండ్రిని చంపినవారి వివరాలు తాను చెబుతానన్నాడు.

రచన: బి.ఆర్. వరదరాజులు

కూర్మయ్య మాటలు విన్న మనోహరుడు అతని వేగంగా వద్దకు వచ్చి. "ఆసంగతి ఇన్ని రోజులూ నాకెందుకు చెప్పలేదు? ఇప్పటికైనా అంతా వివరంగా చెప్పు; వారిని ఖండ ఖండాలుగా నరికి పారేస్తాను!" అనరిచాడు.

"ఆవేశపడకు మనోహరా! చెబుతాను మీ తండ్రిని చంపి వజ్రాలు దొంగిలించింది సేనాపతి మాణిక్యవర్మ, ఆస్థాన నర్తకి చిత్రరేఖ, మంత్రి కుమారుడు సారంగడు, వస్తాదు వీరయ్య - వీరునలుగురి వద్ద వజ్రాలు వున్నాయి. ఓసారివాళ్ళు ఆవజ్రాలు విలువ కట్టేందుకు నాదగరికి వచ్చారు. అప్పుడు తెలిసింది నా కా సంగతి!" అన్నాడు కూర్మయ్య.

"మా నాన్నవద్ద అయిదు వజ్రాలు వుండాలి. అయన చనిపోయేటపుడు ఐదు మంది కలిసి ఆయన్ని చంపినట్లుగా నాతో చెప్పాడు. మరి ఆ అయిదోవ్యక్తి ఎవరు?" అని అడిగాడు ఆవేశంగా.

దాంతో కూర్మయ్యనోట్లో పచ్చివెలక్కాయ పడ్డట్లయింది. "మీనాన్న చెప్పింది నీవు సరిగా వినివుండవు. నావద్దకు నలుగురూ నాలుగు వజ్రాలతో మాత్రం వచ్చారు. అంతే! ఇంకోమాట-వజ్రాలు దొంగిలించిన నలుగురూ రాజ్యం వదిలి వెళ్ళిపోయారు. వారు ఎక్కడికి పోయారో నీవు ఎలాగయినా తెలుసుకుని వాళ్ళని పట్టుకుని వజ్రాలు తీసుకో! నేను చెప్పినట్లు ఎవ్వరికీ చెప్పకు; వస్తాను మరి!" అంటూ వెళ్ళిపోయాడు-కూర్మయ్య.

మనోహరుడు కొంతసేపు యోచించాడు. మరునాడు రాజుగారితో కలిసి మాట్లాడి, తాను ప్రయాణం చేయాలనుకున్నాడు.

అర్ధరాత్రి అయింది కూర్మయ్య ఇంట్లో కూర్చుని ఆలోచిస్తున్నాడు. తాను మనోహరుడికి నలుగురి పేర్లుచెప్పి, తనపేరు చెప్పలేదు తాను వజ్రం దొంగిలించిన సంగతి మనోహరుడు తెలుసుకుంటే, తనని ప్రాణాలతో; వదలడు వజ్రాలు దొంగిలించిన ఆ నలుగురికి వారిపేర్లు చెప్పానని తెలిస్తే తనని ఊపిరితో వదలరు. తన ప్రాణానికి ఆపాయం రాకుండా వుండటానికి తగిన మార్గంకోసం చాలాసేపు యోచించాడు. చివరికి ఓ నిశ్చయానికి వచ్చి గదిలోకి వెళ్ళి, పెట్టెలోవున్న

పదునయిన బాకును బయటికితీసి, దాన్ని దుస్తులలో దాచుకుని ముఖానికి ముసుగు వేసుకుని మనోహరుని ఇంటిలోకి మెల్లిగా దూరాడు.

ఆసమయంలో మనోహరుడు నిద్రపోలేదు. మరునాటి తన ప్రయాణం గురించి ఆలోచన చేస్తున్నాడు. తన తండ్రిని చంపిన దుర్మార్గులను ఎలా చంపాలా అనే ఆలోచనలో వున్నాడు. వెనుకనుండి గదిలోకి వచ్చిన కూర్మయ్యను గమనించలేదు; మనోహరుడు హాయిగా నిద్రపోతున్నాడనుకున్న కూర్మయ్య చేతిలోని బాకుతో అతన్ని పొడవబోయాడు, ఏదో అడుగుల చప్పుడువిని, చటుక్కున కళ్ళుతెరచి, రానున్న అపాయం గమనించి, కాలితో లాగి ఓ తన్నుతన్నాడు. ఆ దెబ్బకు క్రిందపడిన కూర్మయ్య కత్తిని అక్కడేవదిలి వేగంగా బయటి కురికాడు మనోహరుడు కూడా అతని వెనుకనే బయటికి వచ్చాడు. అంతలోనేకూర్మయ్యతన ఇంట్లోదూరి, గడియ వేసుకున్నాడు. బయట మనోహరుని కెవరూ కనిపించలేదు. చాలా ముందుకెళ్ళి చూసి, ఇక లాభంలేక తిరిగి ఇంటికి వచ్చేశాడు.

మరునాడు మనోహరుడు రాజును కలిసి, తనకు తెలిసిందంతా చెప్పాడు. ఆదివిన్న మహారాజు ఆశ్చర్యపోయి, "మనోహరా! నా కాశ్చర్యంగా వుంది. మాణిక్యవర్మ, సారంగుడు చాలా మంచివా ళ్ళనుకున్నాను. ఇంత ద్రోహం తలపెడతారని అనుకోలేదు. వర్మ గండభేరుండదీవికి వెళ్ళాడు; సారంగ, చిత్ర



రెఖలు కాంచనపురాని కెళ్ళారు; నువ్వు ఈ రోజే బయలదేరు; నీకు కావలసిన ఏర్పాట్లు నేను చేస్తాను!" అన్నాడు.

"చాలా సంతోషం మహారాజా! నాకు ఓ పడవ కావాలి; ఈరోజే నేను ప్రయాణ మవడానికి సిద్ధమౌతున్నాను; ఇది చెప్పడానికే మీవద్దకు వచ్చాను!" అన్నాడు-మనోహరుడు.

"నీకు ఏ సహాయం కావాలన్నా నా ఈ రాజముద్రికద్వారా అందుతుంది!" అని చెప్పాడు-మహారాజు.

"అలాగే మహారాజా! నేను శెలవు తీసుకుంటాను!" అని మనోహరుడు అక్కణ్ణించి బయలదేరి వెళ్ళాడు. ఇప్పు డతనికి తన తండ్రిని చంపిన ముగ్గురి ఊనికీ తెలిసింది;



మిగతా ఇద్దరిలో వీరయ్య ఎక్కడి కెళ్ళాడో-అన్న సంగతిమాత్రం తెలియలేదు. ఆసంగతి తెలుసుకోవా లనుకుని కూర్మయ్య దగరికి వెళ్ళాడు. కూర్మయ్య అతన్ని చూడగానే రాత్రి తను అతని ఇంటికి పోయింది తెలుసు కున్నాడా-అని భీతిచెందాడు. కాని, మనోహరుడు అడిగింది విని, మనసులో సంతోషపడి, "మనోహరా! వస్తాడు వీరయ్య మత్స్యగంధి పురం వెళ్ళినట్లు నాకు తెలిసింది. అక్కడ్నికి నీవు వెళ్ళిచూడు!" అన్నాడు.

కూర్మయ్యచేసిన సహాయానికి కృతజ్ఞతలు చెప్పుకుని, ఇంటికి వెళ్లాడు-మనోహరుడు.

అరోజు రాత్రి మనోహరుడు రాజుగారి సహాయంవల్ల లభించిన - అతివేగంగాపోయే పడవనెక్కి సముద్రంలో ప్రయాణం చేయ సాగాడు. అతడు తన ప్రయాణం గురించి ఎవరికీ చెప్పలేదు;సహాయానికి ఎవరినీ కూడా వెంటతీసుకుపోలేదు.

మూడురోజుల తరువాత అతనికి ముందు కొంతదూరంలో పెద్దఓడ పోతున్నట్టు కన బడింది. ఆ ఓడలో తన శత్రువులెవరై నా వుండవచ్చుననే అనుమానం కలిగి, పడవను కొంచెం వేగంగా నడపసాగాడు.

ఉన్నట్టుండి నీటిమీద ఏదో తేలుతూ తన వేపు వస్తున్నట్టు కనిపించింది. ఆశ్చర్యంతో పడవను అటుకేసి నడిపాడు. అది ఓ స్త్రీ ఆకారం అని గుర్తించి వెంటనే ఆ యువతిని మెల్లిగా తన పడవలోకి చేర్చాడు అమెను యెవరో గొంతుపిసికి, నీటిలోకి తోసివేశారని తెలుసుకుని, అమెను మెల్లిగా కదిపి, తన

దగ్గిరున్న మూలికను ఆమె ముక్కువద్ద చూపాడు. కొంతసేపటికి ఆమె మెల్లిగా కదిలింది; అదిచూసి మనోహరుడు చాలా సంతోషించాడు. తరువాత కళ్లుతెరిచి, "ఆఁ నువ్వు రత్నసింహుని కుమారుడవు కదూ!" అంది.

అదివిన్న మనోహరుడు ఆశ్చర్యపోతూ, "అరే! నాగురించి నీకు ఎలా తెలుసు? అసలు నువ్వెవరు? నిన్ను చంపడానికి ప్రయత్నించినవా రెవరు?" అనడిగాడు.

అందుకు ఆ స్త్రీ మెల్లగా, "ఇక నే నెంతోసేపు బ్రతకను; చనిపోయేముందు నాకు తెలిసిన విషయం నీకు చెప్పేస్తాను. నాపేరు చిత్రరేఖ. నేను, నా ప్రియుడు సారంగుడు, మిగతా ముగ్గురమూ కలిసి, మీ నాన్నను చంపి, ఆయనవద్దగల వున్న వజ్రాలు దొంగిలించాము!" అని ఆగింది.

అదివిన్న మనోహరుని రక్తం వుడికిపోసాగింది. కాని పైకి కనబర్చకుండా ఆమె కేసే చూడసాగాడు.

"మనోహరా! మాగురించి నీవు తెలుసుకున్నావని నేను, సారంగుడు కాంచనపురానికి పోవడానికి నిశ్చయించుకుని, ఓడలో మూడు రోజుల క్రిందట బయలుదేరాం. కానీ దుర్బుద్ధి సారంగుడిలో వుందని నాకు తెలీదు. నా వద్దవున్న వజ్రం అతనికి నమ్మికతో ఇచ్చాను. ఈ రోజు ఉదయం నేను ఓడపై నిల్చుని క్రిందికి చూస్తున్నాను. అప్పుడు అక్కడ ఎవరూ లేరు. ఉన్నట్టుండి సారంగుడు కత్తితో నా వీపుపై బలంగా పొడిచి, గొంతును గట్టిగా పిసికి, నీట్లోకి తోసేశాడు.



సారంగుడు ద్రోహి; నన్ను మోసంచేశాడు. మనోహరా! మీ నాన్నను నేను తప్ప మిగతా నలుగురూ కత్తులతో పొడిచి చంపారు; నేను ఆయన్ని తాకనైనా లేదు ఇది మాత్రం నిజం!" అని ఆగింది చిత్రరేఖ.

ఆమెకు కత్తి దెబ్బతగిలించని అపుడు తెలుసుకున్న మనోహరుడు ఆమెను వెనక్కి తిప్పి చూశాడు. ఆమె వీపుపై బలమైన కత్తి దెబ్బవుంది. "మనోహరా! నన్ను కాపాడ్డానికి ప్రయత్నించకు; ముందుకు పోతున్న ఓడలో సారంగుడు వున్నాడు. ఆ ద్రోహి దగ్గరినుండి నీ వజ్రాలను తీసుకో!" అన్నది.

"చిత్రరేఖా మానాన్న ఐదుమందిలో నీవు, సారంగుడు, మాణిక్యవర్మ, వీరయ్య -, అని నాకు తెలిసింది. ఆ ఐదో వ్యక్తి ఎవడు? దయ చేసి ఆ వివరం నాకు చెప్పు!" అని ప్రాధేయ పడ్డాడు.

చిత్రరేఖ మెల్లగా కళ్లు తెరచి, "ఐదో వ్యక్తి పేరు కూ...కూ...కూ..." అంటూ కళ్లు మూసింది.

మనోహరునికి ఆమె చావు చాలా కష్టమని పించింది. చివరికి ఆమెనోటితో ఆ ఐదో వ్యక్తి గురించి తెలుసుకుందామనుకున్నాడు. కానీ అది జరగలేదు. ఇక ముందుకు వెళ్ళి. ఎలాగైనా సారంగుని పట్టుకోవాలనుకున్నాడు. శవాన్ని తనతో తీసుకుపోవడం మంచిది కాదనుకుని, చిత్రరేఖ శవాన్ని నీళ్లలోకి తోసేసి, పడవను ముందుకు నడపసాగాడు.

మనోహరుడు చాలాదూరం పోయాక ముందు పోతున్న ఓడ ఓచోట ఆగి వున్నట్టు తెలుసుకుని, ఓడప్రక్కగా పడవను ఆపి, ఓడలోకి ఎక్కి అక్కడున్న వారిలో సారంగుని వెతికాడు. కానీ ఆ ఓడలో అతను కనిపించలేదు. చివరికి ఓడ నాయకుని వద్దకు వెళ్ళి వాకబుచేశాడు. అందుకతను, "సారంగుడనేవాడు ఓ స్త్రీతో కలిసి ఈ ఓడలోకి ఎక్కాడు; కాని, ఇప్పుడు సారంగుడు సంపంగిదీవికిపోవాలని ఇక్కడే దిగిపోయాడు. కానీ అతని వెంట ఆ యువతి లేదు; అతను ఒంటరిగానే వెళ్ళాడు!" అన్నాడు.

"అలాగా! సంపంగి దీవి ఎక్కడుంది? సారంగుడు ఎలావెళ్ళాడు?" అని అతన్ని తిరిగి ప్రశ్నించాడు.

"ఇక్కడ దిగి, ఈ కుడివైపున కొద్దిదూరం పోయావంటే ఆ దీవి కనిపిస్తుంది. సారంగుడు చిన్న పడవ మీద ప్రయాణించి పోయాడు. ఇంతకీ అత నేంచేశాడు; ఎందుకతణ్ని గురించి ప్రశ్నలు వేస్తున్నారు?" అనడిగాడు నాయకుడు.

"అతను నా స్నేహితుడు. అతణ్ని ముఖ్యంగా కలుసుకోవాలి! అందుకే అతన్ని గురించి వివరాలు అడుగుతున్నాను. ఇక నెను శెలవు తీసుకుంటాను!" అంటూ మనోహరుడు ఓడ దిగి, పడవను సంపంగి దీవి వైపు నడపసాగాడు

సాయంత్ర సమయానికి మనోహరుడు సంపంగి దీవిని చేరుకున్నాడు. దీవిలోకి అడుగు పెట్టగానే అతనికి సంపంగి పూల వాసన గమ గమలాడింది. అదే సంపంగిదీవి అయివుంటుందని నిశ్చయించుకుని, సారంగుని వెదుక్కుంటూ లోపలికి నడిచాడు.

కొంతదూరం వెళ్ళేసరికి అతనికి ఏవో మాటలు పెద్దగా వినిపించడంతో చెట్టుపై కెక్కి కూర్చుని, కనబడినంతవరకు చూశాడు.

అక్కడ కొన్ని గుడిసెలు వుండటం కనిపించింది. వాటిమధ్య కొంతమంది అడవి మనుషులు కూర్చుని వున్నారు. ఎత్తైన ఆసనంపై కూర్చున్న అడవి మనిషితో రాజదుస్తులతో వున్న ఓ వ్యక్తిమాట్లాడుతూ కనిపించాడు. అతడే సారంగుడై వుంటాడని మనోహరుడికి మనసులో తోచింది.

కొంతసేపు అయ్యాక అక్కడున్న వారంతా వెళ్ళిపోయారు. సారంగుడు నాయకుడు కలిసి, ఓ పెద్ద గుడిసెలోకి పోయారు; ఎంతసేపు చూసినా వారు తిరిగి వెనక్కి రాలేదు.

అర్ధ రాత్రయింది. మనోహరుడు ఆ గుడిసెకేసే చూస్తున్నాడు. అందులోకి వెళ్ళినవారు మాత్రం ఎందుకు తిరిగిరాలేదనే అనుమానం కలిగింది. తరువాత మనోహరుడు చెట్టుదిగి, అడుగులో అడుగు వేసుకుంటూ ఆ గుడిసెకేసి నడవసాగాడు. ఆ సమయంలో చుట్టుప్రక్కల ఏవరూ లేరు. అందరూ హాయిగా నిద్రలోవున్నారు మనోహరుడు ధైర్యంగా పెద్ద గుడిసె తలుపు తెరచి, లోపలికి అడుగు పెట్టాడు.

(ఇంకావుంది)



4

జరిగినకథ: రత్నసింహుని చంపిన ఐదు మందిలో నలుగురు మనోహర్‌కు భయపడి, దూరదేశాలకు పారిపోయారు. కూర్మయ్య ఆ సంగతి మనోహర్‌కు తెలిపాడు. వెంటనే మనోహర్ ఓ పడవలో సముద్రప్రయాణంచేశాడు. సముద్రంలో తేలుతున్న చిత్రరేఖని తన పడవలోకి ఎక్కించాడు. ఆమె తనను సారంగుడు కత్తితో పొడిచాడని చెప్పి కన్ను మూసింది. మనోహర్ సారంగుని పట్టుకోవడానికి సంపంగి దీవికివెళ్ళి, అక్కడున్న గుడిసె తలుపు తెరిచి లోపలి కడుగు పెట్టాడు—

రచన: బి.ఆర్. వరదరాజులు



గుడిసెలో ఎల నాయికుడు, సారంగుడు ప్రక్కప్రక్కనే నిద్రపోతున్నారు వారు గాఢ నిద్రలో వున్నారని తెలుసుకుని మనోహర్ లోనికెళ్ళి, వజ్రాలు ఎక్కడయినా దాచాడా- అని వెదికాడు. కానీ అవి ఎక్కడా కన్పించ లేదు. చివరికి సారంగునివద్ద వుంటాయేమో నని అతని దగ్గిరికొచ్చి, అతని దుస్తులను వెదకసాగాడు. అప్పుడు సారంగుని మొలలో వున్న కత్తి నేలపై పడింది. ఆ చప్పుడుకి నాయకుడు, సారంగుడు మేల్కొన్నారు.

నాయకుడు తనముందున్న కొత్తమనిషిని చూసి, "ఎవర్నువ్వు? ఇక్కడికెలా వచ్చావు?" అని గద్దించి అడిగాడు.

మనోహరుడు క్షణంలో ఓ నిశ్చయానికి వచ్చి, "సారంగా! నా గురించి ఈ నాయకుడికి చెప్పలేదా? వజ్రాలు అమ్మేశావా? రా పోదాం!" అన్నాడు.

సారంగుడు ఆశ్చర్యపోతూ, "ఏయ్, ఎవరు నువ్వు? వజ్రాలు నావద్ద లేవు; మర్యాదగా బయటికిపో!" అన్నాడు.

"సారంగా! అన్యాయం. మనిద్దరం వజ్రాలమ్మి. చెరిసగం పంచుకుందా మన్నావే? ఇంతలో ఇలా మారిపోయావా? నువ్వేకదా నన్ను రాత్రికి ఇక్కడికి రమ్మనిచెప్పావు?" అని అమాయకుడిలా ముఖంపెట్టాడు - మనోహర్.

వారి మాటలువిన్న నాయకుని తల తిరిగి పోసాగింది. "ఏమిటి మీ ఇద్దరూ నాటక మాడుతున్నారు? వజ్రాలు మాకు ఎరచూపి, మాదగ్గిర ఏదో దోచుకోవాలని మీ ఇద్దరూ పథకం వేస్తున్నారా? నాకు మీ ఇద్దరిమీదా అనుమానంగా వుంది!" అంటూ తన దగ్గర వున్న బాకాను గట్టిగా ఊదాడు-నాయకుడు.

వెంటనే పదిమంది ఆటవికులు లోపలికి వచ్చారు వారిని చూడగానే సారంగునికి గుండె లవరసాగాయి. "నాయకా! నా మాటలు నమ్మండి! ఇతను ఎవరో నాకు తెలియదు; ఇతడు వజ్రాలు దొంగిలించడానికి వచ్చినట్లున్నాడు. నన్ను వజ్రాలతో వదిలేస్తే, నా రాజ్యం వెళ్ళిపోతాను!" అని ప్రాధేయపడ్డాడు.

అంతలో మనోహర్ ముందుకు వచ్చి, "సారంగా! నన్ను వజ్రాలదొంగ అంటావా?

అన్యాయం! నీకు రెండువజ్రాలూ కావాలంటే తీసుకో గాని, అలా మాట్లాడకు; నేను వెళ్ళిపోతాను; నా వాటాకూడా నువ్వే తీసుకో!" అని ఏడుస్తున్నట్టు ముఖంపెట్టి, బయటికి నడవబోయాడు.

అంతలో నాయకుడు, "ఒరేయ్! యీ దొంగలిద్దరినీ బంధించండి; రేపు వీరికి శిక్ష విధిస్తాను; వీరు తోడుదొంగల్లా వున్నారు; ఇద్దర్నీ వేరు వేరుగా బంధించి వుంచండి!" అన్నాడు.

మరుక్షణం ఇరువుర్నీ చేతులుకట్టి బయటికి తీసుకుపోయారు-ఆటవికులు.

మనోహరుని ఓ గుడిసెలోకి, సారంగుని ఇంకో గుడిసెలోకి తోసి, బయట కాపలాగా వుండసాగారు. మనోహరుడు తాను సారంగుని ఏడిపించింది, తాను ఆడిన నాటకాన్ని తలచుకుంటూ రాత్రంతా గడిపాడు.

మరునాటి ఉదయం ఆటవికులు సారంగునీ, మనోహర్‌నీ బయటికి తీసుకుపోయి, చెరొక చెట్టుకు కట్టారు. తరువాత నాయకుడు అక్కడికి వచ్చి, "మన దీవి ఆచారం ప్రకారం రోజుకు ఒకరికే మరణదండన యివ్వాలి; చంపాలికూడా. కానీ ఇక్కడ ద్రోహులు ఇద్దరున్నారు. వీరిలో మొదట ఎవరిని చంపాలన్నది ప్రశ్నగా వుంది. అందువల్ల నేను ఇటువైపు తిరిగి, నా వెనుకవున్న ద్రోహులవైపు ఈ కట్టెను విసురుతాను. అది ఎవరిముందు పడుతుందో, వాడే ఈరోజు శిక్షార్హుడు; రెండవవాడు రేపు!" అని చెప్పాడు.

అందరూ [illegible] సమ్మతించారు. నాయకుడు కుడివైపు తిరిగాడు. అందరూ ఊపిరి బిగబట్టి జరగబోయే పరిణామాన్ని యెదురు చూడసాగారు. సారంగుడు ప్రాణభయంతో కళ్ళు గట్టిగా మూసుకున్నాడు. మనోహర్ దేనికీ భయపడకుండా ఆ నాయకునికేసి చూడసాగాడు.

కాసేపటికి నాయకుడు కర్రను వెనక్కు విసిరాడు. అది సరిగ్గా మనోహరుని కాలి ముందు పడింది.

కళ్లు తెరచి ఆ దృశ్యాన్నిచూసిన సారంగుడు తృప్తిగా ఊపిరిపీల్చాడు. "అమ్మయ్యా! ఈరోజుకు నేను బ్రతికాను; రేపటివరకు ప్రాణంతో వుంటాను; మిగతా తర్వాత ఆలో

చించవచ్చు!" అని మనసులో అనుకున్నాడు.

నాయకుడు వెనక్కి తిరిగిచూసి, "యాద్రోహని ఉరితీయండి!" అని ఆజ్ఞాపించాడు.

మరుక్షణం ఇద్దరు ఆటవికులు మనోహరుని చెట్టునుండి కట్లువిప్పి, అక్కడికి కొద్ది దూరంలో ఉరిత్రాడు తగిలించివున్న మరొక చెట్టుబగ్గిరికి తీసుకుపోయి, అతణ్ని బండపై ఎక్కించి, మెడకు ఉరిత్రాడు తగిలించారు.

అంతలో నాయకుడు అక్కడికి వచ్చి, "పెద్దదొంగా! నీవు వజ్రంకోసం వచ్చానని చెప్పావుకదూ! చనిపోయేముందు ఈ రెండు వజ్రాలు చేతిలో పెట్టుకుని చావు!" అంటూ తనకు సారంగుడు ఇచ్చిన వజ్రాలను మనోహరుని చేతిలో వుంచి, వెనక్కివచ్చి చేతులు ఆడించాడు.

వెంటనే మనోహరుని కాలిక్రింద వున్న బండని ప్రక్కకి జరిపారు. మనోహరుని మెడను ఉరిత్రాడు బిగిసేంతలో, ఎక్కడినుండో ఓ బాణం వేగంగావచ్చి, ఉరిత్రాటిని చెట్టునుంచి వేరుచేసింది. దాంతో మనోహర్ కిందపడిపోయాడు.

ఊహించని ఆ సంఘటనకు అందరూ ఆశ్చర్యపోయి, బాణంవచ్చిన దిక్కుకేసి చూశారు. అటువైపునుండి ఓవ్యక్తి గుర్రంమీద వేగంగా వచ్చి, క్రింద పడివున్న మనోహర్‌ని గుర్రంపై ఎక్కించుకుని అతివేగంగా దుమ్ములెపుకుంటూ ముందు కెళ్లిపోయాడు; అంతా క్షణంలో జరిగిపోయింది కాబట్టి

ఆయుధాలు చేతుల్లోవున్నా, అతణ్ని ఎవరూ ఆపలేకపోయారు.

ఈ సంఘటన నాయకునికి చాలా అవమాన మనిపించింది. కోపంతో పైకిలేచి, "ఇంతమంది కళ్ళముందు ఓద్రోహి తప్పించుకుపోయాడు. ఇంకొకడుకూడా తప్పించుకు పోయేలోగా వాణ్ని చంపేయండి!" అని పెద్దగా అరిచాడు.

ఆ మాటలు విన్న వెంటనే ఆటవికులు సారంగునిపైకి బాణాలు వదిలారు. అతని శరీరమంతా రక్తసిక్తమయింది. చివరగా నాయకుడు అతని గుండెకు గురిచూసి ఓ బాణం వదిలాడు. దాంతో సారంగుడు ప్రాణాలు వదిలాడు. అప్పుడు ఆటవికులు అందరూ తృప్తిచెంది, గట్టిగా చప్పట్లుకొడ్తూ తమ గుడిసెలకేసి నడవసాగారు.

మనోహర్‌ని గుర్రంపై తీసుకుపోతున్న వ్యక్తి చాలాదూరం పోయాక గుర్రాన్ని ఆపాడు. మనోహర్ గుర్రంపైనుంచి దిగి, "మిత్రమా! నీ వెవరు? నన్ను సరయిన సమయానికి రక్షించావు; నీమేలు ఎన్నటికీ మరవలేను!" అన్నాడు.

అందుకతడు, "నాపేరు జగ్గడు. నేను ఈ అడవిజాతి వాడినే; ఇప్పుడుకాదు-ఇంతకుముందు. నేను విలువిద్యలో మంచి వీరుణ్ణి; ఎంతదూరంలో వున్న చిన్న వస్తువునయినా సులభంగా కొట్టగలను. అందువల్ల నాయకుడు నన్ను తనదగ్గిరే వుంచేశాడు.

ఓరోజు నేను, నా ప్రియురాలు మల్లి ఎవరూ లేనిచోట మాట్లాడుకుంటుండగా

నాయకుడు కొంతమంది అనుచరులతో వచ్చి నన్ను బంధించి, మల్లి చేయి పట్టుకున్నాడు. 'అది అన్యాయం' అని నేను అరిచాను; కానీ, నా మాటలు ఖాతరు చెయ్యకుండా మల్లిని చెట్లచాటుకు లాక్కుపోయాడు. నన్ను పట్టుకున్న వారితో ఎంత గింజుకున్నా వారు నన్ను వదలలేదు. అంతలో మల్లి కెవ్వున కేకవేయడంతో నా గుండెలదిరి, నన్ను పట్టుకున్న వారిని ఒక్క తోపుతోసి, అక్కడికి పరుగు తీశాను.

మల్లి తన్ను తాను కత్తితో పొడుచుకుంది. ఆమె శరీరంనుంచి రక్తం కారుతూవుంది. నేను "మల్లీ! మల్లీ!" అని యేడుస్తూ ఆమె వద్ద కూచున్నాను. ఆమె మెల్లిగా కళ్ళు తెరిచి, "జగ్గా! ఈ రాక్షసులమధ్య నువ్వు వుండవద్దు. ఎక్కడికయినా పారిపో! కానీ, ఈ రాక్షసులు ఇలాటి కిరాతకకృత్యాలుచేయకుండా నీవు అడ్డుపడు; వెంటనే పారిపో! ఇక కొద్దిక్షణాల్లో నేను...నేను..." అంటూ కన్నుమూసింది.

అప్పుడు నాలో రక్తం సెగలుకక్కింది. అందర్నీ చంపేయాలన్నంత కోపంవచ్చింది. కానీ అందరిమధ్య నేను ఏమీచేయలేక అటనుండి తెలివిగా తప్పించుకుని అడవికేసి వేగంగా పరిగెత్తాను; వాళ్ళందరూ నన్ను వెంటాడారు. వారికి దొరకకుండా అక్కడ మేస్తున్న గుర్రం ఎక్కి దూరంగా పారిపోయాను. ఇంతకీ నీ వెవరు? వీళ్ళు నిన్నెందుకు బంధించారు? నీతోపాటు ఇంకో వ్యక్తిని కాపాడలేక పోయాను!" అని వాపోయాడు.

"నా పేరు మనోహరుడు. మా నాన్నను ఐదుమంది చంపి వజ్రాలు దొంగిలించుకుపోయారు అందులో ఓ వ్యక్తిని తరుముకుంటూ ఈ దీవిలోకి వచ్చాను ఆ వ్యక్తినే వాళ్ళు చెట్టుకు కట్టి వున్నారు. వాడు చావవలసినవాడే; వాడు బ్రతికుంటే నేను చంపే వాడ్ని నా ఐదు వజ్రాలలో రెండు దొరికాయి; ఇంకా మూడు దొరకాలి; ఇక వాటికోసం నేను వెళుతున్నాను!" అన్నాడు.

"అలాగా చాలా సంతోషం. నేను నీవెంట వచ్చి, నాచేతనైన సహాయం చేస్తాను. నాకు ఈ అడవిలో వుండటం చాలా విసుగుగా తోస్తూంది!" అన్నాడు జగ్గడు.

"అలాగే నీ ఇష్టం!" అంటూ మనోహరుడు గుఱ్ఱంపై ఎక్కాడు; జగ్గడు గుఱ్ఱాన్ని నడపసాగాడు.

* * *

మాణిక్యవర్మ గుఱ్ఱంపై పోతున్నాడు. పోతూ పోతూ మనసులో ఇలా అనుకోసాగాడు: "గండభేరుండపురం ఎంతో దూరంలో వుంది. దానికి సరియైన దారి తెన్నూకూడా లేదు. నేను అందరివద్ద అక్కడికి పోతున్నానని చెప్పి, ఎవరి సహాయంలేకుండా బయల్దేరాను. ఇప్పుడు ఏం చేసేది?" అని ఆలోచించసాగాడు.

కొంతదూరం పోయేసరికి మాణిక్యవర్మకు దాహం వేసింది. ఎక్కడైనా నీరు దొరుకుతుందా- అని చుట్టుపక్కల వెదకసాగాడు. కానీ కొద్దిదూరంలో ఓ కుటీరం కనబడింది. అందులో వుండేవారిని అడిగి దాహం తీర్చుకుందామని గుఱ్ఱాన్ని అటువైపు నడిపాడు. కుటీరం వద్ద గుఱ్ఱాన్ని ఆపి, తలుపు కొద్దిగా తెరచి లోనికి చూశాడు.

లోపల వయసు నిండిన వృద్ధుడు ఎత్తైన పీటపై కూర్చుని వున్నాడు. ఆయన కాళ్లని వొత్తుతూ ఓవ్యక్తి, "గురుదేవా! నా చదువు పూర్తి అయింది ఇక నేను మాదేశానికి పోదలచుకున్నాను; ఆదీ ఈ క్షణంలో పోవాలని నా ఆశ కానీ మాదేశం ఇక్కడికి చాలా దూరంలో వుంది మీ శక్తితో నన్ను క్షణంలో మాదేశం చేరేటట్లు చేయండి!" అన్నాడు,

"శిష్యా! అలాగే ఏదీ నీ పాదరక్షలు ఇటివ్వు!" అంటూ అతని పాదరక్షలు చేతిలోకి తీసుకుని, ఏదో మంత్రంచదివి, చేతిలోని విభూది దానికి పూసి కొంతసేపు చేతిలో పెట్టుకుని, "నాయనా! ఈ పాదరక్షల్ని చేతిలో పట్టుకుని కొంతదూరం పోయి, తరువాత కాళ్లకి వేసుకుని నీవు ఎక్కడికి పోవాలో మనసులో అనుకున్నావంటే ఇది నిన్ను క్షణంలో అక్కడికి చేరుస్తుంది కానీ ఇది ఓసారి మాత్రమే పనిచేస్తుంది తరువాత ఇది సాధారణంగా మారిపోతుంది గుర్తుంచుకో. జాగ్రత్త!" అంటూ పాదరక్షల్ని శిష్యుని చేతుల్లో పెట్టాడు - గురుదేవుడు.

(ఇంకావుంది)




## 5

జరిగిన కథ: మనోహర్, సారంగులు కోయగూడెంలో దొంగలుగా పట్టుబడ్డారు. నాయకుని ఆజ్ఞమేరకు ముందుగా మనోహర్ మెడకు ఉరితాడు బిగించారు. ఇంతలో ఓ వ్యక్తి గుర్రంమీదవచ్చి మనోహర్‌ని రక్షించి తీసుకెళ్లాడు. కసితో ఆటవికులు సారంగుని చిత్రవధచేసి చంపారు. మనోహర్‌కు స్పృహ రాగా, జగ్గడు, మనోహర్ తమ కథలు చెప్పుకున్నారు. మాణిక్యవర్మ గండభేరుండ పురానికి పోతుండగా, దాహంవేసి, ఓ గుడిసెలో ప్రవేశించాడు. అక్కడో వృద్ధుడు రెండు చెప్పులను మంత్రించి శిష్యునికిచ్చి, వాటిని వేసుకుంటే తలచినచోటు కెళ్ళవచ్చని చెప్పాడు—

రచన: బి.ఆర్. వరదరాజులు

కుటీరంలోని గురుశిష్యులమాట లన్నిటినీ వింటున్న మాణిక్యవర్మ మెదడు చకచకా పనిచేయసాగింది. క్షణంలో ఓ నిర్ణయానికి వచ్చి, వేగంగా వెనక్కి పరిగెత్తుకు వచ్చి గుర్రంపై ఎక్కాడు. కొంచెం సేపట్లో కుటీరం నుండి ఆ వ్యక్తి చేతిలో పాదరక్షలతో బయటికొచ్చి, నడవసాగాడు. వర్మ అతని వెనుకగా గుర్రంపై వస్తూ, ఉన్నట్టుండి అతని మీదపడి, చేతిలోవున్న పాదరక్షల్ని లాక్కొని పారిపోయాడు.

హఠాత్సంఘటన అలా జరగడంతో ఆ వ్యక్తి 'దొంగ దొంగ' అని అరిచాడు; కానీ లాభంలేకపోయింది. చివరికి ఏడుస్తూ కుటీరం వైపు వెళ్లాడు.

మాణిక్యవర్మ చాలాదూరం పోయాక ఆగి, కాలికున్న పాత చెప్పులను పారవేసి, కొత్త వాటిని వేసుకుని మనసులో, "నన్ను గండ భేరుండ దీవికి తీసుకుపో!" అన్నాడు. అంతే! మరుక్షణం గాలిలోకి లేచి, క్షణాలలో గండ భేరుండపురాన్ని చేరుకున్నాడు.

మనోహర్, జగ్గడు గుర్రంపై చాలాదూరం పోయారు. కనిపించిన దారిగుండా, ఎక్కడా ఆగకుండా ప్రయాణంచేయసాగారు. చివరికి పెద్ద గ్రామాన్ని చేరుకున్నారు ఆ రాత్రికి ఆక్కడ విశ్రాంతి తీసుకుని ఉదయం ప్రయాణంచేద్దామనుకున్నారు. గుర్రందిగి, ఇద్దరూ నడుస్తూ గ్రామంలోకి వెళ్ళారు. వారికి ఎదురుగా వచ్చేవారంతా వీరిద్దరినీ వింతగా చూస్తూ, ముందుకు పోతున్నారు. వారిలో చాలామంది వస్తాదులుగానే కనిపించారు. వారిని చూడడంతో మనోహర్‌కు వస్తాదు వీరయ్య జ్ఞాపికి వచ్చాడు. వెంటనే ఎదురుగా వస్తున్న ఓ వస్తాదును ఆపి "అయ్యా! ఇది ఏవూరు? మేము చాలాదూరంనుండి వస్తున్నాం!" అన్నాడు.

అందుకతను "ఇది మత్స్యగంధిపురం!" అని జవాబిచ్చి వెళ్ళిపోయాడు. అదివిన్న వెంటనే మనోహర్ అవిరిపోయాడు. వస్తాదు వీరయ్య ఆక్కడినుండి తప్పించుకుని ఇక్కడికి వచ్చి వున్నాడని అతని మనసులో మెదిలింది. వెనకుతున్న తీగె కాలికి తగిలినట్లు మనోహర్ సంతోషంతో ఆ విషయాన్ని జగ్గడికి చెప్పాడు.

అందుకు అతడు, "అలాగా, మంచిది! ఇక్కడ కొన్నిరోజులుండి వీరయ్యను వెదికి వజ్రంతో తిరిగిపోదాం. అంతవరకూ మన మకాం ఇక్కడే!" అంటూ ముందుకు నడిచాడు.

కొంతదూరం పోయేసరికి వారికి ఓచోట ప్రకటన కనబడింది. ఇద్దరూ దాన్ని చదివారు. అందులో ఎవరో ఇద్దరు వస్తాదులకు పోటీ జరుగుతున్నట్లుంది.

"జగ్గా! మనం ఈ పోటీకి వెళదాం. అక్కడ మనకు వీరయ్య తప్పకుండా కనిపిస్తాడు!" అన్నాడు మనోహర్.

"నేనూ అలాగే అనుకుంటున్నాను. ఈ రాత్రికే పోటీ జరుగనున్నది. మనం వెళ్ళి చూడాలి. ఎక్కడయినా కొంతసేపు నిద్ర దీర్చుకుని, రాత్రికి తప్పకుండా పోటీకి వెళదాం!" అన్నాడు జగ్గడు.

రాత్రయింది. మనోహర్, జగ్గడు కుస్తీ పోటీ జరుగుతున్న మైదానానికి వెళ్ళారు. ముందువరుసలో కూర్చుని చుట్టూ చూడసాగారు. వారి కంటికి వీరయ్య కనబళ్ళేదు.

కొంతసేపటికి పోటీ ప్రారంభమయింది. ఓ వస్తాదు, ఇంకో వస్తాదును బాగా కొట్టి, క్రింద పడవేసి ఎగరసాగాడు. "నన్ను జయించేవాళ్ళు ఎవరూలేరు. హా...హా..." అని పెద్దగా అరవసాగాడు. అంతలోనే అక్కడ కూర్చున్నవారి లోంచి ఒకతను పైకి లేచి నిలిచాడు. అతణ్ణిచూసి పెద్దవస్తాదు, "ఒరేయ్! ఎవర్రా నువ్వు? నన్ను జయించ

గల వీరుడివా? ఏదీ పైకిరా రా!" అని గట్టిగా అరిచాడు.

"నేను నీ జేజయ్యనురా!" అంటూ అతడు గోదాలోకి వస్తున్నాడు.

అతణ్ణిచూసి మనోహర్ అదిరిపోయాడు. "అతనే వీరయ్య!" అని జగ్గడికి చెప్పాడు. అదివిన్న జగ్గడు, "వజ్రం దొంగిలించిన ఆ వీరయ్య వీడేనా?" అన్నాడు.

గోదాలోకి పోతున్న వీరయ్య, ఆ మాటలు విని, వెనక్కి తిరిగి చూశాడు. అక్కడ మనోహర్ నిల్చుండటం వీరయ్య కంటబడింది. ఆశ్చర్యంతో, "అరే, వీడు రత్నసింహుడి కొడుకులా వున్నాడే? సరే, తరువాత వీడి సంగతి చూస్తాను!" అనుకుంటూ

అతన్ని కణాలమీద ఓడించాడు. తరువాత ముందుకు వచ్చి, "నేను ఇంతపెద్ద వస్తాదును జయించాను. కానీ, నన్ను మించిన వస్తాదు మీలో వుండవచ్చు. అతను యెవరో నాకు తెలుసుకోవా లనుంది. అత నెవ్వరో ఇక్కడికి రావచ్చు!" అని గట్టిగా అరిచాడు.

ఆమాటలకు ఎవ్వరూ ముందుకురాలేదు. అందరూ వెనకా, ముందూ చూసుకుంటూ వున్నారు మనోహర్ ఇందులో ఏదో మోసం వుందని మనసులో అనుకుని చూడసాగాడు.

కొంతసేపటికి వస్తాదు వీరయ్య, "ముందు వరసలో ఇంతమంది కూర్చున్నారు. మీలో ఒక్కరి క్కూడా నాతో పోటిచేసే ధైర్యం లేదా? సిగ్గుచేటు! మీరంతా గాజులు వేసుకుమ్మి వేశాడు అందరిమీద.

అది అందరికీ అవమాన మనిపించినా, వీరయ్యతో తలపడే ధైర్యంలేక చూస్తూండిపోయారు. మనోహర్ మెల్లగా తన మిత్రుని తొడ గిల్లాడు.

వెంటనే జగ్గడు పైకిలేచి నిలబడి, "వస్తాదు వీరయ్యా! నీతో కుస్తీ పట్టడానికి నేను తయారుగా వున్నాను. కానీ, ఓ షరతు. నిన్ను జయించానంటే, నీవు రత్నసింహుని దగ్గిర తీసుకొచ్చిన వజ్రాన్ని నాకు యివ్వాలి!" అన్నాడు,

"వజ్రమా? ఏం వజ్రం? నావద్ద అలాటిదేమీ లేదే? నీకు నాతో కుస్తీ పట్టడానికి భయంగా వుంటే, అక్కడే కూర్చో; అంతేగానీ, ఇలా పిచ్చి పిచ్చిగా మాట్లాడకు!" అన్నాడు వీరయ్య.

"అలాగా, నీపని చెబుతాను చూడు!" అంటూ జగ్గడు అక్కణ్ణించి ఓ యెగురు యెగిరి వస్తాదును ఒక్కతన్ను తన్నాడు అంతే! అతను అలాగే వెనక్కి పడిపోయాడు. తరవాత ఎగిరి అతని రొమ్ముపై కూర్చుని ఎడాపెడా చేతులతో కొట్టసాగాడు. మద సింహాలా ఇద్దరూ కొట్టుకోసాగారు. జగ్గడు అడవి మనిషి. పిచ్చికోపంతో వీరయ్యను బాదసాగాడు. ఆ దెబ్బలకు వీరయ్య తాళ లేక పోయాడు. అతడి నోటినుంచి, ముక్కు నుంచి రక్తం కారసాగింది. చివరికి రెండు చేతులు జోడించి, "బాబూ! నన్ను వది లెయ్! నీతో పోరాడే శక్తి నాకులేదు!" అని బాధగా అరిచాడు.

మనోహర్ అక్కడికి వచ్చి జగ్గడితో వీర య్యను వదిలెయ్ మన్నాడు. తరువాత మనో హర్, "వీరయ్యా! ఆ వజ్రాన్ని నాకు ఇచ్చే వంటే సరే; లేదా నీ ప్రాణంతీసి మరీ తీసు కుంటాను" అన్నాడు.

అందుకు వీరయ్య, "మా ఇంటికి రండి; మీకు ఆ వజ్రాన్ని ఇచ్చేస్తాను. నన్ను వది లేయండి!" అంటూ ప్రాధేయపడి, మెల్లగా పైకిలేచాడు.

ఇద్దరూ వీరయ్యవెంట అతని యింటికి వెళ్ళారు. కొంతదూరం పోయాక వీరయ్య పెద్ద ఇంట్లోకి దూకాడు. ఇద్దరూ లోపలికి వెళ్ళారు. వీరయ్య ఇద్దరినీ అక్కడే వుండమని చెప్పి, తాను వజ్రం తీసుకొస్తానని లోపలికి వెళ్ళాడు.

కొంతసేపటికి బిలబిలమంటూ పదిమంది వస్తాదులు ఇద్దరినీ చుట్టుముట్టారు. వాళ్ళ వెనుక వచ్చిన వీరయ్య, "హ...హ...హా...



ఎలావుంది నా బలం? మీకు వజ్రంకావాలా? ఉండండి; మీపని చెబుతాను!" అంటూ ప్రక్కకి తిరిగి, "ఒరేయ్! ఈ ఇద్దరినీ ఆ గదిలో బంధించండి! రేపటికి వీరి పని పడ తాను!" అంటూ వెనక్కి వెళ్ళాడు

మరుక్షణం వస్తాదులు ఇద్దరినీ పక్క గది లోకి తీసుకెళ్ళి బంధించారు. కొంతసేపటికి వస్తాదు వీరయ్య ఓ నల్లటి వ్యక్తితో వచ్చి. "సంజీవీ! నా శత్రువులు ఇద్దరు ఆ గదిలో వున్నారు. వారిని కష్టపెట్టకుండా చంపాలి. నీ సలహా ఏమిటి?" అన్నాడు.

అందు కతను మీసాలు మెలేస్తూ,"సలహా లివ్వడానికే నేను వున్నానుగదా! వారిని సుల భంగా చంపడానికి ఓ పథకం చెప్తానుండు!" అంటూ ఆగి, కాసేపు ఆలోచించి, "వీరయ్యా! మన వూరి దక్షిణం వైపు చివర్న కొండ గుహలో ఓ విచిత్రమయిన జంతు వున్నది కదా! దాని దగ్గిర వీరిని వదిలేస్తే, వారి పీడ విరగడ అవుతుంది. నీమీద ఎవ్వరికీ అను మానం రాదు!" అన్నాడు.

"నీ సలహా చాలాబాగుంది. మరి అంత దూరానికి వీళ్ళని ఎలా తీసుకెళ్ళటం?" అని ఎదురుప్రశ్న వేశాడు వీరయ్య.

"దానికి సలహా ఎందుకు? నా చేతల్లోనే చూపిస్తాను!" అంటూ సంజీవి తన దగ్గిరున్న నల్లటి కట్టను ప్రక్కనున్న దీపంలో కాల్చ సాగాడు. అందులోంచి నల్లటి దట్టమయిన పొగలు రాసాగాయి. సంజీవి ముక్కులు గట్టిగా మూసుకుని ఆ కట్టను మనోహర్, జగ్గడు వున్న గదిలోకి కిటికీగుండా విసిరాడు.

మరుక్షణం గదిలోంచి గట్టిగా దగ్గు వినిపించింది. కొంతసేపటికి దగ్గు ఆగిపోయింది. సంజీవి గది తలుపులు తెరిచాడు. లోపల మనోహర్, జగ్గడు తెలివితప్పి పడున్నారు.

"వీరయ్యా! వీరికి తెలివి రావడానికి చాలా సమయం పడుతుంది. వీరిని ఓ పెట్టెలో పడుకోబెట్టి, నీ మనుషులద్వారా తీసుకెళ్ళి కొండగుహలో వదిలెయ్. వీరిని లక్షణంగా ఆ జంతువు భోంచేస్తుంది. మరి నే వస్తా!" అంటూ వెళ్ళిపోయాడు సంజీవి.

తరువాత వీరయ్య వాళ్ళని ఓ పెట్టెలో పడుకోబెట్టి, ఇద్దరు వస్తాదులను పిలిచి, వారి చెవిలో ఏదో చెప్పాడు. వారు తలాడించి

పెట్టెను తలమీద పెట్టుకుని వూరికి దక్షిణం వైపు నడవసాగారు.

అర్ధరాత్రయింది. మనోహర్‌కి, జగ్గడికి మూర్ఛనుండి తెలివివచ్చింది. ఇద్దరూ మెల్లగా పైకి లేచి, చీకటిలో తాము ఏదో కొండ గుహలో వున్నట్టు తెలుసుకున్నారు. వీరయ్య ఇంట్లో వున్న తాము ఈ కొండ గుహలో కెలావచ్చారో అర్థంకాకే దిద్దరికీ; బయటికి పోవడానికి దారి తెలియక మెల్లగా నడవ సాగారు.

ఉన్నట్టుండి చెవులదిరిపోయేటట్టు శబ్దం, పెద్దగా వెలుగు కనబడించి. ఇద్దరూ ఆశ్చర్య పోతూ మెల్లగా గోడవైపుగా జరిగి, వెలుగు వచ్చినదిక్కు వైపు పరిశీలనగా చూశారు. మరలా శబ్దంతో బాటు వెలుగు వచ్చింది.

అక్కడ ఓ భయంకరమైన జంతువు వున్నట్టు తెలుసుకున్నారు; ఆ జంతువు రాక్షస బల్లి! దాని ముక్కుపై పెద్ద కొమ్ములు వున్నాయి; ఒకేకన్నువుంది. దాని నోట్లోనుండి నిప్పురవ్వలు రాలుతున్నాయి - అది అరిచినపుడు నిప్పులు రాలడం, చూపరులకు వెలుగులా కనిపిస్తూంది.

ఆ జంతువు మెల్లగా వీరి వైపు వచ్చింది. ఇద్దరూ ఊపిరి బిగబట్టుకుని దానికేసి చూడసాగారు. ఆ జంతువు తన కొమ్ములతో జగ్గణ్ణి పైకి ఎత్తి దూరంగా విసిరింది. ఆ దెబ్బకు అతడు క్రిందపడగా దెబ్బతగిలింది. తరువాత ఆ జంతువు తోకతో మనోహర్‌ను గట్టిగా క్రిందకి తోసింది. అతనూ క్రిందపడి దెబ్బతిన్నాడు.

ఇద్దరూ చెరొక దిక్కులో పడి, చీకటిలో ఒకరి నొకరు శబ్దంచేయకుండా వెదుక్కోసాగారు. జంతువు వారిని వెదుకుతూ నోటినుండి నిప్పులు వదలసాగింది. ఆ వెలుతురులో ఇద్దరూ గుహబయటి ద్వారానికి అడ్డంగా పెద్ద బండ వున్నట్టు తెలుసుకున్నారు జంతువు దారికి అడ్డంగా కూర్చుని వుంది. ఇద్దరూ మెల్లగా ఒకరినొకరు కలుసుకున్నారు; బయటికి పోవడానికి మార్గం ఆలోచించసాగారు.

(ఇంకావుంది)




6

జరిగినకథ:- మాళిక్యవర్మ, వృద్ధుడు శిష్యునికి మంత్రించి యిచ్చిన చెప్పులను తను ధరించి, గండభేరుండ పురానికి పోయాడు. జగ్గడు సహాయంతో మనోహరుడు మత్స్య గంధి పుకం చేరుకున్నాడు. అక్కడ వారికి ఓ ప్రకటన కనబడింది. దాన్నిచదివిచూశారు. అందులో ఎవరో ఇద్దరు వస్తాదులకు పోటీ జరుగుతున్నదనిపుంది. వీరయ్య ఎలాగూ అక్కడ వస్తాడని, మనోహరుడు, జగ్గడు అక్కడకుపోయారు. వీరయ్య పోటీలో గెలిచాడు. తరువాత వీరయ్యతో జగ్గడు పోటీపడి, వీరయ్యను ఓడించి వజ్రంగురించి అడిగాడు వీరయ్య వజ్రం ఇస్తానని ఇద్దరినీ ఒక రాక్షస బల్లికి బలిచేయలని గుహలోకి వారిని పిడిచాడు.

రచన: బి.ఆర్. వరదరాజులు

కొంత సేపటాక జగ్గడు మెల్లగా తన దుస్తుల్లో నుండి ఓ మడిచివున్న ఆకును బయటికి తీశాడు. అందులో ఎరగా ఏదో గట్టి పదార్థం వుంది. దాన్ని మనోహర్‌కు చూపి, "ఇది అడవి జిగురు! దీన్ని ఆ జంతువు నోట్లోకి విసిరామంటే, దాని నోరు రేపటివరకు మూసుకు పోతుంది. ఆతలో మనం బయటికి పోవడానికి మార్గం ఆలోచిద్దాం!" అన్నాడు.

"మంచి ఉపాయం; అలాగే విసురు!" అన్నాడు మనోహర్. జగ్గడు దాన్ని చేతిలోకి తీసుకున్నాడు. అంతలో ఆ జంతువు పెద్దగా అరవడంతో. ఆ అదురుకు చేతిలో వున్న ఆకును క్రిందజారవిడిచాడు. తరువాత ఇద్దరూ చీకటిలో క్రింద వెదకసాగారు. వారికి రాళ్ళు తప్ప ఏమీ దొరక లేదు. జంతువు మాత్రం ఆక్కడినుండి లేవక చెవులు గింగురు మనేటట్లు అరుస్తూ వుంది.

ఇద్దరూ చాలాసేపు వెతికి, చివరికి ఆక్కడి నుండి తప్పించుకు పోవడానికి వేరే మార్గం వుందా- అని వెనక్కి నడిచారు. కొంతదూరం పోయాక అక్కడ ఓచోట పెద్ద కుక్క పడుకుని వుంది; అది ఏనుగంత ఎత్తుగా వుంది; మూతి చప్పిగా వుంది. అంతపెద్ద కుక్కను వారింతవరకు చూడలేదు. అది నిద్రపోతూ వుంది. ఇద్దరూ ఎంత గట్టిగా మాట్లడినా, అది నిద్రనుండి లేవలేదు. ఇద్దరూ దగ్గరికి వెళ్ళి, అది ప్రాణంతో వున్నట్లు తెలుసుకున్నారు.

"జగ్గా! ఈ కుక్క చాలా పురాతన కాలంది. దీన్ని చూస్తుంటే ఇది చాలాకాలంగా నిద్రపోతున్నట్లుంది. మన దారికి అడ్డంగావున్న జంతువు ఇంతవరకు ఈ కుక్కను చూసినట్లులేదు. మనం ఈ కుక్కను లేపి, ఆ జంతువుతో తలపడేట్లు చేశామంటే, మనకు బయటికి పోడానికి మార్గం దొరకుతుంది!" అన్నాడు - మనోహర్.

"మరి ఈ కుక్కను ఎలా లేపడం?" అన్నాడు జగ్గడు. మనోహర్ తన దగ్గరున్న చిన్న కత్తిని బయటికి తీసి, కుక్క తోకను రెండుగా చీల్చాడు. ఆ దెబ్బకు ఆ కుక్క మెల్లగా కదిలింది. మళ్లీ కత్తితో దాని నెత్తిపై పొడిచాడు ఈసారి కుక్క చటుక్కున లేచి 'బౌ బౌ' మంటూ మొరిగింది.

అంతే! ఇద్దరూ పెద్దగా శబ్దం చేసుకుంటూ ఆ విచిత్ర జంతువు వున్న చోటకి పరిగెత్తారు; కుక్క కోపంతో అరుస్తూ వారి వెనుక పరిగెత్తింది. ఇద్దరూ ఉన్నట్టుండి ఓచోట దాక్కున్నారు. కుక్క అది గమనించకుండా ముందుకు పరిగెత్తి, ఆ విచిత్ర జంతువును కొట్టింది. దాంతో ఆ జంతువుకు కోపం వచ్చి, గట్టిగా అరిచింది.

ఆ జంతువును కుక్క గట్టిగా కొరికింది. ఆ దెబ్బకు ఆ జంతువు శరీరంనుండి ఏదో ద్రవం బయటికి రాసాగింది. జంతువు కుక్కను గట్టిగా తన్నింది, రెండు జంతువులూ అతి భయంకరంగా పోరాడసాగాయి. దాన్ని ఇద్దరూ గమనించసాగారు.

రెండు జంతువులూ బలంలో సమానంగా వున్నాయి. ఎంతసేపు, పోరాడినా ఒక్కటి నేల కూలలేదు. రెండు జంతువులకూ శరీరం నిండా గాయాలయినాయి. కానీ అవి లెక్క చేయకుండా కోపంతో పోరడసాగాయి. పోరాడుతూ గుహబయట ఆడ్డంగావున్న బండను గట్టిగా తన్నాయి. ఆ దెబ్బకు బండ దొర్లుకు పోయింది. బయటినుండి సన్నటి వెలుగు గుహలోకి ప్రసరించింది అది చూసిన ఇద్దరికీ ప్రాణం వచ్చినట్లనిపించింది. ఇక ఆ జంతువుల పోరాటం చూడడం ఎందుకని ఇద్దరూ ఆదారి గుండా బయటికి నడిచారు.

మనోహర్, జగ్గడు వూరులోకి వెళ్లారు వస్తాడు దగ్గర నుండి వజ్రాన్ని ఎలా తిసుకోవాలా - అని ఆలోచిస్తూ నడుస్తుండగా, మనోహర్ కాలికి చిన్నమూట తగిలింది. ఏమిటా - అని దాన్ని పైకి ఎత్తి విప్పిచూశాడు. అందులో బంగారు నాణాలు వున్నాయి. "అయ్యో పాపం! ఎవరి దీ మూట? జగ్గా! ఈ గ్రామాధికారికి దీన్ని ఇచ్చివద్దాం!" అన్నాడు-మనోహర్.

"మనోహర్! అది మనకు దొరికింది. దీన్ని గ్రామాధికారికి ఇచ్చినంచువల్ల నీకు తృప్తి వుండొచ్చు; కానీ ఇది తన సొంతదారుణ్ణి మాత్రం చేరదు. అక్కడున్న వాళ్ళు పంచుకుంటారు. మనకు దొరికింది ఎవరో పంచుకోవడం ఎందుకు? మనమే ఉపయోగించుకుంటాం. ఇప్పుడు ఇది మనకు చాలా అవసరం!" అన్నాడు జగ్గడు.

"మనకు అవసరమున్నంత మాత్రాన దీన్ని తీసుకోవడం ఎందుకు ఇక్కడే వదిలి వెళ్ళి పోదాం!" అన్నాడు మనోహర్.

"అప్పుడు కూడా ఇది సొంతదారుని చేరదుకదా! మన వెనుక వచ్చే ఏ ధనవంతుడైనా దీన్ని వదలడు. అందువల్ల మనకి ఏం లాభం? నా మాటవిని, దాన్ని తీసుకుని నావెంటరా!" అంటూ ముందుకి పాయినాడు-జగ్గడు

మనోహర్ మారుమాట్లాకుండా వెనుక నడవసాగాడు. ఇద్దరూ అక్కడికి కొద్ది దూరంలో వున్న ఓ నాటకశాలలోకి నడిచారు. చేతిలోవున్న బంగారు నాణాలద్వారా ఇద్దరూ నగల వ్యాపారుల దుస్తులు అక్కడ తీసుకుని ధరించి బయటికి వచ్చారు. దారిలో ఓ కంసాలి వద్దకు వెళ్ళి సాధారణ గాజురాయికి వజ్రంలా మెరుగు పెట్టించుకుని ముందుకు నడిచారు.

సాయంత్ర సమయానికి ఇద్దరూ వస్తాదు ఇంటిని చేరుకున్నారు. వీరయ్య వారిని లోపలికి పిలిచి, వారి వద్దవున్న వజ్రాలను చూపించమన్నాడు.

అందుకు జగ్గడు, "వస్తాదుగారూ! మా వద్ద మంచి విలువైన వజ్రాలు వున్నాయి. అవి చూపిస్తాంగానీ, మీ వద్ద ఓవిలువైన వజ్రం వుందని తెలిసి, అది అమ్మితే మేము కొనుక్కుని పోదామని వచ్చాం. మాకు మాణిక్య వర్మ, చిత్రరేఖ, సారంగులు - వారి వజ్రాలను అమ్మారు; మీరుకూడా అమ్మితే కొనుక్కుంటాం!" అన్నాడు. "మరి కంసాలి కూర్మయ్య వద్ద వజ్రం మీరుఎందుకు ఇంతవరకుకొనలేదు?" అని ప్రశ్నించాడు వీరయ్య.

"ఐదోవాడు నా ప్రక్క ఇంట్లోవున్న గుంటనక్కా? నాతో ఎంతో మంచిగా వుండి, ఇంత పని చేశాడా? దుర్మార్గుడు; వాడిని ప్రాణాలతో వదలకూడదు!" అని మనోహర్ మనసులో అనుకోసాగాడు.

అది అర్థం చేసుకున్న జగ్గడు, "ఆ! అతని వద్ద తీసుకున్నాం; అతడే మిమ్మల్ని కలుసుకోమన్నాడు!" అన్నాడు.

"అలాగే ఇక్కడే వుండండి; నేను పైకి వెళ్ళి తెస్తాను!" అంటూ పైకివెళ్ళిన వీరయ్య

కొంతసేపటికి చిన్న పెట్టెతో తిరిగి వచ్చాడు. ఇద్దరికీ పెట్టెలోంచి ఎర్రని వజ్రాన్ని చూపాడు. మనోహర్ దాన్ని తీసుకుని పరీక్షిస్తునట్టు నటిస్తూ, ఎడమ చేతిలోవున్న నకిలీ వజ్రాన్ని మార్చి, అసలైన వజ్రాన్ని జగ్గని చేతిలోకి జారవిడిచాడు. అవి వీరయ్య గమనించలేదు.

తరువాత మనోహర్ వజ్రాన్ని పెట్టెలో పెట్టి వస్తాదుకిస్తూ "ఇది మంచి వజ్రమేనండీ! దీని విలువ లక్ష వరహాలు; నాణాలు మా ఇంట్లోవున్నాయి. రేపు వచ్చి దీన్ని కొనుక్కుని పోతాం. అంత వరకు దీన్ని భద్రపరచండి!" అంటూ లేచాడు.

'అలాగే' నంటూ వీరయ్య పెట్టెను చేతిలోకి తీసుకుని నిలబడ్డాడు. ఇద్దరూ బయటికి వెళ్ళిపోయారు. వస్తాదు రేపు తనకు రాబోయే వరహాలను తలచుకుంటూ పైకి వెళ్లాడు. ఉన్నట్టుండి కాలుజారి వెనక్కి ఆడుగుపెట్టి పైనుండి క్రిందపడ్డాడు. క్రిందపడిన వీరయ్య తలకి బలంగా దెబ్బతగిలి రక్తం కారసాగింది. అంత గాయంతోనూ తన చేతిలో పెట్టె లేదని మెల్లగా పైకి నిలబడి చుట్టూచూశాడు. అతనికి కొద్ది దూరంలో పెట్టె తెరవబడి వుంది; దాని ప్రక్కనే ముక్కలయిపోయిన గాజురాయి వుంది. అది చూసిన వీరయ్య తల తిరిగినట్లనిపించి, "మోసం, మోసం! నన్ను మోసం చెసి, నా వజ్రాన్ని ఆ మోసగాళ్ళు తీసుకుని, నకిలీ వజ్రాన్ని నాకిచ్చి వెళ్ళారు. అయ్యో! ఎవరూ లేరా? పట్టుకోండి-ఆ దుర్మార్గులను. అయ్యో, నా అందమైన వజ్రం పాయిందే!" అని ఆక్రోశిస్తూ గుండె ఆగి చనిపోయాడు.

అంతటినీ వీధిలో కిటికీ ద్వారా ఇద్దరూ



చూడసాగారు. వీరయ్య చావును తృప్తిగా చూసిన మనోహర్, జగ్గడు అక్కడి నుండి వేగంగా వెళ్లిపోయారు.

దారిలో వారి కెదురుగా రెండు గుర్రాలను తీసుకుని వస్తున్న ఓ వ్యాపారిని ఆపి, బేరం చేసి, వారి వద్ద మిగతా వున్న బంగారు నాణాలను ఇచ్చి, రెండు గుర్రాలను కొనుక్కుని, చెరొక గుర్రంపై ఎక్కి వేగంగా ముందుకి సడిపారు.

రెండు రోజులు ఏకధాటిగా ప్రయాణం చేసి, ఇద్దరూ ఓ భయంకరమైన అరణ్యాన్ని దాటితే, కాంచనపురం చేరుకోవచ్చునని దారిలో ఓ వ్యక్తి మాటలవల్ల ఇద్దరూ ఆ అరణ్యం గుండా ప్రయాణించసాగారు.

ఉన్నట్టుండి వారి కెదురుగా ఓ పాడుగాటి నల్లటి వ్యక్తి వచ్చి, పరుగిడుతున్న గుర్రాలను తన రెండు చేతులతో ఆపాడు. ఎదురుగావున్న వింత వ్యక్తిని ఇద్దరూ ఆశ్చర్యపోయి, మౌనంగా చూడసాగారు.

నల్లటి వ్యక్తి, "అబ్బాయిలూ! మీరు ఈ ప్రాంతానికి కొత్త వారిలా కనిపిస్తున్నారు. ఈ అరణ్యం నాది. ఇందులో అడుగు పెట్టినవారు నాకు సుంకం చెల్లిస్తెగాని వదలను!" అన్నాడు.

"అలాగా మాకు తెలియదు. మీకు ఇచ్చుకోవడానికి మా వద్ద ఏంలేదు. దయ చేసి మమ్మల్ని వదలండి!" అన్నాడు మనోహర్.

"నేనేం మూర్ఖుణ్ణికాను - మీ వద్దలేని వస్తువును అడగను. మీ వద్ద వున్నదాన్ని మాత్రం తీసుకుంటాను!" అన్నా డా వ్యక్తి.

"మా వద్ద ఏం తీసుకుంటావు?" అని

ఆశ్చర్యంతో అడిగాడు మనోహర్. "మి కుడి చేతని మాత్రం తీసుకని మిమ్మల్ని వదిలి వేస్తాను. అదే ఇక్కడ వసూలుచేసే సుంకం!" అన్నాడు.

"ఇది అన్యాయం. మీ ప్రాంతమని ఆలా అన్యాయంగా మాట్లాడితే మేము దానికి తగినట్లుగా నడచుకోవలసి వుంటుంది. మీకు సుంకం చెల్లించకుండా మేంపోతాం!" అని విసురుగా అన్నాడు జగ్గడు.

"నా అనుమతి లేనిదే ఇక్కడి నుండి చీమైనా తప్పించుకుపోలేదు!" అంటూ బిగ్గరగా ఆరచి, చప్పట్లుకొట్టాడు.

మరుక్షణం చెట్లప్రక్కనుండి నాలుగు సింహాలు వచ్చి, కుక్కలవలె అతని కాలిని నాకసాగాయి. అతను వాటితో "ఈ వెధవల్నిద్దర్నీ నా గుహకు తీసుకురండి; వీళ్లు అతిగా మాట్లాడుతున్నారు; అందువల్ల వీరి వద్ద సుంకం రెట్టింపుగా తీయాలి; రెండు చేతులూనరికి పంపించాలి!" అంటూ ముందుకి నడిచాడు. సింహాలు మెల్లగా ఇద్దరి వద్ద నిలిచి, తలనుఆడించాయి. గత్యంతరం లేక ఇద్దరూ వాటివెనుక నడిచాయ. వారు కొంతదూరం పోయాక పెద్ద గుహను చేరుకున్నారు.

గుహలో నల్లటి వ్యక్తి ఓ వెదికల్ల కూర్చుని వున్నాడు. లోపలికి పోతూనే జగ్గడు మనోహరునికి కన్నుగీటి, నల్లటి వ్యక్తితో, "అయ్యా! మీకు సుంకం చెల్లించడానికి నేను తయారుగా వున్నాను. నా కుడిచేతిని మీరు ఏం చేసుకుంటారు? అంతకన్న విలువైనది, మీకు ఉపయోగపడే వజ్రం నావద్ద వుంది!" అంటూ వీరయ్య వద్దనుండి తీసుకున్న వజ్రాన్ని చూపాడు.

ఆ వజ్రాన్ని చూసి ఆ వ్యక్తి ఆశ్చర్యపోతూ "ఎంత బాగుంది వజ్రం! ఇంకా ఇలాంటి వజ్రాలున్నాయా; ఎక్కడదొరికింది వజ్రం?" అని ప్రశ్నించాడు.

(ఇంకావుంది)




7

బరిగిన కథ: మనోహర్, జగ్గడు, విచిత్ర జంతువున్న గుహలో బంధింప బడ్డారు. దాన్నుండి తప్పించుకోడానికొరకు వారు అక్కడ నిద్రపోతున్న రాక్షస కుక్కను లేపి, విచిత్ర జంతువుతో మోదనిచ్చి, ఇద్దరూ తప్పించుకున్నారు. తరువాత ఇద్దరూ వీరయ్యను మోసగించి, అతని వద్ద వున్న వజ్రాన్ని తీసుకుని అడవి వైపు గుఱ్ఱాలతో బయలు దేరారు. దారిలో వారిని నాలుగు సింహలతో వున్న నల్లటి పొడుగాటి వ్యక్తి బంధించి గుహకు తీసుకుపోయాడు.

రచన: బి.ఆర్. వరదరాజులు



"ఇక్కడికి దగ్గరిలోనే నాకు దొరికింది. ఇంకా ఇలాంటి వజ్రాలు కొన్ని వందలున్నాయి. మీరు నావెంట ఇద్దర్ని పంపండి; నేను ఆ వజ్రాలు దొరికే స్థలం చూపిస్తాను. మీకు అనుమానంగా వుంటే, నామిత్రుడు ఇక్కడే వుంటాడు. నేను మాత్రం బయటికి వెళతాను!" అన్నాడు-జగ్గడు.

ఆ వ్యక్తి కొంతసేపు ఆలోచించి తన ప్రక్కనున్నవాణ్ని పిలిచి, "ఒరే జాంబిగా! నీవుకూడా మరో ఇద్దరిని వెంటబెట్టుకుని ఈతనివెంట్ వెళ్లి. వజ్రాలు తీసుకురండి; మీకు ఎట్రైనా అనుమానం గలిగిందంటే, వెంటనే ఇతణ్ని చంపేయండి; ఇక నా ఆజ్ఞ కోసం ఎదురు చూడవద్దు!" అన్నాడు.

"అలాగే నాయకా!" అంటూ ఆ వ్యక్తి మరి ఇద్దరితో కలసి జగ్గణ్ని అనుసరించాడు. మనోహర్‌కుసరిగా జగ్గడి వ్యూహం అర్థంగాక, వారికేసి చూడసాగాడు.

జగ్గడు కొంతదూరం నడిచి, చెట్లు గుబురుగా వున్నచోట ఆగి, "ఆ! ఇదే స్థలం. నేను లోపలికి వెళతాను. మీరు శబ్దం చేయకుండా ఒకరి వెంట ఒకరు రండి!" అంటూ వేగంగా గుబురులో ప్రవేశించాడు.

వచ్చినవారు మాట్లాడకుండా ఒకరి మొఖం ఒకరు చూసుకుని, తర్వాత ఏదో నిశ్చయానికి వచ్చి, మెల్లగా లోనికి నడిచారు. లోపల తయారుగా వున్న జగ్గడు లోపలికి వచ్చిన వాడి నోరుమూసి, తలపై గట్టిగా బాది నేలపై తోశాడు; వెనుక వచ్చిన వాడిగతి అంతే! చివరిగా వచ్చిన జాంబిగాడి చేతిలోని ఆయుధాన్ని పైకి ఎగరగొట్టి, అతన్ని లోపలికి లాక్కుని, చెంపపై దెబ్బవేసి "ఒరేయ్ జాంబిగా! నేను అడిగే ప్రశ్నలకు సరిగా సమాధానం చెప్పకపోయావంటే, నీ ముందు వారికి పట్టినగతి నీకూ పడుతుంది. అసలు ఆ గుహలో ఇంకా ఎంతమంది వున్నారు? ఈ నాలుగు సింహాలూ కుక్కలలా మీ వెంట ఎలా తిరుగుతున్నాయి?-మర్యాదగా చెప్పు!" అన్నాడు-జగ్గడు.

"ఆ గుహలో మా నాయకునికి సహాయంగా నేను, ఈ ఇద్దరు మాత్రం వున్నాము; ఇంకా ఎవరూ లేరు. మావద్ద మంత్రించిన నల్లబీదారాలు కుడిచేతికి కట్టుకుని వున్నాము.

అవి వున్నంతవరకు సింహాలు ఏమీ చేయవు. ఆ దారాలు కట్టుకున్నవారి ఆజ్ఞలను అవి పాటిస్తుంటాయి. వాటిసహాయంతో మేము ఆపదకి వచ్చినవారిని వారి కుడిచేతిని సుంకంగా కావాలంటూ అందరిని బెదిరిస్తూ వుంటాం. అప్పుడు అందరూ భయపడి వారి వద్దవున్న విలువైన వస్తువులను మాకు ఇచ్చి వెళ్ళిపోతారు. అంతేగాని మాకు ఏ శక్తిలేదు" అన్నాడు.

ఆది విన్న జగ్గడు జాంబిగాడి తలపై ఓ బెబ్బవేసి, క్రింద పడదోసి, అతని కుడి చేతి కున్న నల్లటిదారాన్ని తీసి, తన కుడిచేతికి కట్టుకుని, అక్కడి నుండి వేగంగా గుహకేసి కదిలాడు.

గుహబయట నాలుగు సింహాలు కనిపించాయి-జగ్గడికి. తన కుడిచేతిని వాటికి మాపుతూ లోనికి వెళ్ళాడు. ఒంటరిగా వస్తున్న జగ్గణ్ణిచూసి నల్లటి వ్యక్తి ఆశ్చర్యపోతూ "ఒంటరిగా వస్తున్నావు నా మనుషులెక్కడ?" అని గద్దించాడు.

"వాళ్ళంతా ఆక్కడ వజ్రాలు వెదుకుతున్నారు; నిన్ను అక్కడికి రమ్మన్నారు; అది చెప్పడానికే! వచ్చాను" అన్నాడు-జగ్గడు.

నల్లటి వ్యక్తి అతని మాటలు నమ్మలేక పోయాడు; తనకు సహాయంగా సింహాలు తప్ప ఎవరూ లేరని చేతులు తట్టబోయాడు. జగ్గడు ఓ ఎగురుతో ఆ వ్యక్తిని క్రిందపడదోసి, అతని కుడిచేతికి వున్న నల్లటిదారాన్ని వూడబెరికి, మనోహర్ వైపు విసిరి "మనోహర్! ఆ



దారాన్ని నీకుడిచేతికి కట్టుకో!" అంటూ నల్లటివ్యక్తితో పోరాడసాగాడు. ఇద్దరూ హోరాహోరిగా పోరాడుతున్నారు. జగ్గడు కొట్టేదెబ్బలకు మనోహర్ సంతోషంతో చప్పట్లుకొట్టాడు.

ఆ శబ్దానికి బయటవున్న నాలుగు సింహాలూ లోనికి వచ్చాయి. పరిస్థితిని అర్థంచేసుకున్న జగ్గడు నల్లటి వ్యక్తిని కొంతదూరానికి విసిరి, మనోహర్ వద్దకు వచ్చి,అతని కుడిచేతిని తన కుడిచేత్తో పైకెత్తి "సింహాల్లారా! మావద్ద మంత్రించిననల్లటిదారాలు వున్నాయి. నేను ఆజ్ఞ ఇస్తున్నాను. ఆ వ్యక్తిని చీల్చి చెండాడండి!" అనరిచాడు.

నాలుగు సింహాలూ ఒక్కసారిగా నల్లటి

వ్యక్తికేసి చూశాయి. అతను తుడిచేతిలో నల్లటి దారంలేదు; అంతేగాక అతనుభయంతో గజగజ వణుకుతున్నాడు. అంతే! నాలుగు సింహాలూ ఒక్కసారిగా నల్లటివ్యక్తిపైకి ఎగిరాయి. ఆ భయంకర దృశ్యాన్ని చూడలేక మనోహర్, జగ్గడు వెనక్కి తిరిగి, గుహనుండి అరణ్యంలోకి దారితీశారు. ఓచోట వారి రెండు గుర్రాలు మేతమేస్తూ కనబడ్డాయి. ఇద్దరూ వాటిపై ఎక్కి ముందుకు నడపసాగారు.

* * *

మాణిక్యవర్మ గండభేరుండ దీవిలో దిగిన వెంటనే, దీవినంతా ఒక్కసారి కలయ జూశాడు. అతనికి ఎవరూ కనిపించలేదక్కడ ఒక్కసారి తల విదిలించుకుని ముందుకు నడవసాగాడు.

"ఎవడురా నా దీవిలో అడుగుపెట్టింది?" అన్నమాటలు విని మాణిక్యవర్మ అగిపోయి, చుట్టూచూశాడు. అప్పుడు చెట్టుపైనుండి ఓ పొడుగాటి వ్యక్తి క్రిందికి దుమికాడు. ఆ వ్యక్తి శరీరమంతా నల్లటి దుస్తులు ధరించి వున్నాడు. తలలోని వెంట్రుకలు చుట్టలుగా చుట్టబడి నిటారుగావున్నాయి; మీసాలు మెడ వరకు దిగివున్నాయి; కనురెప్పలు పైకి తిరిగి వున్నాయి. మెడలో రుద్రాక్షమాలలున్నాయి. చూడడానికి చాలా భయంకరంగా వున్నాడా వ్యక్తి.

మాణిక్యవర్మ ఆ వ్యక్తిని ఒక్కసారి పరిశీలించి నవ్వుతూ, "పీష్వా! నన్ను గుర్తించలేదా? నేను నీ కొరకు ఈ దీవిలోకి వచ్చాను!" అన్నాడు. అందు కా వ్యక్తి 'నాపేరు నీకు తెలిసినంతమాత్రాన

నాకు మిత్రుడవా? అసలు నేను నిన్ను ఇంతవరకు చూసివుండలేదే! నాదగ్గరనుండి తప్పించుకోవడానికి ఎత్తులువేస్తున్నావా? జాగ్రత్త!" అని బెదిరించాడు.

"అవసరపడకు పీష్వా! నేను కాంచనపురంనుండివస్తున్నాను; ఇరవైసంవత్సరాలకు మునుపు నీవు కాంచనపురానికి వచ్చావు. మారాజగురువుతో తగవులాడి, ఆయన్ని హత్యచేసి, చెరసాలకెళ్ళావు - జ్ఞాపకముందా? అప్పుడు మానాన్న రాజవర్మ, నిన్ను అక్కడినుండి తప్పించపచేశాడు. నువ్వు వెళ్ళేటప్పుడు మానాన్న చేతికి ఓ ఉంగరమిచ్చి, సహాయం కావాలంటే, గండభేరుండ దీవికి రమ్మని చెప్పావుకదా! ఇదిగో ఆ ఉంగరం!" వర్మ తన చేతివేలికున్న ఉంగరాన్ని చూపాడు.

పీష్వా దాన్ని బాగా పరిశీలించి, "ఇది నా ఉంగరమే! ఇది ఓ ముఖ్యమైన వ్యక్తికి ఇచ్చినబ్బు కొంత జ్ఞప్తికివస్తున్నది. నిన్ను నేను నమ్ముతున్నాను. ఇంతకు నీవు ఇంత దూరం ఎందుకు వచ్చావు?" అన్నాడు.

"అదంతా చాలా పెద్దకథ. పూర్తిగా చెబుతాను వినుఃనేను నలుగురితో కలిసి ఓ వ్యక్తిని చంపి, అతని వద్దనున్న ఐదు వజ్రాలు తీసుకుని, ఆ ఐదుగురు వాటిని పంచుకున్నాం. ఈ సంగతి తెలిసిన అతని కుమారుడు మా ఐదు మందిని చంపుతానని ప్రతిజ్ఞచేశాడు. అందుకోసం తలొక దిక్కుకు తప్పించుకుపోయాము. నేను ఎవరూ ఆడుగు పెట్టలేని ఈ దీవికి చేరుకున్నాను. ఇకమీదట నేను నీదగ్గరే వుంటాను!" అంటూ తన



దుస్తుల్లో దాచివుంచిన వజ్రాన్ని తీసి పిప్పాకి చూపించాడు. పిప్పా వజ్రాన్ని చూసి, "ఈ వజ్రం చాలా బాగుంది!" అంటూ తిరిగి వర్మకు ఇచ్చేశాడు.

తరువాత ఇద్దరూ మెల్లగా కొంతదూరం నడిచారు. ఓ చెట్టుక్రింద కీలుగుర్రం కనిపించింది. పిప్పా దానిపై ఎక్కి, "వర్మా! నా వెనుక కూర్చో! నాగుహకు వెళ్ళాలంటే, దీనిలోనే వెళ్ళాలి-అది చాలాదూరం!" అన్నాడు. వర్మ కీలుగుర్రంపై కూర్చోగానే, పిప్పా అందులోని మీటలు తిప్పాడు. మరుక్షణం గుర్రం ఆకాశంలోకి లేచింది. గాలిలో పక్షిలా ఎగురుతూ కీలుగుర్రం పోతూవుంది. ఆంతలో వారి కెదురుగా కొంతదూరంలో ఓ వ్యక్తి చేప ఆకారంలో వున్న వాహనంపై గాలిలో ఎగురుతూ వస్తున్నాడు. ఆ వ్యక్తిని చూడడంతో పిప్పా ముఖం ఎర్రబడింది. అది గమనించిన వర్మ, "పిప్పా! ఏమిటి అలాఅయిపోయావు; ఆ వ్యక్తి నీకు శత్రువా?" అన్నాడు.

"అవును వాడు నా పరమ విరోధి; వాడి పేరు ప్రచండుడు. ఈ వివరాలు నీకు తరువాత చెబుతాను!" అంటూ గుర్రానికి వున్న ఇంకో మీటను తిప్పాడు. మరుక్షణం గుర్రం నోటినుండి పొగతో కలిసిన మంటలు వేగంగా వచ్చి, ఎదురుదిశకు వెళ్ళింది. తరువాత గుర్రం క్రిందికి కొంతదిగి, వేగంగా వెళ్ళిపోయింది.

ఎదురువైపుగా వస్తున్న ప్రచండుడు, "అరెరే! ఈసారి పిప్పా తప్పించుకున్నాడే! వాడితో ఎవరో కొత్తవ్యక్తి వున్నాడే! పిప్పా నన్ను చంపడానికి ఎదో పెద్దఎత్తు వేస్తున్నాడు. తరువాత చూద్దాం ఆ విషయం!" అని మనసులో అనుకుంటూ వేగంగా ముందుకు వెళ్ళాడు.

కీలుగుర్రం పెద్ద గుహ ముందు నిలిచింది. పిప్పా, వర్మ కిందికి దిగారు. గుహబయట ఓ పెద్దపులి, సింహం కాపలా కాస్తున్నాయి. పిప్పా ఓ నల్లటి దారాన్ని వర్మ చేతికి కట్టి "ఇది వుంటే నిన్ను ఏ క్రూర జంతువులూ ఏమీ చేయవు!" అన్నాడు.

తరువాత ఇద్దరూ గుహలోకి నడిచారు. బయట వున్న పులి, సింహాలు పెంపుడు

తుక్కల్లా వారి కాలిని నాకసాగాయి. ఇద్దరూ గుహలో చాలాదూరం ముందుకు నడిచాక, పీష్వా గోడకున్న చక్రాన్ని తిప్పాడు. మరు క్షణం ప్రక్కనున్న గోడపైకి జరిగింది.

ఇద్దరూ లోపలికి వెళ్లారు. లోపలినుండి ఇద్దరు అంచమైన అమ్మాయిలు బయటికి వచ్చి, పీష్వాని, వర్మని లోపలికి తీసుకు పోయి, అంచమైన హంసతూలికాతల్పంపై పడుకోబెట్టారు. అది రాజభవనంలా వుంది. అది చూచి వర్మ ఆశ్చర్యపోయాడు. పీష్వా జీవితం ఎంతోహాయిగా గడుపుతున్నాడు!- అని మనసులో సంతోషపడ్డాడు. ఇంకొక స్త్రీ ఓ పాత్రలో మత్తు పానీయాన్ని తెచ్చి వర్మకు ఇచ్చింది. అది తాగిన వెంటనే వర్మకు తల తిరిగినట్లనిపించి, అలాగే క్రింద పడిపోయాడు.

* * *

మనోహర్, జగ్గడు కాంచనపురానికి చేరుకున్నారు. అది అర్ధరాత్రి సమయం. ప్రజలంతా హాయిగా నిద్రాదేవత ఒడిలో వొరిగి వున్నారు. మనోహర్ గుర్రాన్ని తనఇంటి ముందు ఆపాడు. జగ్గడు వెనకనే ఆ గుర్రం నుండి క్రిందికి దిగాడు. మనోహర్ కూర్మయ్య ఇంటికి వెళ్ళి తలుపు తట్టాడు. కొంతసేపటికి ఓ వృద్ధ స్త్రీ తలుపు తెరిచి "ఎవరు మీరు? ఇంత రాత్రి సమయంలో ఎందుకు వచ్చారు?" అని ప్రశ్నించింది.

మనోహర్ విసురుగా "కూర్మయ్యను ముందుగా బయటికి పిలు, లేకపోతే లోపలికి రావలసి వుంటుంది!" అన్నాడు. అందుకా స్త్రీ విచారంగా మొఖం పెట్టి "కూర్మయ్య తమ్ముడు వారం రోజుల కిందట చనిపోయాడు!" అన్నది. ఆ మాట విన్న మనోహర్, జగ్గడు అదిరిపడ్డారు; జగ్గడు కోపంతో, "కూర్మయ్య బ్రతికే వున్నాడు; మాతో అబద్ధం చెప్పి బయటికి తరుముదామనుకున్నావా?" అంటూ ఆస్త్రీని బలంగా ప్రక్కకు త్రోసి, లోపలికి నడిచాడు; మనోహర్ వేగంగా అతన్ని అనుసరించి వచ్చాడు.

గదిలో ఓ స్త్రీ తప్ప మరెవరూ లేరు. ఓచోట కూర్మయ్య పటానికి మాల వేసివుంది; ముందు దీపం వెలుగుతూ వుంది. (ఇంకావుంది)




## 8

జరిగిన కథ: వజ్రాలను దొంగలించిన వారిని బంధించుట కొరకు బయలుదేరిన మనోహర్, జగ్గడు అడవిలో పాడుగాటి నల్లటి వ్యక్తివద్ద చిక్కుకున్నారు, జగ్గడు తెలివితో వారిని చంపి, అక్కడనుండి ఇద్దరూ తప్పించుకున్నారు. మాణిక్యవర్మ, గండభేరుండదీవిలో పీష్వాని కలుసుకుని, అతని స్నేహం సంపాదించి, అతని గుహను చేరాడు. మనోహర్, జగ్గడు కాంచనపురం చేరి కూర్మయ్య ఇంటికి వెళ్ళారు. అక్కడ అతను వారం రోజుల ముందు చనిపోయినట్లు తెలుసుకున్నారు.

రచన: బి.ఆర్. వరదరాజులు

అంతలోకే ఆ స్త్రీ ఏడుస్తూ, "ఇప్పుడైనా నమ్ముతారా? వారంరోజుల మునుపు కూర్మయ్యకు ఆరోగ్యం బాగులేదని తెలిసి నేను ఇక్కడికి వచ్చాను. కానీ నేను వచ్చేటప్పటికి కూర్మయ్య చనిపోయివున్నాడు!" అన్నది.

అంతలోనే మనోహర్, జగ్గడు వజ్రంకోసం ఆ గదంతా శోధించారు కానీ ఎక్కడా వజ్రం కనిపించలేదు. దాన్ని కూర్మయ్య ఎక్కడ దాచివుంటాడా - అని మనోహర్ ఆలోచించ సాగాడు. ఉన్నట్టుండి ఏదో గుర్తుకువచ్చి, ఆ స్త్రీవద్దకు వెళ్లి, "నీవు వచ్చేటప్పటికి కూర్మయ్య చనిపోయివున్నాడుగదా! మరి అతనిప్రక్కన ఎవరున్నారు? బాగా ఆలోచించి చెప్పు!" అని సూటిగా ఆమె ముఖంలోకి చూస్తూ ప్రశ్నించాడు.

అందు కామె కొంతసేపు ఆలోచించి, 'ఆఁ జ్ఞప్తికి వచ్చింది - నేను కోపలికి వస్తున్న సమయంలో కామాక్షమ్మ ఏడుస్తూ, కూర్మయ్య చనిపోయాడని నాకు చెబుతూ వెళ్ళిపోయింది!" అన్నది.

"కామాక్షమ్మ ఇల్లు ఎక్కడుంది?" అని జగ్గడు అడిగాడు.

అందుకు ఆమె, "కామాక్షమ్మ ఇక్కడ పనిమనిషి. ఆమె ఈ వూరిచివరన గుడిసెలో వుంటుంది. ఇంతకీ ఇదంతా ఎందుకు అడుగుతున్నారు? కూర్మయ్య వద్ద మీ వస్తువు ఏదైనావుందా?" అనడిగింది.

ఆ మాటలకు ఇద్దరూ సమాధానం చెప్పక, వేగంగా బయటికి వెళ్ళి, అక్కడున్న గుర్రాలపై ఎక్కి అదిలించారు. క్షణంలో వారు వూరిచివరికి చేరుకుని, అక్కడ కామాక్షమ్మ ఇంటివిషయమై వాకబు చేసుకుని చిన్న గుడిసెను చేరుకున్నారు.

గుడిసె తలుపులు తెరిచి వున్నాయి. ఇద్దరూ మెల్లగా లోపలికి తొంగి చూశారు. లోపల ఓ స్త్రీ సన్నగా ఏడుస్తూంది. ఆమెతో ఓ తాగుబోతు పిచ్చిగా మాట్లాడుతూ, ఏదో అడుగుతున్నాడు. ఇద్దరూ "కామాక్షమ్మా!" అని పిలుస్తూ లోపలికొచ్చారు.

ఆ మాట విని తాగుబోతు వెనక్కి తిరిగి "ఎవర్రామీరు? నా పెళ్ళాం పేరు పిలుస్తూ



వస్తున్నారు? దానికి మీరు మొగుళ్ళా?" అన్నాడు వత్తిపలుకుతూ.

జగ్గడు కోపంతో తాగుబోతు చెంపపై ఓ దెబ్బవేసి, "తాగేసి ఎందుకు పిచ్చిగా వాగుతున్నావు?" అన్నాడు.

వెంటనే మనోహర్, "కామాక్షమ్మా! ఆ వజ్రం ఎక్కడ దాచావు?" అనడిగాడు.

ఆ మాటలకు ఆమె వణికిపోతూ, అవజ్రం నాదగ్గిరెక్కడుంది? అసలు ఒక్క బంగారు నాపెంకూడా లేదు. మీరు విలాసం మారి వచ్చినట్టుంది!" అన్నది.

మనోహర్ కళ్ళెర్రజేసి, "మర్యాదగా కూర్మయ్య దగ్గిరినుండి తీసుకున్న వజ్రాన్ని ఇస్తావా, లేక నీ ప్రాణాలు తీయమంటావా?" అని గట్టిగా బెదిరించాడు.

అందుకామె భయపడుతూ, "అయ్యా! నేను అంతావివరంగా చెబుతాను: నన్ను వదిలేయండి! ఆరోజు నేను కూర్మయ్య ఇంటికి పనికి వెళ్ళాను. అప్పుడు కూర్మయ్య మంచం మీద పడుకుని 'దాహం, దాహం!' అని మెల్లగా అంటున్నాడు. నేను గబగబా పరిగెత్తికెళ్ళి నీళ్ళు ఒక పాత్రలో తీసుకుని వచ్చాను. అంతలోకే ఆయన ప్రాణాలు పోయాయి. నేను అదితెలియక ఆయన్ని కుదిపాను; కానీ ఆయన లేవలేదు. వున్నట్టుండి నావృష్టి ఆయన తలగడ క్రిందికి పోయింది. ఆక్కడ చిన్నపెట్టె వుంది. ఏమిటా అని తెరిచిచూశాను. అందులో మిలమిలలాడుతూ మెరుస్తున్న అందమైన వజ్రం కనబడింది. అంతే! నేను దాన్ని చేతికి తీసుకుని వేగంగా బయటికి వచ్చేశాను అప్పుడు నాకు ఎదురుగా కూర్మయ్యఅక్క వచ్చింది. నేను వేగంగా ఇంటికి వచ్చి, అటకమీద చిన్న కుండక్రింద దాన్ని దాచాను. కానీ నిన్న రాత్రి మా ఆయన త్రాగివచ్చి, కుండక్రింద వున్న వజ్రాన్ని తీసుకుపోయాడు. అంతే! ఇప్పుడు ఆ వజ్రం నా దగ్గరలేదు!"అన్నది.

అంతా విన్న మనోహర్‌కు చివరి రెండు వాక్యాలు విసుగుకలిగించాయి. అప్పటికే జగ్గడు పెద్దపాత్ర నిండా నీరు తీసుకువచ్చి, ఆ తాగుబోతు నెత్తిమీద కుమ్మరించాడు. కొంతసేపటికి అతని మత్తు వదలిపోయింది.



మెల్లగా పైకిలేచి, "ఎవరు మీరు? ఇక్కడి కెందుకొచ్చారు?" అన్నాడు.

అందుకు జగ్గడు, "తాగుబోతూ! నీపెళ్ళాం మా వజ్రాన్ని దొంగిలించుకు వచ్చింది; నీవు దాన్ని ఎక్కడికో నిన్న తీసుకు వెళ్ళావట; దానికొరకు నేను వచ్చాను. మర్యాదగా వజ్రాన్ని ఎవరికిచ్చావో చెప్పు; లేకపోతే నీ ప్రాణాలు తీస్తేస్తాను!" అని బెదిరించాడు.

అందు కతను "అయ్యా, నన్ను క్షమించండి! నిన్న నేను తాగినమత్తులో తెలియక ఆ వజ్రాన్ని తీసుకుపోయి ఇక్కడికి దగ్గరిలో వున్న చిత్రాంగి అనే వేశ్యకి కానుకగా ఇచ్చాను. కానీ ఇప్పుడు ఇవ్వమంటే ఇవ్వదు. ఆమెవద్ద బలశాలురు చాలామంది వున్నారు. మీకు ఆమె ఇంటిని చూపిస్తాను మీరు ఎలా గైనా తీసుకోడానికిప్రయత్నించండి!" అంటూ బయటికి నడిచాడు.

ఇద్దరూ వేగంగా అతన్ని వెంబడించారు. అతను ఓ పెద్దఇంటిముందు ఆగి, "అయ్యా! ఇదే చిత్రాంగి ఇల్లు; మీరు లోపలికి వెళ్ళండి!" అని వెనక్కి తిరిగాడు.

ఇద్దరూ మాట్లాడుకుంటూ ఆ ఇంటి వైపు నడిచారు. అంతలో ఇంటినుండి ఇద్దరు దృఢకాయలు వచ్చి, "ఎవరు కావాలి?" అని ప్రశ్నించారు.

"మేము చిత్రాంగి కోసం వచ్చాము కొన్ని కానుకలు ఆమెకు ఇవ్వాలి!" అని జగ్గడు అన్నాడు.

"లోపలికి రండి! మీలాంటి రసికుల కోసమే ఆమె ఎదురుచూస్తూవుంటుంది!" అంటూ లోనికి ఆహ్వానించారు - వారు.

ఇద్దరూ తలాడించుకుంటూ లోపలికి వెళ్ళారు. ఓ పెద్ద గదిలో చిత్రాంగి నృత్యం చేస్తూంది. ఆమెచుటూ వున్న త్రాగుబోతులు పిచ్చి పిచ్చిగా ఏదో వాగుతున్నారు. ఇద్దరూ మౌనంగా నిలబడి చిత్రాంగికేసి చూడ సాగారు. ఆమె మెడలోని హారం మధ్య వారి వజ్రం చెక్కబడివుంది. అది మనోహర్ కని పెట్టి జగ్గడికి చెప్పాడు. తరువాత మెల్లగా మాట్లడుకున్నారు.

కొంతసేపటికి నృత్యంసమాప్తి అయిపోయి, అందరూ వెళ్ళిపోయారు. చిత్రాంగి లోపలికి పోతూ, దూరంలో నిలబడి వున్న కొత్త



వాళ్ళను చూసి, "ఇక నృత్యం అయి పోయింది. రేపురాత్రికి రండి!" అన్నది.

"మేము దూరదేశంనుండి వచ్చాము రాత్రికి ఇక్కడ పడుకుని ఉదయం వెళ్ళి పోతాం. పోయేముందు ఈ వజ్రం కానుకగా ఇస్తాము!" అంటూ తన దగ్గరున్న వజ్రాన్ని చూపాడు - మనోహర్.

వజ్రాన్ని చూడడంతో చిత్రాంగి కళ్ళు పెద్దవయినాయి. "అరే! నిన్న ఓ తాగుబోతు నాకు ఇచ్చిన విలువైన వజ్రంలా వుందే! దీన్ని ఎలాగయినా సంపాదించితీరాలి!" అని మనసులో అనుకుని పైకి, "అలాగే రండి! మేడపై పెద్దగది వుంది. అక్కడ విశ్రాంతి తీసుకోవచ్చు!" అంటూ ఇద్దరినీ పైకి తీసుకు పోయింది.

కొంతసేపయ్యాక మనోహర్, జగ్గడు ఏవోమాటలు బయటినుండి వినిపించడంతో జాగ్రత్తగా వినసాగారు.

గది బయట చిత్రాంగి, పదిమంది వృధ కాయులతో "ఒరేయ్! ఈ గదిలో ఇద్దరు రత్నాల వర్తకులున్నారు వారి వద్ద చాలా విలువైన వజ్రాలు వున్నాయి. మీరు లోపలికి వెళ్ళి ఇద్దరినీ చంపి, ఆ వజ్రాలు తీసుకు రండి!" అన్నది.

"అలాగే! అందరూ ఎందుకు? ఇద్దరం మీకు కాపలాగా వుంటాం; మిగతావారు లోనికి వెళ్ళి వారిని చంపుతారు!" అన్నాడొకడు.

"అవసరం లేదు. నేను ఈ ప్రక్కగదిలో వుంటాను. మీరందరూ లోపలికి వెళ్ళండి; వాళ్ళని తప్పించుకోనివ్వకండి, జాగ్రత్త!" అని హెచ్చరించింది - చిత్రాంగి.

"ఆలాగే!" అని తలాడించారు-దృఢకాయలు

అంతటినీ ఇద్దరూ బాగా విన్నారు. మనోహర్ జగ్గనితో మెల్లగా ఎదో చెప్పాడు. తరువాత ఇద్దరూ తలుపుకు చెరొక ప్రక్కన నిలబడ్డారు. కొంతసేపటికి మెల్లగా తలుపులు తెరుచుకుండి, లోపల చీకటిగా వుండటంవల్ల దృఢకాయలు తలుపు ప్రక్కన దాక్కున్న వారిని గమనించలేదు. వారు పదిమంది మెల్లగా లోపలికి వెళ్లారు. ఉన్నట్టుండి మనోహర్, జగ్గడు గదిబయటికి వచ్చి, తలుపులు గట్టిగా బిగించారు. అంతలో లోపలున్న వారు గదిలో ఎవరూ లేరని తెలుసుకుని తలుపులు గట్టిగా బాదసాగారు.

బయటినుండి మనోహర్, "ఒరేయ్ మమ్మల్ని దొంగవాటుగా చంపడానికి వస్తారా? చావండిరా!" అంటూ జగ్గడితో ప్రక్క గదిలోకి వెళ్లాడు.

గదిలోవున్న చిత్రాంగి అడుగుల సవ్వడిని, "తెచ్చారా వజ్రాల్ని, ఎన్ని వున్నాయి?" అంటూ బయటినుండి లోనికి వస్తున్నవారిని చూసి ఆశ్చర్యంతో, "అరే మీరా! అంతమంది చితులనుండి ఎలా తప్పించుకున్నారు?" అన్నది.

"మాశక్తి అంత మహత్తరమైంది. మమ్మల్ని చంపడానికి మనుషుల్ని పంపుతావా? చూడు నిన్నేంచేస్తానో!" అంటూ జగ్గడు చిత్రాంగిని కాళ్ళు, చేతులు త్రాడుతో కట్టేశాడు. తరువాత మనోహర్ ఆమె మెడలోని హారాన్ని తీసుకుని, "ఈ వజ్రం మాది; నువ్వు మమ్మల్ని కొంత కష్టపెట్టినందుకు

శక్తిగా వజ్రంతో పాటు ఈ హారాన్నికూడా తీసుకుంటున్నాము!" అంటూ రహస్యంనుండి వజ్రాన్నివూడదీసి, హారాన్ని జగ్గని కిచ్చి, "జగ్గా! ఈ హారం నీమెడలో వేసుకో!" అంటూ బయటికి వెళ్ళారు.

ఇద్దరూ బయటికి రావడంతో కాపలా వున్న దృఢకాయులిద్దరూ "ఏమిటి ఇంత రాత్రివేళలో వెళతారా? రేపు ఉదయం వెళతారని అమ్మగారు చెప్పిందే!" అని అన్నారు.

అందుకు మనోహర్ తడుముకోకుండా "అదే! మీఅమ్మగారికి తలనొప్పిగా వుందట; మిమ్మల్ని పైకి రమ్మని చెప్పింది; అందుకు మేం క్రిందికి వచ్చాం!" అన్నాడు.

"అలాగే, మేం వచ్చేవరకు మీరు ఇక్కడే వుండండి!" అంటూ ఇద్దరూ పైకి వెళ్ళారు. వెంటనే మనోహర్, జగ్గడు బయటికి వచ్చి, కొంతదూరంలో ఆగివున్న గుర్రాలను ఎక్కి, రాజుగారిని కలవడానికి అంతఃపురం వైపు గుర్రాలని దౌడుతీయించారు.

* * *

కొంతసేపటికి మత్తులో వున్న వర్మ తేరుకుని మెల్లగా కళ్ళు తెరిచాడు. ప్రక్కనే నిలిచివున్న పీష్వా నవ్వుతూ, "వర్మా! ఏమిటి అలా పడిపోయావు? నీకు ఈ పానీయాలు త్రాగేఅలవాటు లేనట్టుంది? క్రమంగా సరిపోతుందిలే!" అన్నాడు.

తరువాత వర్మ లేచి, "పీష్వా! నాకు నీవు బాగానచ్చావు. నేను ఇక్కడే వుండి, నీకు శిష్యరికం చేస్తాను. అవును, దారిలో నీ శత్రువు గురించి ఏదో చెబుతానన్నావు?" అన్నాడు.

అందుకు పీష్వా "అదంతా పెద్దకథ వివరంగా చెబుతాను విను: ఈ గండభేరుండ దీవిలో భైరవుడు అనే పెద్ద మాంత్రికుడు వుండేవాడు. ఆయన వద్ద నేను, నా శత్రువు ప్రచండుడు శిష్యులుగా వున్నాం. అప్పుడు మే మిద్దరం మిత్రులం. గురువుగారు మాకు అన్నివిద్యలు నేర్పి, మంత్రవిద్య మాత్రం నేర్పలేదు. మేము చాలాసార్లు ఆయన్ని అడిగాము.

(ఇంకావుంది)




## 9

జరిగిన కథ: మనోహర్, జగ్గడు, కూర్మయ్య చనిపోయాడని తెలుసుకుని, అతని వద్ద నున్న వజ్రం గురించి కూర్మయ్య అక్కను అడిగారు. తరువాత అక్కడ నుండి వజ్రం కామాక్షమ్మ తీసుకుపోయిందని, ఆమె వద్ద నుండి నాట్యకత్తె చిత్రాంగి వద్దకు వజ్రం చేరిందని తెలుసుకుని ఇద్దరూ ఆమె వద్దకు వెళ్ళారు. చిత్రాంగి వద్ద దృఢకాయులు చాలా మంచివున్న, ఇద్దరు తెలివితో వజ్రాన్ని కాజేసారు. గండభేరుండదీవిలో పిష్పా మాణిక్య వర్మకు తన కథను చెప్పసాగాడు.

రచన: బి.ఆర్. వరదరాజులు

ఓరోజు ఆయన మాఇద్దర్నీ పిలిచి, "నాయనలారా! నా మంత్రవిద్య మీలో ఒక్కరికి మాత్రమే నేర్పాలని వుంది. కానీ మీ ఇద్దరూ నా రెండు కళ్ళలాంటివాళ్ళు; మీలో ఒకరికి అన్యాయంచేయటం నాకు ఇష్టం లేదు. అందువల్ల నా మంత్రశక్తిని ఓ చిన్న భరిణలో దాచి, దాన్ని 'సర్పలోయ'లో దాచాను. ఇంతకీ మీకు ఆ సర్పలోయ ఎక్కడున్నదో తెలియదు; మీరు దారితెలుసుకుని, ఆ లోయలోని భరిణను తీసి తెరిచారంటే, మంత్రశక్తి వారికి అబ్బుతుంది. ఎవరికి అదృష్టం వుంటే, వారికి మంత్రశక్తి చేజిక్కుతుంది. మీకు అక్కడికి పోవడానికి రెండు వాహనాలు ఇస్తాను!" అంటూ నాకు కీలు



గుర్రాన్ని, ప్రచండునికి చేపను ఇచ్చాడు. రెండూ సమానశక్తిగలవి; మీటలు నొక్కితే ఆకాశంవైపు ప్రయాణించగలవు.

నేను, ప్రచండుడు ఆ రోజుతో శత్రువుల మయ్యాం. ఒకరికి తెలియకుండా ఒకరం సర్పలోయకు పోవడానికి ప్రయత్నించ సాగాము.

మా గురువుగారు చనిపోయేటప్పుడు మా ఇద్దరినీ పిలిచి, ఇద్దరూ మిత్రులుగా వుండ మని చెప్పి, ఆయన నివాసస్థలమైన ఈ మంత్రా గుహను నాకు ప్రచండుడికి నాట్యంచేసే బొమ్మను ఇచ్చాడు. తరువాత నాకు సర్పలోయకు పోయేదారినిమాత్రం చెప్పాడు; ప్రచండునికి సర్పలోయనుండి భరిణను తీసేవిధానం చెప్పాడు. ఒకరికి చెప్పింది మరొకరికి చెప్పకుండా, కొంత సేపటికి ఆయన ప్రాణాలు విడిచాడు. మేం ఒకరితో ఒకరం మాట్లాడకుండా వెళ్ళి పోయాం. ఆరోజు నుండి ప్రచండుడు నా దగ్గరనుండి సర్పలోయకు దారిని తెలుసుకోడానికి చాలాయత్నాలు చేశాడు. నేను ఎక్కడికి వెళ్ళినా రహస్యంగా నన్ను వెంబడించేవాడు. నేను ఆ సంగతి తెలుసుకుని ఇంతవరకు సర్పలోయకే వెళ్ళలేదు. అక్కడికి వెళ్ళాలంటే, నీలాటి శిష్యుడికోరకు ఇన్నిరోజులు వేచివున్నాను. ఇప్పుడు కనపడ్డావు నువ్వు! నీకు సర్పలోయకు దారి చెప్పి, నీ ద్వారా భరిణను ఎలాగైనా సంపాదిస్తాను. ఆ భరిణ నాకు, ప్రచండుడికి



గదు!" అని ముగించాడు.

"అలాగే పిష్వా! నీకొరకు ఎంత కష్టమైన పనియైనా తృటిలో చేస్తాను!" అని అన్నాడు మాణిక్యవర్మ.

"శబాష్! ఇప్పుడు నా శిష్యుడి వనిపించుతున్నావు!" అని మెచ్చుకున్నాడు- పీష్వా.

* * *

ప్రచండుడు తన నివాసస్థలానికి పోయి, ఓ మూలనవున్న చిన్నగధి తెరచి లోపలికి వెళ్ళాడు. గదిలో అందమైన స్త్రీ విగ్రహం వద్దకు వెళ్ళి, చేతితో మూడుసార్లు తాకాడు. మరుక్షణం విగ్రహానికి ప్రాణం వచ్చినట్లు మధురమైన కంఠంతో పాడసాగింది; ఆ తరువాత చక్కగా నృత్యం చేయసాగింది. ఆ నృత్యాన్నితనివితీరా ప్రచండుడు చూసి, తరువాత చాలని చేతితో సైగచేశాడు. మరుక్షణం అస్త్రీ బొమ్మగా మారిపోయింది. అంవరకు పీష్వాను చూసిన కోపంతో వున్న ప్రచండునికి ఆ నృత్యం చూడడంతో కొంత శాంతి కలిగింది.

అంతలోకే ఆటుగా వచ్చిన పాడుగాటివ్యక్తి "గురువుగారూ! ఏమిటి కోపంతో వున్నారు? ఎన్నడూలేనిది వింతగా వసంతమండపంలో తూర్చున్నారే!" అన్నాడు.

"జీవా! ఈరోజు ఆ ద్రోహిని చూశాను. అదిగాక వాడివెంట ఓ కొత్తవ్యక్తి వున్నాడు. పీష్వా సర్పలోయకు ఆ వ్యక్తిని పంపిస్తే డేమోనని నాకు అనుమానంగా వుంది; దుర్మార్గుడైన పీష్వా చేతికి మంత్రాల భరిణ పోయిందంటే, ప్రపంచాన్నే నాశనం చేయగల శక్తివస్తుంది. వాణ్ని ఇంతవరకు చంపకుండా వదిలినందుకు నాపై నాకే కోపంగా వుంది!" అన్నాడు ప్రచండుడు.

అవసరపడకండి గురువుగారూ! పీష్వాని చంపామంటే, ఆ సర్పలోయకు పోవడానికి దారి మనకు దొరకదుకదా! వాడు ఒక కొత్త వ్యక్తితో కలిశాడంటే, మనమూ అలాగేచేద్దాం. నేను ఇకపై దీవిలోకి అడుగుపెట్టినవాణ్ని మీదగ్గరికి తీసుకువస్తాను. పీష్వా పథకాన్ని నాశనం చేద్దాం!" అన్నాడు జీవకుడు.

* * *

మనోహర్, జగ్గడు అంతఃపురం చేరుకున్నారు. అది అర్ధరాత్రి సమయం అయినందున కాపలాదార్లు వారిని లోనికి పంపలేదు. మనోహర్ తనదగ్గిరున్న రాజముద్రిక చూపాడు. మరుక్షణం వారిని లోనికి పంపారు.

నిద్రపోతున్న రాజుగారు లేచి, తనకొరకు వచ్చిన మనోహర్‌ను చూసి, "ఏమిటి ఇంత రాత్రి సమయంలో వచ్చావు? ఆ ద్రోహుల దగరి నుండి వజ్రాలను తీసుకొచ్చావా?" అని అడిగాడు.

"మహారాజా! నాలుగు వజ్రాలు ఎలాగో కష్టపడి సంపాదించాను ఇంకొక వజ్రం గండభేరుండ దీవిలో మాణిక్యవర్మ వద్ద వున్నది; వెళ్ళి తీసుకురావాలి. ఇప్పుడు అక్కడికే నా ప్రయాణం. నేను సంపాదించిన మీ నాలుగు వజ్రాలు ఇవ్వడానికి వచ్చాను. మా నాన్న నిర్దోషి అని నేను పూర్తిగా నిరూపించాలి!" అంటూ తన వద్దనున్న నాలుగు వజ్రాలను రాజు కిచ్చాడు-మనోహర్.

"మనోహర్! నీ పితృ భక్తికి నేను ఎంతో సంతోషిస్తున్నాను; నీవు క్షేమంగా గండభేరుండదీవికి వెళ్ళిరావాలని నేను దీవిస్తున్నాను" అని ఆశీర్వదించాడు.

మనోహర్, జగ్గడు - ఇద్దరూ అక్కడి నుండి బయటికి వచ్చి అక్కడ తయారుగా వున్న వారి గుర్రాల నెక్కి దౌడు తీయించారు.

వారంరోజులు ఏకధాటిగా ప్రయాణంచేసి ఇద్దరూ పెద్ద అరణ్యంమధ్యలో వున్న కుటీరాన్ని చేరుకున్నారు. మనోహర్ కుటీరంలోకి

వెళ్ళి, అక్కడున్న మునీశ్వరునితో, "స్వామి! మేం చాలాదూరంనుండి వస్తున్నాం; గండభేరుండదీవికి వెళ్లాల. దారి చూపుతారా?" అన్నాడు వినయంగా.

ఆది విన్న మహర్షి ఆశ్చర్యంతో, "నాయనా! నా జీవితకాలంలో అలాంటి పేరు గల దీవిని గురించి వినలేదు!" అని అన్నాడు.

దాంతో చప్పబడిపోయిన జగ్గడు, "మనోహర్! ఏమిటి అసలు ఆ పేరుగల దీవి వుందా; లేక మనల్ని దారి మళ్లించడానికి వర్మ చేసిన మోసమా? ఈ వారం రోజులలో ఎందరిని విచారించినా, ఎవరికీ ఆ దీవికి దారి తెలియదంటారు!" అన్నాడు విసుగ్గా.

"జగ్గా! గండభేరుండిదీవి నిజంగా వుండి తీరాలి. ఇంకా మనం ముందుకువెళ్ళి ప్రయత్నిద్దాం!" అన్నాడు మనోహర్.

అంతలో మునీశ్వరుడు "నాయనలారా! మీకు ఆ దీవిని గురించి తెలుసుకోవాలంటే, కష్టమైన మార్గం వుంది!" అన్నాడు.

"ఎంతటికష్టమైనా పర్వాలేదు చెప్పండి!" అన్నాడు మనోహర్.

మునీశ్వరుడు కుటీరం వెలుపలికి వచ్చి, వారికి కుడివైపుగా తన చేతివ్రేలిని చూపుతూ "ఆదిగో! దూరంలో ఏటవాలుగా ఓ కొండ కనబడుతుంది చూశారా! ఆ కొండపైకి ఎక్కారంటే, దాని శిఖరాన పెద్దగాజుపెట్టె వుంటుంది. ఆ పెట్టెలో రకరకాల ఈకలు వుంటాయి. ఓ ఈకను తలపై పెట్టుకుని, మీరు ఎక్కడికి వెళ్లాలనుకుంటే, క్షణంలో అక్కడికి వెళ్ళిపోతారు!" అన్నాడు.

"ఓస్ ఇంతేనా? ఇంతటి సులభమార్గాన్ని ముందే చెప్పకుండా కష్టమైందని చెప్పారే!" అన్నాడు జగ్గడు.

"ఆవసరపడకు నాయనా! ఆ కొండ ప్రాంతంలో రాక్షసులూ, క్రూరజంతువులూ ఎప్పుడూ తిరుగుతూ వుంటాయి. వాటిని దాటుకుని ముందుకు వెళ్ళడం చాలా కష్టం. అదేగాకుండా, ఆ గాజు పెట్టెచుట్టూ ఎప్పుడూ పెద్దమంట మండుతూవుంటుంది. దాన్నిదాటి వెళ్ళితే, ఆ పెట్టెను చేతితో తాకామంటే, అంతే! మరుక్షణం పెట్టెవెనకనుండి రాక్షసి ఆంబోతు వస్తుంది. అది చాలా భయంకరమైనది. దాని కొమ్ములు కత్తిలా పదునుగా వుంటాయి. దాన్ని తప్పించుకోండం ఎవరివల్లా కాదు; దాన్ని చంపి, దాని రక్తాన్ని పెట్టెమీద పోశారంటే, మరుక్షణం పెట్టెతలుపులు అవే తెరచుకుంటాయి. అప్పుడు అందులో వున్న ఈకలు తీసుకోవచ్చు!" అన్నాడు మునీశ్వరుడు.

"స్వామీ! మీరన్నట్లు ఇందులో చాలాకష్టం వుంది; అయినా పర్వాలేదు. మేమిద్దరం ఆ ఈకలు ఎలాగైనా సంపాదిస్తాం. మీ రీ సలహా చెప్పినందుకు మా కృతజ్ఞతలు!" అంటూ మనోహర్, జగ్గనితో గుర్రం ఎక్కి వీటవాలు కొండవైపు దారితీశాడు.

మనోహర్, జగ్గడు వీటవాలు కొండను చేరారు. గుర్రాలు దిగి, కొండ ఎక్కడానికి ప్రారంభించారు. అప్పుడు వారికంటికి గాజు పెట్టె కనిపించలేదు. ఇద్దరూ ఆ గాజు పెట్టెను త్వరగా చేరాలని వడివడిగా కొండ నెక్కసాగారు. వున్నట్టుండి వారిపై చిరుతపులి దూకింది. జగ్గడు భయపడకుండా మొలలో నుండి కత్తిని దూసి, దానిమీద పట్టాడు ఇంతలో ఎలుగుబంటి మనోహర్ మీదికి దూకింది ఇద్దరూ ఆ రెండు జంతువులతో హోరాహోరీగా పోరాడుతున్నారు. వారి తాకిడికి తట్టుకోలేక రెండూ పారిపోయాయి. కానీ ఇద్దరికీ బాగా గాయాలు తగిలాయి. వారి వల్ల నడవడానికి వీలుకాకపోయింది. అందుచే ఓ చెట్టుక్రింద విశ్రాంతి తీసుకుందామని ఇద్దరూ ఆగారు.

అప్పుడు వారికెదురుగా ఓ బక్కచిక్కిన సన్యాసి వస్తూ, వీరిని చూసి, "ఎవరు మీరు

ఇక్కడెందుకున్నారు; మీకు ప్రాణాలమీద ఆశ లేదా?" అన్నాడు.

"ఏం ఎందుకు? మేం దేశద్రిమ్మరులం- ఇక్కడ మాకు ఏం అపాయం వుంటుంది?" అని అడిగాడు మనోహర్.

"ఇక్కడికి కొంతదూరంలో ఒంటి కన్ను రాక్షసుడు వున్నాడు; వాడు మహాక్రూరుడు; కనబడిన వారిని గుటుక్కుమింగివేస్తాడు!" అని అన్నాడు.

"అలాఅయితే నీవు ప్రాణాలతో ఎలా తిరిగి వస్తున్నావు?" అని ప్రశ్నించాడు జగ్గడు.

"అదే నా అదృష్టం! నేను ఉదయం దారి తప్పి, ఈ కొండ చేరాను; కొంతదూరం ముందుకు ఎక్కేసరికి నాముందు తాటి చెట్టుంత పాదాలు నిలిచినవి; నేను తలెత్తి చూచేసరికి నాముందు ఒంటికన్ను గల రాక్షసుడు సింహాన్ని తింటూ నిలుచున్నాడు. అంతే! క్షణంలో అక్కడి పరిస్థితి అర్థం చేసుకున్నాను. రాక్షసుడు క్రిందికి వంగేంతలో వేగంగా పరిగెత్తుకు వచ్చేశాను. రండి, దిగి వెళ్ళిపోదాం!" అన్నాడు.

"అలాగయితే రాక్షసుడు నిన్ను తరుముకుంటూ నీ వెంట వస్తున్నాడా?" అని జగ్గడు ఎదురుప్రశ్న వేశాడు.

దానికి సమాధానం ఆ వ్యక్తి ఇచ్చేంతలో ఓ పెద్ద పావం అలాగే అతన్ని భూమిలోకి పంపివేసింది.

ఇద్దరూ అలా భయంకరంగా వున్న ఆ రాక్షసుణ్ణి చూస్తూ, క్షణంసేపు అలాగే నిలిచిపోయారు.

రాక్షసుడు తన పాదంక్రింద నలిగివున్న శవాన్ని నోటికి తీసుకుని, మిగిలిన ఇద్దరినీ పట్టుకోడానికి చేతులు చాచాడు. మనోహర్, జగ్గడు వెనక్కి తిరిగి పరిగెత్తనారంభించారు. కానీ, రాక్షసుడు తన పొడవాటి చేతులతో వారిని పట్టుకున్నాడు. జగ్గడు తన నడుం వద్దవున్న పిడిబాకుతో అరటి బోదలావున్న రాక్షసుడి చేతులు నరికివేశాడు. ఆ బాధకు రాక్షసుడు తట్టుకోలేక ఇద్దరినీ క్రింద పారవేసి, తన చేతులనుండి రక్తంకారుతూండడం చూడసాగాడు. వెంటనే ఇద్దరూ ప్రక్కనున్న పొదలో దూరి దాగారు.

(ఇంకావుంది)




## 10

జరిగిన కథ: మాణిక్యవర్మ, గండభేరుండ దీవిలో పీష్వాని కలసి, అతని కథంతా తెలుసుకున్నాడు. జగ్గడు, మనోహర్ అడవిలో ఓ మహర్షి ద్వారా గండభేరుండదీపికి దారి తెలుసుకున్నారు. ఇద్దరూ ఆ దీవికి పోవడానికి పెద్ద కొండ ఎక్కుతుండగా వారిని పులి, ఎలుగుబంటి ఎదుర్కొన్నాయి. వాటితో పోరాడి, తన్ని తరిమారు. తరువాత అక్కడ ఒంటికన్ను రాక్షసుడున్నట్టు ఒక సన్యాసిద్వారా తెలుసుకున్నారు. అంతలో రాక్షసుడు జగ్గణ్ని చేతులోకి తీసుకున్నాడు జగ్గడ్డు రాక్షసుని చేతిని నరికాడు; ఇద్దరూ పాదలో దాగారు.

రచన: బి.ఆర్. వరదరాజులు



కొంతసేపటికి రాక్షసుడు బాధకు తట్టుకోలేక పెద్దగా కేకలు వేసుకుంటూ వెనక్కి పరిగెత్తాడు. తరువాత పాదనుండి ఇద్దరూ బయటికి వచ్చారు. రాక్షసుడు ఇక ఈవైపుకి రాడని మనసులో దృఢంచేసుకుని ముందికి వేగంగా నడవసాగారు.

రాత్రిసమయానికి ఇద్దరూ కొండ అంచుకు చేరుకున్నారు. అక్కడ పెద్ద గాజు పెట్టె, దాని చుట్టూ పెద్దమంట కనిపించింది. ఆ మంట వేడికి దూరంగా వున్నవారు కూడా తట్టుకోలేక పోయారు. ఇక దానివద్దకు ఎలా పోవడమా - అని ఆలోచించసాగారు.

రెండు రోజులవరకు ఇద్దరూ ఆ మంటను దాటి లోనికి వెళ్ళటానికి చాలా ప్రయత్నాలు చేశారు. కాని, ప్రయోజనం లేకపోయింది. ఆ మంట వేడికి తట్టుకోలేక వెనక్కి వెళ్ళి నిల్చుని చూడసాగారు.

మూడోరోజు వున్నట్టుండి ఆకాశమంతా నల్లగా మారి, మేఘాలతో దట్టంగా మూసుకుని జోరున వర్షం కురియసాగింది. అది చూచి ఇద్దరూ సంతోషించారు. భగవంతుడే తమకు సహాయం చేస్తున్నాడనుకున్నారు. వాననీటికి అంత పెద్దమంట కూడా ఆరిపోయింది. సమయాన్ని వృధాచేయలేదు. గబుక్కున పెట్టె వద్దకి దూకేశారు. వారు లోపలికి పోవడంతో వున్నట్టుండి వర్షం నిలిచిపోయింది. వర్షం నిలిచిన మరుక్షణమే తిరిగి మంట పెద్దగా మండసాగింది. మంట, గాజుపెట్టెకి కొంత దూరంలో వుండటంవల్ల ఇద్దరూ వేడికి కొంత తట్టుకున్నారు.

తరువాత మనోహర్ గాజుపెట్టెపై చేయి వేశాడు. మరుక్షణం వారిముందు పెద్ద ఆంబోతు రంకెవేస్తూ వచ్చి నిలిచింది. దాన్ని చూసి ఇద్దరూ భయపడలేదు. దానితో పోట్లాడ్డానికి తయారుగా వున్నారు. జగ్గడు కత్తి చేత్తోపట్టుకుని ఆడించసాగాడు. అది వారిపై ఎగిరిదూకింది; ఇద్దరూ పక్కకితప్పుకున్నారు. దాంతో అది క్రింపడి, కోపంతో వారివైపు తిరిగింది. అంతలో జగ్గడు వేగంగా వెళ్ళి కత్తితో ఆంబోతుని బలంగా పొడిచాడు. అప్పుడు దాని శరీరంలో నుండి రక్తం చిమ్మి ఎగిరి ప్రక్కనున్న గాజుపెట్టెపై పడి, అది తెరుచుకుంది. అది ఇద్దరూ గమనించారు.

దెబ్బతిన్న అంబోతు కోపంతో తన వాడియైన కొమ్ములతో వేగంగా పచ్చి మనోహర్‌ను ఢీకొన్నది. అతడు తప్పించుకోవడంతో, తొడపై చిన్న దెబ్బ తగిలింది ఈసారి మనోహర్, జగ్గడు మెల్లగా మాట్లాడుకుని, అంబోతుకేసి చూడసాగారు. ఈసారి అంబోతు చాలా వేగంగా వచ్చింది. ఇద్దరూ వేగంగా వెనక్కి అడుగులు వేసి, చటుక్కున ప్రక్కకి తప్పు కున్నారు. అది గమనించని అంబోతు వేగంగా వచ్చి అలాగే మంటల్లోపడి ఎర్రగా కాలి పోయింది. అది చూసి ఇద్దరూ తృప్తిగా గాలిపీల్చుకున్నారు.

తరువాత పెట్టెవద్దకు వెళ్ళి ఇద్దరూ తలొక ఈకను తలపై పెట్టుకుని ఇద్దరూ "మమల్ని గండభేరుండదీవికి తీసుకు పో!" అన్నారు.

మరుక్షణం ఇద్దరూ గాల్లోకి వేగంగా పైకి లేచారు; ఇద్దరూ గడభేరుండదీవిలో నిలిచారు. తలమీద ఈకలని క్రిందపారేసి దీవిలో నడవ సారంభించారు.

అప్పుడు వారి కెదురుగా ఓ పొడుగాటి వ్యక్తి వచ్చాడు. అతన్ని చూడడంతో ఇద్దరూ ఆగారు. అంతలో ఆ వ్యక్తి "ఎవరు మీరు? ఎందు కీ దీవిలోకి వచ్చారు?" అనడిగాడు. అందుకు మనోహర్, "నా శత్రువు ఒకడు ఈ దీవిలో దాగివున్నట్లు తెలిసింది; అతని కొరకు వచ్చాను!" అన్నాడు.

"ఓ అలాగా! మీలాగే ఓ వ్యక్తి ఇక్కడికి వచ్చి, మాశత్రువు వద్ద తలదాచుకుని వున్నాడు. మీరు మా గురువుగారి వద్దకు

రండి! మీకు తగిన సహాయం చేస్తారు!" అని అంటూ ముందుకి నడిచాడు; ఇద్దరూ అతన్ని అనుసరించారు.

మనోహర్, జగ్గడు జీవకునితో కలసి ప్రచండుని గుహలోకి అడుగు పెట్టారు. ప్రచండుని చూడగానే మనోహర్‌కు మంచి అభిప్రాయం కలిగింది. అందువల్ల తాను ఎందుకు ఆ దీవిలో అడుగు పెట్టిందీ వివరించి చెప్పాడు.

అదివిన్న ప్రచండుడు నవ్వుతూ, "మనోహరా! నీకు వర్మవద్దనుండి వజ్రం ఇప్పిస్తాను. కానీ నీవు నాకు కావలసిన మంత్రాల భరితవున్న పాముల లోయకు దారి తెలుసుకు రావాలి!" అని అన్నాడు.



ప్రచండుని చేతనైన సహాయం నీకు చేస్తాను!" అన్నాడు మనోహర్.

* * *

పీష్వా తన కీలుగుర్రం నుండి దిగుతూ ఎదురుగా వచ్చిన మాణిక్యవర్మతో, "వర్మా! ఈ రోజు ఎవరో ఇద్దరు వ్యక్తులు ఈ దీవి లోకి అడుగు పెట్టారు సరిగ్గా ఆ సమయానికి జీవకుడు రావడంతో నేను వారిని కలువలేక పోయాను. వారిని ప్రచండుని వద్దకు తీసుకు పోయాడు. ఎవరు వారు? ఎందుకు వచ్చారన్నది నాకు అనుమానంగా వుంది!" అని అన్నాడు.

"అఁ! ఎవరో దారితప్పి ఇలా వచ్చి వుంటారు. వారిని గురించి నీ వెందుకు అనవసరంగా కంగారుపడతావు?" అన్నాడు- వర్మ.

"అలాఅని మనం వదలకూడదు. ప్రతి విషయాన్నీ జాగ్రత్తగా గమనించాలి. ఎందుకైనా నీవు మెలుకువగా వుండు; నేను గుహలో లేనప్పుడు జాగ్రత్తగా వుండు!" అని హెచ్చరించాడు.

"అలాగే, గురూ! ఇప్పుడు నేను అలా బయటికి వెళ్ళి వస్తాను. మీ కీలుగుర్రం కొంచెం నాకు ఇస్తారా?" అడిగాడు వర్మ.

"తీసుకెళ్ళు!" అని పీష్వా లోని కెళ్ళాడు. వర్మ కీలుగుర్రం ఎక్కి మీటలు తిప్పాడు. కీలుగుర్రం ఆకాశంలో పోసాగింది. అలా పోతున్న వర్మ మనసులో, "అరే! పీష్వా చెప్పినప్పటి నుండి నా మనసు ఎదో వేదన పడుతోంది. ఓ వేళ ఆ వచ్చిన వ్యక్తులు నా శతృవు మనోహర్, వాని అనుయాయి కారు కదా! ఎందుకైనా మంచిది ఓసారి ప్రచండుని



సహాయాన్ని వెళ్ళి చూడాలి; లేకపోతే నాకు నిద్రపట్టదు!" అనుకుంటూ గుర్రాన్ని ప్రచండుడు గుహ మీద ఆకాశంలో నిలిపి క్రిందికి దూకసాగాడు.

కొంతసేపటికి గుహలోనుండి మనోహర్, జగ్గడు బయటికి వచ్చారు. వర్మ అతనికి ముందు మనోహర్‌ను చూసి వుండలేదు. అందువల్ల అతన్ని గుర్తుపట్టలేదు. తన కీలు గుర్రాన్ని క్రిందికి దింపి, పొదలోదాచి, ప్రక్కకు దాగివున్నాడు.

సరిగ్గా మనోహర్, జగ్గడు ఆ పొదవద్ద ఆగారు. "జగ్గా! ఈరోజు ప్రచండుడు ఈ దీవి గురించి వివరంగా చెబుతానన్నాడు. మనం పాయంత్రం పీప్సా గుహవద్దకు వెళ్ళి వర్మని గురించి తెలుచుకోవాలి!" అన్నాడు.

ఆ మాటలు విన్న వర్మకు మనోహర్ అతనే నని తేలిపోయింది. అతన్ని ప్రాణాలతో పదిలితే, తనకు ముప్పు వస్తుందనుకుని, పొదలో చుట్టువెదికి పెద్దదుడ్డుకర్రను సంపాదించాడు. తనవైపు ఇద్దరూ వీపులు పెట్టి మాట్లాడుతుంటే, వారి ఇద్దరినీ సులభంగా తలపై కొట్టవచ్చు ననుకుని కర్రను బాగా పైకిఎత్తి కొట్టడానికి తయారుగా వున్నాడు-వర్మ.

సరిగ్గా ఆ సమయానికి ప్రచండుడు గుహ నుండి బయటికి వచ్చి, "మనోహర్, జగ్గా! రాండి పోదాం!" అన్నాడు.

అంతే ఇద్దరూ అక్కడినుండి ముందుకు నడవసాగారు. తన పథకం కొంచెంలో తప్పి పోవడంతో వర్మకు విచారం కలిగింది. కోపంతో దుడ్డుకర్రను విసురుగా అవతల

పారేసి కీలుగుర్రంఎక్కి మిటలు తిప్పాడు. మరుక్షణం అది ఆకాశంలోకి ఎగిరింది.

ఉన్నట్టుండి ఏదోశబ్దం రావడంతో ముగ్గురూ తలలెత్తి పైనపోతున్న కీలుగుర్రాన్ని చూశారు ప్రచండుడు "మనోహర్! నీవు వెదకుతున వర్మ అతనే!" అనరిచాడు.

అప్పుడు కీలుగుర్రం అతి సమీపంలో పోతూండడం వల్ల చూడడం సంభవించింది. అంతేకాదు, అతణ్ని జగ్గడు, మనోహర్ పరిశీలనగా చూసి- బాగా గుర్తుపట్టుకున్నారు.

దారిలో ప్రచండుడు, "మనోహర్! నీకు ఈదీవి గురించి వివరంగా చెబుతాను విను: ఈ దీవిలో వింత పక్షులు వున్నాయి. అవి చూడడానికి గబ్బిలాల్లా వుంటాయి; ఆకారం చాలాపెద్దది. వాటిని మేము గండభేరుండ పక్షులని పిలుస్తాము. ఒకప్పుడు ఈ దీవిలో ఎక్కువగా ఆ పక్షులు వుండేవి. అందువల్ల ఈ దీవికి ఆ పేరువచ్చింది. కాని, ఇప్పటికి ఆ పక్షులున్నాయి. ఒకొక్కప్పుడు గుంపులు గుంపులుగా వస్తుంటాయి. మనుషులను చూస్తే అలాగె తీసుకుపోతూ వుంటాయి, తిరిగివదలివేస్తుంటాయి. కానీ వారికి ఏమాత్రం హాని కలిగించవు. చూడడానికి భయంకరంగా వుంటాన్నా మనుషులను తినవు; కాని, పాములను బాగా తింటాయి!" అన్నాడు.

అంతలో ఏదో వింత చప్పుడు అతి భయంకరంగా వినబడింది. అదివిన్న ప్రచండుడు, "చూశారా మీకు చెప్పిన గండభేరుండ పక్షులు వస్తున్నాయి, చూడండి ఆటువైపు!" అని చూపించాడు.

వారికి ఎదురు దిశలో భయంకరమైన ఆకారంతో వున్న, పక్షులు వస్తున్నాయి. అవి చూడడానికి గబ్బిలంలా వున్నా ముక్కు చాలా పెద్దదిగా వుంది రెక్కలు అతి భయంకరంగా వున్నాయి తోక చాలా సన్నగా, పొడవు గావుంది.

ఆ పక్షులు తమని పట్టుకుంటాయేమోనని ముగ్గురూ వడి వడిగా చెట్టుక్రిందకు దూరారు. అంతలోనే వారివద్దకు పక్షులు వచ్చేశాయి. కానీ జగ్గడు వేగంగా పరిగెత్తడంతో ఒక రాయి తగిలి బోర్లాపడ్డాడు. అంతలో అతని మీదికి వచ్చిన ఓ పక్షి ముక్కుతో జగ్గణ్ని పట్టుకుని ఆకాశంలోనికి ఎగిరిపోయింది.

అది గమనించిన మనోహర్, "ప్రచండా! ఏమి టిది? జగ్గని ఎలా రక్షించడం?" అని అడిగాడు.

"మనోహర్! భయపడకు, అది జగ్గణ్ని ఏమీచేయదు. ఎక్కడైనా దూరంగా తీసుకెళ్ళి వదలిపెడుతుంది. అంతే! ఎలాగో రెండురోజులలో జగ్గడు మనల్ని చేరుకోగలడు అంవరకు నీవు నా గుహలో విశ్రాంతి తీసుకో!" అంటూ కదిలాడు ప్రచండుడు.

మనోహర్ ప్రియస్నేహితుని తలచుకుంటూ, విచారంగా అతనివెంట గుహలోకి నడిచాడు.

జగ్గని ఆకాశంలోనికి తీసుకుపోతున్న గంతభేరుండపక్షి అతణ్ని ఓ చిన్న దీవిలో వదలి వెగంగా వెళ్ళిపోయింది. అంతా క్షణంలో జరిగిపోయింది. దీవిలోకి దిగిన జగ్గడు తాను ఎక్కడున్నాడో - అని ఆలోచిస్తూ ముందుకు నడవసాగాడు.

అంతలో ఓ స్త్రీ కెవ్వుమన్న కేకవిని ఆగిపోయాడు. జగ్గడు కొంతసేపటికి ఆ కేక వచ్చిన దిక్కువైపుకి వేగంగా అడుగులు వేశాడు. అతనికి కొద్దిదూరంలో నల్లటి భయంకరాకారుడు ఒక అందమైన స్త్రీని బలాత్కరించడం చూశాడు. ఆ దృశ్యాన్ని చూచిన జగ్గని రక్తం కుతకుత వుడికిపోయింది. బొడ్డులోవున్న బాకును చేతిలోకి తీసుకుని, ఒక్క ఎగురు ఎగిరి ఆ నల్లటివ్యక్తిని బాకుతో పొడిచాడు. ఆ దెబ్బకు ఆ స్త్రీ రాక్షసుని పట్టు తప్పి క్రిందపడింది. నల్లటివ్యక్తి ఎగిరి కొంత దూరంలో పడ్డాడు.

క్రిందపడ్డ నల్లటివ్యక్తి, "ఒరేయ్! ఎవరు నీవు? ఈదీవికి క్రొత్తవాడిలా వున్నావు. నన్ను గురించి నీకు తెలియదు. నేను ఈ దీవిలో రాక్షసుడి లాంటి వాణ్ని. పదిమంది వచ్చినా, నన్ను కొట్టలేరు; ఈరోజు నీవు కొట్టావు; ఇక నిన్ను ప్రాణాలతో వదలను!" అంటూ ముందుకు అడుగువేశాడు.

జగ్గడు ఏమాత్రం బెదరలేదు చేత్తో కత్తిని పట్టుకుని ధైర్యంగా ముందుకు దుమికి, ఓ తాపుతన్నాడు. ఆ దెబ్బలకు నల్లటివ్యక్తి క్రిందపడ్డాడు.

(ఇంకావుంది)



# గండభేరుండదీవి

## 11

జరిగిన కథ: మనోహర్, జగ్గడు ఒంటి కన్ను రాక్షసుడి చేతులు నరికి, ముందుకు పోయారు. అక్కడ ఈకలున్న గాజుపెట్టె దగ్గరికి కెళ్ళి, రాక్షసి ఆంబోతుమ చంపి, ఈకలసహాయంతో గండభేరుండదీవిని చేరుకుని, ప్రచండుని కలిశారు. ఈ సంగతి మాణిక్యవర్మ తెలుసుకున్నాడు. దీవిలో తిరుగుతున్న వారిలో జగ్గని గండభేరుండపక్షి తీసుకుని ఓ దీవిలో వదిలేసింది. అక్కడ ఓ స్త్రీని బలత్కరిస్తున్న నల్లటి వ్యక్తిని చూసి, జగ్గడు అతనితో తలపడ్డాడు.

రచన: బి.ఆర్. వరదరాజులు



వెంటనె జగ్గడు అతని మెదకి లంఘించి కూర్చున్నాడు. కానీ ఆ వ్యక్తి ఓ దొర్లుదొల్లి జగ్గణ్ని క్రిందికి తోసి, పైకిలేచి నిలబడి జగ్గణ్ని కాలుతో ఓ తన్ను తన్నాడు. ఆదెబ్బ కతను తిరిగిపోయి కొంతదూరంలో పడ్డాడు. ఆ వక్తి బలాన్ని చూసి జగ్గడు ఆశ్చర్య పోయాడు. అయినా, ధైర్యాన్ని చిక్కబట్టు కుని ముందుకు దూకాడు ఈసారి ఆ వ్యక్తి చేతులో చిన్నబాకు తీసుకుని జగ్గనికేసి చూస్తున్నాడు ఇద్దరూ బాగా, బలంగా కత్తి పోరాటం సాగించారు. ఇద్దరికీ బాగా గాయాలు తగిలి రక్తం స్రవించనారంభించింది. జగ్గనికి మాత్రం ఎక్కువ దెబ్బలు తగిలాయి. అయినా అతను పట్టువిడకుండా ఒక్కసారి గాల్లోకి ఎగిరి, ఆ నల్లటివ్యక్తిని క్రింద పడ్రోసి, ఎగిరి అతనిపైన కూర్చుని, కత్తితో బలంగా అతని గుండెలో పొడిచాడు అంతే! ఆ దెబ్బకు ఆ వ్యక్తి తాళలేక పెద్దగా ఆక్రందనచేస్తూ ప్రాణాలు విడిచాడు.

అంతలో ఆ స్త్రీకి సంబంధించిన నలుగురు మనుష్యులు అటువైపు వచ్చి, ఆమెద్వారా విషయం తెలుసుకుని, కృజ్ఞతలు తెలుపుకోడానికి జగ్గనివైపు వచ్చారు. అప్పటికే ఎక్కువగా గాయాల వల్ల రక్తం పోవడంతో బలహీనపడి జగ్గడు క్రిందపడిపోయాడు.

జగ్గడు కళ్ళు తెరచి చూసేటప్పటికి అతని చుట్టూ అడవి మనుష్యులున్నారు. మెల్లగా పైకిలేచి, తనకున్న గాయాలకు మందులు వేసి కట్లుకట్టి వుండటం చూశాడు. అంతలో ఓవ్యక్తి జగ్గనికి ఎదురుగా నిలబడి "అయ్యా! తమ రెవరోగాని తగిన సమయానికి వచ్చి, నా భార్య శీలాన్ని రక్షించారు; అదేగాక మా దీవిలో రాక్షసుడిలా వుండి, మమ్మల్ని బాధపెడుతున్న ఓ దుర్మార్గుణ్ణి చంపి, మా కెంతో మేలు చేకూర్చారు. కానీ మీకు దెబ్బలు బాగా తగిలాయి; ఆదే మాకు విచారంగా వుంది!" అన్నాడు.

అందుకు జగ్గడు హీనస్వరంతో, "ఏదో నా చేతనైన సహాయం చేశాను. ఇందులో నా గొప్పేమీ లేదు. నేను గంధర్వయంత్రదీవి నుండి ఓ పక్షివల్ల ఇక్కడికి వచ్చాను. తిరిగి ఆ దీవికి వెళ్ళడానికి మీరు దారి చూపారంటే సంతోషిస్తాను!" అన్నాడు.

"గండభేరుండదీవా? అమ్మో! చాలాదూరం నుండి వచ్చారు. అయినా, తిరిగి ఆ దీవి చేరు కోవాలంటే చాలాకష్టం. మీరు ఎలా ఇక్క డికి వచ్చారో అలానే తిరిగి పోవాలి!" అన్నా డా వ్యక్తి

"అంటే?" అర్థం కానట్లు చూశాడు జగ్గడు - అతనివైపు.

"మా దీవికి నెల కొకసారి గండభేరుండ పక్షి వస్తుంది. అప్పుడు మీ రెలాగయిన దాని కాలిని పట్టుకున్నారంటే, అది గండ భేరుండ దీవికి తీసుకుపోతుంది; దానిసహా యంతో వెళ్ళిపోవచ్చు. అలా అయితేనే క్షణంలో మీరు వెళ్ళవచ్చు; కాలినడకైనా సముద్రప్రయాణమైనా చేస్తే, చాలా రోజులకి గాని ఆ దీవిని చేరుకోలేరు; దారిలో అనేక బాధలు పడాలి. మీరు ఇక్కడ బాగా విశ్రాంతి తీసుకోండి; గాయాలన్నీ బాగా తగ్గాక వెళ్ళవచ్చు. అంతవరకు మీరేమీ బాధ పడకండి!" అన్నాడు.

అందుకు జగ్గడు సమ్మతించాడు.

* * *

మనోహర్ గుహనుండి బయటికి వస్తూ, "ప్రచండా! జగ్గడు వెళ్ళి రెండు రోజులైంది; ఇంతవరకు రాలేదు; ఈ రోజైనా మనమిద్దరం కాలినడకన ఈ దీవంతా వెదకుదామా?" అన్నాడు.

"మనోహర్! నువ్వు అనవసరంగా కంగారు పడుతున్నావు; ఇంకా రెండు రోజులు ఆగు; జగ్గడు ఎలాగైనా వచ్చేస్తాడు. అయినా, నీ తృప్తికొసం ఈరోజు నివెంట వస్తాను, పద!" అంటూ నడవసాగాడు - ప్రచండుడు.

అంతలో జీవకుడు బయటికి వచ్చి, "గురూ! కాలినడకన ఎందుకు వెళతారు; మీ చేపమీద పోవచ్చుకదా!" అన్నాడు.

"వద్దు జీవకా! గాలిలో ఎగురుతూ, క్రింద చూడటం కష్టం. కాలినడకన వెళ్ళామంటే, పరిశీలనగా చూడవచ్చు!" అన్నాడు మనోహర్.

"త్వరగా తిరిగిరండి" అన్నాడు జీవకుడు.

"అలాగే జీవకా! మేం సాయంత్రానికి గాకి తిరిగి రాము!" అంతవరకు నీవు జాగ్రత్తగా వుండు! ఆ పిస్సాగాడి చూపు ఇక్కడే వుంటుంది - జాగ్రత్త!" అని హెచ్చరించాడు ప్రచండుడు.

"అలాగే గురుదేవా!" అంటూ లోపలికి వెళ్ళాడు జీవకుడు.

ఇద్దరూ ముందుకు నడిచారు. దారిలో మనోహర్, "ఈ దీవిలో ఏమైనా అపాయకరమైన జంతువు లున్నాయా?" అని ప్రశ్నించాడు - ప్రచండుని.

"లేవు, మనోహరా! అలాంటి ఏమీలేవు. ఇంతవరకు నాకంటికి ఒకటీ కనబడలేదు. నేను ఎక్కువగా బయటికి రాను. నాకన్నా ఆ పీష్వాగాడికి ఈ దీవిగురించి బాగా తెలుసు!" అన్నాడు ప్రచండుడు.

ఇద్దరూ సాయంత్రం వరకు ఆ దీవిఅంతా వెదికి, చాలాభాగం ముందుకు వెళ్ళారు. మనోహర్ ఇంకా ముందుకు పోవాలని వుంది; కానీ ప్రచండునికి ఇష్టంలేదు. అప్పటికే బాగా చీకటి పడింది.

"మనోహర్! ఇక మనం తిరిగిపోదామా? ఇది మంచిస్థలంకాదు ఇక్కడ దొం....." అని మాట పూర్తిచేసేంతలో, ఇద్దరి తలలపై బలమైన దెబ్బలు పడ్డాయి. అంతే! ఇద్దరూ ఆ దెబ్బలకు తాళలేక కళ్ళు తిరిగి అలాగే క్రిందపడిపోయారు.

అప్పుడు పాచవెనుక నుండి ఇద్దరు వ్యక్తులు వచ్చి వారి ఎదుట నిలిచారు.

* * *

జగ్గడు గుడిసెనుండి బయటికి వచ్చి, "అయ్యా! నా గాయాలు పూర్తిగా నయమైనాయి; నా మిత్రుడు నాకోసం ఎదురు చూస్తుంటాడు. ఆ పక్షి ఎప్పుడు వస్తుంది?" "ఇంక మూడురోజుల్లో పక్షివస్తుంది!" అన్నాడా వ్యక్తి.

అంతలో ఓ అడవి మనిషి పరిగెత్తు కొచ్చి, నాయకా! మన గూడెంలోని మనిషి అడవిలో చచ్చిపడి వున్నాడు!" అన్నాడు.

అది విని అందరూఅక్కడకి పరిగెత్తుకు పోయారు. ఓచోట వ్యక్తి ఒకడు అతి భీకరంగా చంపబడి వున్నాడు. అదిచూసి నాయకుడు "సందేహంలేదు; ఇది ఆ రెక్కల మొసలి పనే అయివుంటుంది!" అన్నాడు.

మిగిలిన వారంతా "అవును నాయకా! రోజు రోజుకూ దాని ఆగడం ఎక్కువుతూంది; దాన్ని ఎదిరించేవారు లేరని మనగూడెంలోని వారినందరినీ ఇలా చంపుతూంది!" అన్నారు.

"మనభర్మ! ఇకపైనా అనుమతి లేనిదే ఎవరూ ఈ అడవిలోకి పోకూడదు. ఇది మన వారికందరికీ చెప్పండి" అంటూ విచారంగా నాయకుడు ముందుకు వెళ్ళసాగాడు; అందరూ అతన్ని అనుసరించారు.

జగ్గనికి వారిమాట లేమీ అర్థంకాలేదు. నాయకుని వద్దకు వెళ్ళి, "నాయకా! ఏదో రెక్కల మొసలి మీ మనిషిని చంపిందని తెలిసి, మీరు ఏమీ చేయలేకున్నారా!" అని ప్రశ్నించాడు.

"అవును. అది సాధారణ మొసలికాదు; చాల బలమైనది; దానికి రెండు పెద్దరెక్కలున్నాయి; అవి ఎగురుతూపోయి, ఎందరినైనా చంపగలదు. అందువల్ల దాన్ని ఎదిరించకుండా వదిలేశాం. ఎవరైనా దారి తప్పి అటువెళ్ళితే, వారి ప్రాణాలు హరీ అంటాయి. అది వింతమొసలి. జంతువులను మాత్రమే తింటుంది; మనుషులను చంపి వదిలేస్తుంది. మాభర్మ ఇంతే అని, దాన్ని గురించి మేం

పట్టించుకోవడంలేదు!" అన్నాడు.

"అలా దాని ఇష్టానికి మనం వదిలేస్తే, అది ఇంకా విజృంభిస్తుంది. ఏ ఒక్కడి వల్ల దాన్ని ఎదిరించే శక్తి లేకపోవచ్చు; పది మంది చేరి వెళితే, సులభంగా చంపవచ్చునేమో! నావెంట పదిమందిని పంపండి; ఆ మొసలిని, అంతంచేసి తిరిగి వస్తాను!" అన్నాడు జగ్గడు.

"అలాగే, రేపు బయల్దేరి వెళ్ళండి!" అని అన్నాడు నాయకుడు.

మరునాడు జగ్గడు పదిమందితో అడవికి బయలుదేరాడు. వారి కంటికి మొసలి జాడ ఎక్కడా కనబడలేదు. అది గుంపుగా వస్తున్న వారిని చూసి పారిపోతుందేమో! అనుకున్నారు. సాయంత్రంవరకు అడవిని పూర్తిగా గాలించారు. కానీ వారి కంటికి కనబడలేదు. రెక్కల మొసలి. హతాశులై అందరూ గూడానికి తిరిగి వచ్చేశారు.

ఆ రాత్రి జగ్గడు, "నాయకా! ఈరోజు మొసలి రాలేదు, కారణమేమిటి?" అని ప్రశ్నించాడు.

"అదే నాకూ అర్థంకాలేదు!" అన్నాడు. నాయకుడు - విషాదవదనంతో.

'మనం గుంపుగా పోయాము గదా! అది చూసి మొసలి బయటికి రానట్టుంది; రేపు దయం నేనొక్కణ్ణే అడవికి వెళ్ళి చూస్తాను; మిగతావారు మధ్యాహ్నం అయినతరువాత బయలుదేరి రండి! అప్పుడు మొసలి కోసం వేచిచూద్దాం!" అన్నాడు జగ్గడు.

"ఇది చాలా అపాయకరమైన విషయం; మీయ ఒంటరిగా వెళ్ళితే తప్పకుండా మొసలి వచ్చి, హానికలిగించగలదు; మళ్లీ అందరమూ వెళ్ళి చూద్దాం!" అన్నాడు నాయకుడు.

'కాదు, నేను ఒక్కణ్ణే వెళతాను జాగ్రత్తగా వుంటాను. నాకు సెలవిప్పించండి! ఎలాగో సాయంత్రంలోగా మీరు వచ్చేస్తారుకదా!" అన్నాడు జగడు.

నాయకుడు అతి కష్టంమీద ఆతని ఇష్టాన్ని సమ్మతించాడు.

మరునాడు జగ్గడు విషం పూయబడిన పదునైన ఈటె తీసుకుని ఒంటరిగా అడవికి ప్రయాణమయ్యాడు.

జగ్గడు అడవిలోపలికి వెళ్ళాడు అక్కడ

అతిజాగ్రత్తతో గుట్టలు, పొదలు పరిశీలిస్తూ, మెల్లగా నడవసాగాడు.

ఉన్నట్టుండి పెద్దశబ్దం వినబడింది. ఆ ఆదుర్దాకు అతని చేతిలోని ఈటె ఎగిరి కొంత దూరంలో పడింది. దాన్ని అందుకోవాలని ఓ అడుగు ముందుకు వేశాడు.

అంతే! గాలిలో ఎగురుతూ, పెద్దరెక్కలతో అతిభయంకరంగా వున్న మొసలి అతనికి ఎదురుగా వచ్చి, నిలబడింది అనుకోకుండా ఆ మొసలి రావడం, చేతిలోని ఆయుధం క్రిందపడిపోవడం చూసి, దాని వంకచూస్తూ అలాగే నిలబడి పోయాడు-జగ్గడు.

* * *

మనోహర్, ప్రచండుడు మెల్లగా కనులు తెరిచారు. వారిద్దరికీ శరీరభారంగా వున్నట్టనిపించింది. మెల్లగా పైకి లేవడానికి యత్నించారు; కాని లేవలేకపోయారు. వారి చేతులకు, కాళ్ళకు బలమైన సంకెళ్ళు వేయబడి వున్నాయి. వారు రాతి గృహంలో బంధించబడి వున్నట్టు తెలుసుకున్నారు. వారి కెదురుగా కమ్మలున్న తలుపు వుంది. ఆ తలుపుపై కత్తులతో ఇద్దరు మనుషులు గస్తీ తిరుగుతున్నారు.

మనోహర్‌కు ఏమీ అర్థంకాలేదు. అంతలో ప్రచండుడు "మనోహర్! వీళ్ళద్దరూ అడవి దొంగలు. ఈ దీవిలో చివరి భాగాన వుంటారని విన్నాను. అందుకే నేను ఇటువైపు రాను. వీరి సంగతి నీకు చెప్పబోతుండగా వీరు మనల్ని కొట్టారు. అయినా మనపట్ల ఎముంపని వీరు దోచుకోవానికి?" అన్నాడు.

"ఏమీలేదు కదా! అయినా మనల్ని ఈ సంకెళ్ళతో ఎందుకు బంధించాడు?" అనడిగాడు - మనోహర్.

"అదే నాకూ అర్థం కావటంలేదు. చూద్దాం వాళ్ళు మనల్ని ఏం చేయబోతారో!" అని సమాధానం చెప్పాడు ప్రచండుడు.

అంతలో తలుపులు తెరుచుకుని ఓ వ్యక్తి వచ్చాడు. అతడు ఓ కంటికి ఆడ్డంగా గుడ్డ కట్టుకుని వున్నాడు. "చాలా సేపునుండి నిద్రపోతున్నారే?" అని హేళనగా నవ్వుతూ

(ఇంకావుంది)





# గండభేరుండదీవి

## 12

జరిగిన కథ: గండభేరుండదీవిలో తిరుగుతున్న జగ్గని పెద్ద పక్షి తీసుకుని, ఓ దీవిలో వదిలేసింది. అక్కడ ఓ స్త్రీని, సల్లటి వ్యక్తి నుండి రక్షించి, ఆ దీవిలో అందరికీ అభిమాన పాత్రుడయ్యాడు. ప్రచండుని, మనోహర్‌ను దొంగలు బంధించి, చెఱలో పెట్టారు. జగ్గడున్న దీవిలో రెక్కల మొసలి మనుషులను చంపుతుందని తెలుసుకుని, దాన్ని చంపడానికి బయలుదేరాడు. దానిలో అతని కెదురుగా వున్నట్టుండి రెక్కలమొసలి నిలవగానే అతని చేతిలోని ఆయుధం క్రింద పడిపోయింది.

రచన: శ్రీ ఆర్. వరదరాజులు

మనోహర్ కోపంతో, "పిచికిపందలా దొంగ దెబ్బకొట్టి, ఏమిటా పిచ్చివాగుడు? ఎందుకు మమ్మల్ని బంధించావు? మేము నీకు చేసిన అపకారమేంటి?" అని అన్నాడు.

"అదే! అప్పుడే అసలు విషయానికి వస్తున్నావా? సరే, ప్రచండా! నీవద్ద ఎగిరే చేప వుందే, అది నాకు కావాలి; దాన్నిచ్చి వంటే. మిమ్మల్ని వదలివేస్తాను!" అన్నాడా దొంగ.

"నా దగ్గి రలాంటిది వున్నదని నీకు ఎవరు చెప్పారు?" అని ఎదురు ప్రశ్న వేశాడు-ప్రచండుడు.

"పిష్యా నా ప్రియమిత్రుడు. అతడి ద్వారా నీ గురించి తెలుసుకున్నాను. నాకు ఆ చేపను ఇస్తావా; లేక మిమ్మల్నిద్దర్నీ చంపమంటావా?" అన్నాడు దొంగ.

"అవసరపడకు నా గుహలో చేపను వుంచి వచ్చాను. నన్ను ఇక్కడే కట్టేసి, దాన్నివ్వమంటే ఎలా తెచ్చి ఇవ్వగలనో కొంచెం ఆలోచించు; నన్ను బయటికి పంపు!" అన్నాడు ప్రచండుడు.

"అమ్మో నిన్నా? మాయగాడివి; నిన్ను నమ్మకూడదు. కావాలంటే నీ ప్రక్కనున్న వాడిని బయటికి పంపుతాను వాడు ఆ చేపను వారంరోజుల్లో తెచ్చాడంటే, నిన్ను బయటికి పంపుతాను; లేకుంటే నిన్ను పైకి పంపుతాను, జాగ్రత్త!" అన్నాడు.

"అలాగే! నేను వెళ్ళి ఆ చేపను తెస్తాను. కానీ అంతవరకు ప్రచండుని ఖైదీలా సంకెళ్లు వేసి వుంచకూడదు; అతన్ని సాధారణంగా గదిలో బంధించండి!" అన్నాడు మనోహర్.

"అలాగే!" అంటూ ఆ దొంగ మిగతా వారిని పిలిచి, "ఓరేయ్! వీరి సంకెళ్ళను విప్పండి; ఆ కుర్రవాణ్ని మాత్రం బయటికి పంపండి!" అంటూ వేరే గదిలోకి వెళ్లాడు.

దొంగలు ఇద్దరికీ సంకెళ్ళువిప్పి, మనోహర్‌ను మాత్రం గుహబయటికి తీసుకుపోయి వదలివేశారు. మనోహర్, ఆ గుహను బాగా గుర్తుపెట్టుకుని, మెల్లగా ముందుకు నడవసాగాడు.

జగ్గడు ఆ ఎగిరే మొసలిని ఎలా ఎదుర్కోవాలా-అని చూస్తున్నంతలో, మొసలి రెక్కతో జగ్గణ్ని ఒక్క తన్ను తన్నింది. ఆ

చబ్బకు జగ్గడు ఎగిరి అల్లంత దూరాన పడ్డాడు. జగ్గనికి నడుము విరిగినంత పన యింది. అంతలో మొసలి దగ్గిరికొచ్చి తిరిగి రెక్కతో జగ్గణ్ని తన్నింది. ఈసారి ఎగిరి పాదలో పడ్డాడు. జగ్గనికి ఆ మొసలి బలం అంతా రెక్కలలోనే వున్నట్లు తోచింది. వున్నట్టుండి అతని నడుంలోవున్న కత్తిని పైకి తీసి, పావలోనే నక్కి కూర్చున్నాడు.

మొసలి పావలో పడినవాడు. ఎంతసేప టికీ రాకుండటం చూసి, చనిపోయాడేమో నని తలచి రెక్కలను ముడుచుకుని నేలపై ప్రాకుతూ పావలోకి చూసింది. సమయం కొరకు ఎదురుచూస్తున్న జగ్గడు కత్తితో దాని రెండు కళ్లలో గట్టిగా పొడిచాడు. అంతే! ఆ బాధకు తట్టుకోలేక మొసలి ఎగిరి అల్లంత దూరంలో పడింది. అంతలో జగ్గడు పాదలో నుండి బయటికి దూకి, కొంతదూరంలో పడిన ఈటెను చేతికి తీసుకున్నాడు. గ్రుడ్డి దైన మొసలి కోపంతో శత్రువును ఎలాగైనా చంపాలని, రెక లను విప్పుకుని ఆడిస్తూ తిరగసాగింది. ఆ గాలి ధాటికి జగ్గడు తట్టుకో లేక, దూరంగా వుండిపోయాడు. కానీ బాధకు తట్టుకోలేక మొసలి అతి భయంక రంగా అరుస్తూ, రెక్కలను వెటవెంటనే తిప్పుతూ చుట్టూ తిరగసాగింది.

మొసలి అరుపులు గూటెంలోని వారి కందరికీ బాగా వినపడ్డాయి. జగ్గనికి ఏమైనా అపాయం జరిగిందేమోనని భయపడుతూ, అందరూ ఆయుధాలు తీసుకుని వేగంగా

అడవి దగ్గరికి వచ్చిచేరారు.

ఎంతసేపయినా మొసలి జగ్గణ్ని తన దగ్గ రికి రానీయకుండా పరవళ్ళు తొక్కుతున్నది. అది గ్రుడ్డిది కావడంతో, ఎటు ఎగిరి పోవాలో తెలియక అక్కడే భీకరంగా అరుస్తూ, తిరు గుతూ వుంది. జగ్గనికి వున్నట్టుండి మంచి ఆలోచన వచ్చింది. చేతిలోకి విషపూరిత ఈటెను తీసుకుని, గురిచూసి బలంగా మొసలివైపు విసిరాడు.

జగ్గని గురి తప్పలేదు. సూటిగా నోరుతెరి చిన మొసలి నోటిలోకి దూసుకుపోయింది. ఈటెపై విషం పూయటంవల్ల క్షణంలో దాని శరీరమంతా విషపూరితమయి పోయింది. అప్పటికప్పుడే మొసల రక్తం కక్కుతూ ప్రాణాలు విడిచింది.



లందరూ అక్కడికి వచ్చి ఆ దృశ్యాన్ని చూశారు. జగని సాహసానికి మెచ్చుకుని, అందరూ పైకిఎత్తి "సాహసవీరుడు జగ్గనికి జెయ్!" అంటూ ఆరిచారు.

నాయకుడు ముందుకువచ్చి, "జగ్గా! నిజంగా నీలాంటి శక్తివంతుణ్ని, ఉపాయశాలిని నేను ఇంతవరకు చూడలేదు. నీవు ఇక్కడేవుంటే మాకు ఎంతో రక్షణగా వుంటుంది. నా నాయకుని పదవి నీకు ఇస్తాను!" అన్నాడు.

అందుకు జగ్గడు నవ్వుతూ, "నేను గండభేరుండదీవిలో వున్న నా మిత్రుణ్ని కలవాలి. అందుకు తగిన ఏర్పాట్లు చేయండి; ఈ పదవులపై నాకు మమకారం లేదు!" అంటూ ముందుకు నడిచాడు.

మరునాడు జగడు గండభేరుండదీవికి వెళ్ళాలని అందరికీ చెప్పాడు. నాయకుడు అతనివద్దకువచ్చి, 'జగ్గా! నీవు మాకు చేసిన సహాయానికి ఏదైన ప్రతిఫలం ముట్టచెప్పనిదే నాకు నిద్రరాదు. అందువల్ల ఈ కానుక స్వీకరించు!" అంటూ ఎఱుపు పచ్చరంగు లుగల రాళ్ళను అతని చేతిలో పెట్టాడు.

జగ్గనికి ఆ రాళ్ళు చూసి ఆశ్చర్యమనిపించింది. అవి ఎందుకు పనికివస్తాయా అని ఆలోచిస్తూ వాటిని దాచుకున్నాడు. అంతలో నాయకుడు "జగ్గా! వాటి ఉపయోగం చెబుతాను విను: ఆ పచ్చరాయితో ఎంతటి రాతిగోడలోనైనా రంధ్రంచేయవచ్చు. ఎలాగంటే, నీకు గోడలో ఎంతదూరం రంధ్రంకావాలో ముందు ఆ

రాయితో గట్టిగా గీతగీసి, తరువాత చిత్తగట్టిగా తట్టితే, వెంటనే ఆ భాగం కిందపడిపోతుంది. ఇక ఎర్రరాయి వుంది చూశావూ, అది ప్రేల్చేశక్తిగలది. దాన్ని ఏగదిలోనైనా వుంచావంటే, ముందుదాన్నుండి నల్లని దట్టమైన పొగవచ్చి, కొంతసేపయిన తర్వాత పెద్ద చప్పుడుతో ప్రేలి. ఆ చుట్టూవున్న స్థలాన్ని క్షణంలో భస్మీపటలం చేస్తుంది. ఇవి రెండూ నీకు చాలా ఉపయోగపడుతాయి!" అన్నాడు.

"చాలా సంతోషమండీ! ఇక బయలు దేరుదాము!" అంటూ జగ్గడు ముందుకు నడిచాడు. నాయకుడు కూడా అతని వెంబడించాడు. ఇద్దరూ పెద్దమైదానం లాంటి ప్రదేశం చేరుకున్నారు. సరిగ్గా సూర్యుడు నడినెత్తికి చేరుకునేవేళకు పెద్దచెట్టును నేలపైపెట్టి, ఓ వైపు క్రాడు కట్టారు. క్రాడు ఇంకొక కొనను జగ్గణ్ని గట్టిగా పట్టుకోమన్నారు. చెట్టుకు ఇంకొక వైపు మంట పెట్టారు. పెద్దచెట్టుకావడంతో దాని ముందు వైపు బాగా మండసాగింది. తరువాత అందరూ దూరంగా చెట్టువెనుక దాగి చూడసాగారు. జగ్గడు క్రాడు పట్టుకుని చెట్టువెనక దాగాడు.

కొంతసేపటికి పెద్దగా శబ్దంచేస్తూ గండభేరుండపక్షి బయటికి వచ్చింది. క్రిందనేలపై ఎఱ్ఱగామండుతున్న చెట్టునుచూసి ఆకర్షింపబడి, వేగంగా క్రిందికి దిగి, కాలితో చెట్టును పట్టుకుని గాల్లోకి ఎగిరింది; చెట్టుతోబాటు జగ్గడు క్రాడుసహాయంతో గాల్లోకి ఎగిరిపో



క్షణంలో ఆపక్షి గండభేరుండదీవిమీదికి వచ్చేసింది. మండుతున్న చెట్టు సెగకు తట్టుకోలేక ఆ పక్షి దాన్ని అలాగే కిందికి వదిలేసింది. అలాచేయడంతో జగ్గడు మండుతున్న చెట్టు తన మీద ఎక్కడ పడకోతుందోనని భయపడి తాను పట్టుకున్న త్రాడు కొన వదిలేసాడు. అప్పుడు జగ్గడు నేలనుండి కొన్ని వేల అడుగుల ఎత్తులో వున్నాడు. ఇక తన ప్రాణంమీద ఆశవదలి గట్టిగా కళ్ళు మూసుకున్నాడు. వేగంగా భూమి మీద పడసాగాడు.

* * *

వర్మ విచారంతో గుహలోకి రావడం చూసి పిష్పా ఆశ్చర్యపోయి, "వర్మా! ఏమిటి అలా వున్నావు? బయటకు వెళ్లావే అక్కడేమైనా జరిగిందా? సందేహించక నాతోచెప్పు!" అని అన్నాడు

"పిష్పా! నువ్వన్నది బాగుంది. ప్రచండుని గుహలోవున్న కొత్తవాళ్ళు తప్పక నా శత్రువులు; నన్ను వెదుకుంటూ వచ్చిన వాళ్ళు. ఇక నా ప్రాణంగురించి భయపడుతూ ఇక్కడికి వచ్చేశాను!" అన్నాడు.

"పిచ్చివాడా! నేను నీ వద్దవున్నంతవరకు నిన్నెవరూ ఏమీ చేయలేరు; అనవసరంగా కంగారుపడకు! కొత్తవాళ్ళని నేనే చంపిచేసి వస్తాను; ప్రచండుడు ఇక ఎక్కువకాలం బ్రతకడు; నాకు ఈ దీవిలోవున్న అడవిదొంగలతో స్నేహమయింది. ప్రచండుని గురించి వారికి బాగా చెప్పివుంచాను. ఎలాగో రెండు మూడురోజులలో ప్రచండుని బంధించి నా వద్దకి తీసుకొస్తారు; నీ శత్రువులను ఆ దొంగలే చంపేస్తారు; భయపడకు; అంతవరకు నీవు ఒంటరిగా బయటకు మాత్రం వెళ్ళకు! జాగ్రత్త!" అన్నాడు పిష్పా.

అంతలో ఓ అడవిదొంగ లోపలికివచ్చి, "పిష్పా! నీకు సంతోషమైన వార్తను తెచ్చాను!" అన్నాడు.

"నువ్వు నాకు సంతోషమైన వార్తను తీసుకురావడం ఏమిట్రా? కొంపతీసి ఆ ప్రచండుని మీ వాళ్ళు బంధించలేదు కదా!" అన్నాడు పిష్పా ఆశ్చర్యంగా!

"మీరన్నది అక్షరాలా నిజం పిష్పా నిన్న టిరోజున మా స్థావరంవద్ద ప్రచండుడు, ఇంకోవ్యక్తితో తారసిల్లడం చూసి,

మేం పట్టుకుని బంధించాం, మాకు కష్టం లేకుండా వాడే మావద్దకువచ్చి చేతికి దొరికాడు. ఈ సంగతి మీకు చెప్పమని నన్ను పంపాడు మా నాయకుడు!" అన్నాడు.

అదివిన్న పీష్వా ఆనందంతో, "ఒరేయ్! నిజంగా నాకు సంతోషకరమైన వార్తను తెచ్చావు. ఆహా నిజంగా నాకు ఎంతో ఆనందంగా వుంది. సరే నేను మీ నాయకుని వచ్చి కలుస్తానని చెప్పు అంతవరకు జాగ్రత్తగా వారిని బంధించి వుంచమను. ఇక నీవు వెళ్ళు!" అన్నాడు.

"అలాగే!" అంటూ అతడు బయటికి వెళ్ళిపోయాడు. తరువాత పీష్వా, "చూశావా వర్మా! నా తంత్రం? మనకి కొంచెం కూడా కష్టం కలుగకుండా వంటింటి కుందేళ్ళలా మన శత్రువులను బంధించారు. ఇక నీవు కంగారుపడడం మానుకో! రేపుదయం నేను దొంగల స్థావరానికి వెళ్ళి, మనోహర్‌ను అక్కడే చంపి, ప్రచండుని మాత్రం బంధించి తీసుకువస్తాను!" అన్నాడు.

"పీష్వా! అలా చేశావంటే బాగుంటుంది నాకు మనోహర్‌ను చూస్తేనే వణుకు పుడుతుంది. అసలు ఈ రాత్రికి నాకు నిద్రపడుతుందో, లేదో - అనుమానమే ఇప్పుడే వెళ్ళి వాణ్ని చంపెయ్; లేకపోతే వాడు ఆ తలో పారిపోయి, ఇక్కడికి వచ్చే ప్రమాదముంది!" అన్నాడు వర్మ

"అంత భయపడకు వర్మా! దొంగలు సామాన్యులుకారు; ఇద్దరికీ బలమైన అనుపసంకెళ్ళువేసి గదిలో బంధించి వుంచుతారు. వాళ్ళ కళ్ళుకొట్టి తప్పించుకు పోవడం అసాధ్యం. రేపుదయం ఎలాగైనా నేను వెళ్ళి వాణ్ని హతమారుస్తాను!" అన్నాడు పీష్వా.

'నీమాట మీద నాకు నమ్మకంవుంది. ఎలాగో ఈ రాత్రిగడిచిపోతే చాలు పీష్వా, ఇక నీవు విశ్రాంతి తీసుకో! మిగతా విషయాలు రేపు వివరంగా మాట్లాడుతాను!' అంటూ వర్మ ప్రక్కగదిలోకి వెళ్ళాడు.

(ఇంకావుంది)




# 13

జరిగిన కథ: గండభేరుండదీవిలో మనోహర్‌ని ప్రచండుని దొంగలు బంధించుకుపోయారు; జగ్గడు రెక్కలమొసలిని చంపి, అడవిమనుషులప్రేమకు పాత్రుడై, వారి సహాయంతో, అక్కడికి వచ్చిన గండభేరుండపక్షి కాలుపట్టుకుని ఆకాశంలోకి ఎగిరాడు. కొంతదూరం పోయాక ఆపక్షి జగ్గుణ్ణి క్రిందికి వదిలేసింది. ఆధారం లేకుండా జగ్గడు భూమిమీదికి పడసాగాడు. ప్రచండుని దొంగలు బంధించారని తెలిసి పీష్వా సంతోషించాడు.

రచన: బి.ఆర్. వరదరాజులు

మనోహర్ దొంగల గుహనుండి కష్టపడి ఎలాగో ప్రచండుని గుహ చేరాడు లోపలికి వెళ్ళి, జీవకునితో జరిగినదంతా వివరించాడు.

వెంటనే జీవకుడు, "అరెరే! మా గురువును దొంగలు పట్టుకున్నారా? మరి చేపను వారికిస్తే, మిమ్మల్ని ప్రాణాలతో వదులుతారన్నది ఏం నిశ్చయం? వారు దొంగలుకనక ఎంతటి నీచానికైనా వెనుకంజవేయరు. ఏదో ఉపాయంతోనే, గురువును రక్షించాలి!" అన్నాడు.

"అందుకే నీ దగ్గరికి వచ్చాను; ఇంతకీ నా మిత్రుని జాడ ఏమైనా తెలిసిందా?" అని అడిగాడు.

"లేదు. అతణ్ని ఓ పక్షి ఎత్తుకు పోయింది; గురువుగారిని దొంగలెత్తుకుపోయారు. నన్ను, నిన్ను ఎవరు ఎత్తుకుపోతారో అని భయంగా వుంది గురూ!" అంటూ భయపడ్డాడు జీవకుడు. "జీవకా! ఇటువంటి సమయంలోనే మనం ధైర్యంగా వుండాలి. ఈ సంగతి పీష్వాకి తెలిసిందంటే, ఇంకా మనకి అపాయం! నేను ఆ ఎగిరే చేపను తీసుకుపోతాను; జరిగేది జరక్కమానదు!" అక్కడున్న ఎగిరేచేపను ఎక్కి, మీటతిప్పాడు. అది గుహబయటివరకు వచ్చి; తరువాత ఆకాశంలోకి వేగంగా వెళ్ళిపోయింది.

మనోహర్ దొంగల గుహవద్దకు వచ్చి, చేపను పైనే గిరికీలు కొట్టించసాగాడు. ఎలా ప్రచండుని విడిపించాలి?- అని ఆలోచిస్తూ, తలపైకెత్తి చూశాడు. అప్పుడతనికి ఆకాశం నుండి ఎవరో వ్యక్తి ఆధారం లేకుండా భూమి మీదకి వస్తూండటం కనిపించింది వెంటనే చేపను అటువైపుకి శరవేగంగా తిప్పి భూమిమీద పడుతున్న వ్యక్తి క్రిందికి చేపను తీసుకుపోయాడు.

సరిగ్గా పైనుండి పడుతున్న వ్యక్తి మనోహర్ నిలిపిన చేపలోపడ్డాడు. అతణ్ని చూసి మనోహర్ ఆశ్చర్యపోయి, "జగ్గా! నీవా? ఏమిటి ఆకాశంలోనుండి వస్తున్నావు? అసలు ఏం జరిగింది?" అనడిగాడు.

'మనోహర్! నీవా? అమ్మయ్యా సరియైన సమయానికి వచ్చావు; లేకపోతే నా ప్రాణం పోయివుండేనే!" అన్నాడు జగ్గడు.

తరువాత ఇద్దరూ అంతవరకు జరిగిన

విషయాలను ఒకరి కొకరు చెప్పుకున్నారు. జగ్గని సాహసకృత్యాలను విని మనోహర్ ఆశ్చర్యపోయాడు. ప్రచండుని దొంగలెత్తుకు పోయారని తెలిసి జగ్గడు ఎంతో విచారించాడు. "మనోహర్! నీవు ప్రచండుని ఎలా విడిపించాలనుకుంటున్నావు?" అనడిగాడు జగ్గడు.

"అదే జగ్గా! నేనూ ఆలోచిస్తున్నాను. ఈ చేపను దొంగలకిస్తే, ప్రచండుని కాదుగదా, నన్నే ప్రాణాలతో వదలరు!" అన్నాడు మనోహర్.

పుట్టుండి జగ్గనికి ఓ ఆలోచన కలిగింది. "మనోహర్! నావద్ద ఆదివిమనుషులు ఇచ్చిన రంగురాళ్ళు వున్నాయి కదా! వాటి సహాయంతో మనం దొంగలను నాశనం చేసి. ప్రచండుని విడిపించవచ్చు!" అని అన్నాడు.

"ఎలా?" అని ఆశ్చర్యంగా అడిగాడు. మనోహర్.

"అవంతా తర్వాత చెబుతాను. ముందు చేపను ఆ దొంగలకు తెలియకుండా వారి గుహపైన నిలబెట్టించు" అన్నాడు జగ్గడు

మనోహర్ మీటలు తిప్పి, చేపను ఎత్తైన గుహపై నిలబెట్టాడు. తర్వాత ఇద్దరూ దాని నుండి దిగి, కొంతదూరం ముందుకు నడిచారు అప్పటికే జగ్గని ఆలోచన తెలుసుకున్న మనోహర్, "జగ్గా! ఇప్పుడు మనం వున్న నేలక్రింది భాగాన దొంగలు నన్నూ, ప్రచండుని బంధించారు!" అన్నాడు.

"నీకు బాగా తెలుసుకదా! అయితే చూడు!" అంటూ తన వద్దనున్న పచ్చ రాయితో ఆ రాతినేలపై చిన్న చవరంగా గీశాడు. తరువాత చేత్తో గట్టిగా క్రిందికి ఆదిమాడు. అంతే! మరుక్షణం అతను గీచినంత మేరా రాయి క్రిందపడి, ఆ స్థలంలో రంధ్ర మేర్పడింది. మనోహర్ దానిగుండా క్రిందికి చూశాడు. ఆ క్రింది గదిలో ఏవేవో ఆయుధాలు వున్నాయి.

"మనోహర్! ఏమిటి ఇందులో ప్రచండుడు లేడే!" అన్నాడు జగ్గడు.

"నేను అనుకున్నది కొద్దిగా తప్పింది. ఇది ఆయుధాల గది. దీని ప్రక్కనున్న గదిలోనే ప్రచండుడు వుంటాడు. ఇంకొంచెం

నూడు! అన్నాడు.

తర్వాత ఇద్దరూ ఇంకొంతదూరం ముందుకు వెళ్ళి, మనోహర్ చూపిన స్థలంలో జగ్గడు పచ్చరాయితో చదరం గీచి, చేత్తో గట్టిగా అదిమాడు. వెంటనే అక్కడున్న రాయి శబ్దంచేస్తూ క్రిందపడింది. రంధ్రం ఏర్పడగానే ఇద్దరూ ఒక్కసారిగా ఆతృతతో లోనికి తొంగి చూశారు.

* * *

వర్మను గుహలో వుంచి, పీష్వామాత్రం ప్రచండుని చూడడానికి దొంగల గుహలోకి పోయాడు. అక్కడికి వెళ్లాక, మనోహర్ లేని సంగతి తెలిసుకుని, దొంగలను బాగా తిట్టాడు. అప్పటికే మనోహర్ గుహలో వున్న వర్మకు అపకారం చేయబోతాడేమో నని మనసులో

"ప్రచండా! బాగున్నావా? నన్ను చూసి చాలా కాలమైంది. పాపం! ఆ మనోహర్‌తో చేరి, అన్యాయంగా ఈ దొంగలవద్ద బందీ వయిపోయావు. ఇది నా స్థలమే తెలుసా?" అన్నాడు పీష్వా.

ప్రచండుడు కోపంతో, "పీష్వా! నీలాట అధముడి మాట వినే ఈ దొంగలు నన్ను బంధించారనుకున్నాను. అప్పుడే నీకు లొంగి పోయినట్లు సంతోషపడుతున్నావా; మనోహర్ బయటికి వెళ్ళాడు; తప్పక నన్ను రక్షిస్తాడు!" అన్నాడు.

ఆ మాటలు విని పీష్వాకి బాగా కోపం వచ్చింది. ప్రక్కనున్న దొంగలనాయకుణ్ని పిలిచి, "ఒరేయ్! ఇంకా కొద్దిసేపటికి మనో

హర్ ఆ ఎగిరే చేపమీద [illegible] తెస్తాడు. కొంచెంకూడా ఆలోచించకుండా ముందు వాణ్ని చంపేయండి; తరువాత ప్రచండుణ్ని నాకు అప్పగించండి; బయటికి వెళ్లిన మనోహర్ నా మిత్రుడికి ఏదైనా అపకారం చేయవచ్చు. అందువల్ల నేను అవసరంగా గుహకి వెళ్లాలి. రేపు వచ్చి ప్రచండుని తీసుకు పోతాను. అంతవరకు జాగ్రత్త!" అంటూ ప్రచండుని వైపు తిరిగి, "మిత్రమా! నీతో మాట్లాడానికి నాకు ప్రస్తుతం వీలులేదు; రేపు తీరికగా మాట్లాడుకుందాం! - తరువాత ఓ ముఖ్యమైన విషయం - రేపు నేను రాగానే 'పాములలోయ'కు పోడానికి మార్గం నాకు చెప్పాలి. ఇక మాట్లాడ్డానికి నాకు ఓపికలేదు. నాచేత్తో నీ ప్రాణాన్ని తీయడానికి మనస్కరించడంలేదు. బాగా ఆలోచించుకో!" అంటూ వేగంగా బయటికి వెళ్ళిపోయాడు.

తరువాత నాయకుడు ప్రచండుడు బంధించిన గదికి నలుగురు బలశాలులను కాపలాగా వుండమన్నాడు. అది చూసి ప్రచండుడు నవ్వుతూ, "నాకు ఎంత గట్టికాపలా వుంచినా ఈ రాత్రిలోగా నేను తప్పించుకు పారిపోయేది ఖాయం!" అన్నాడు.

"ప్రచండా! ఈ గుహలో వందకుపైగా దొంగ లున్నారు. వారిని తప్పించుకుని ప్రాణాలతో బయటికి పోలేవు. ఎందుకు పిచ్చిగా వాగుతున్నావు? కొంచెం విశ్రాంతి తీసుకో!" అన్నాడు.

వున్నట్టుండి పెద్దరాయి పైనుండి ప్రచండుని ముందు పడింది. అది చూసి అతను కోపంతో, "ఏమిటి? నన్ను ఈ పాత రాతి గోడలమధ్య వుంచారా? ఆ రాయి మీదపడి



వుంటే, నా ప్రాణాలు పోయివుండేవి కదా! ముందు నన్ను వేరే గదిలోకి మార్చండి; ఇక్కడ వుండలేను!" అన్నాడు.

"నువ్వు పెద్ద రాజకీయ ఖైదీవి కావు; ఇక్కడే వుండు రేపుదయం ఆ విషయం ఆలోచిస్తాం. బయట పెద్దగాలి వీస్తున్నట్టుంది. అందుకే ఆ రాయి క్రింద పడ్డది. నువ్వు మాట్లాడకుండా పడుకో!" అంటూ నాయకుడు వెళ్ళిపోయాడు; మిగతా నలుగురు గది వైపు వీపుపెట్టి ముందుకు చూస్తూ, ఏదో మాట్లాడుకోసాగారు.

ప్రచండునికి వున్నట్టుండి సన్నగా ఈల వేసినట్టు వినబడింది. ఎవరా - అనుకుంటూ తలపైకెత్తి చూశాడు. పైన రంధ్రంగుండా చూస్తున్న మిత్రులను చూసి, అతని ముఖం ఆనందంతో వికసించింది.

జగ్గడు ప్రక్కన వున్న మర్రిచెట్టు పూడను తెంపుకువచ్చి, దాన్ని పైనుండి క్రిందికి వదులుతానని ప్రచండునికి చూపాడు. ఆదిచూసి ప్రచండుడు కొంతసేపు ఆగమని సైగచేశాడు.

ప్రచండుడు బయట కాపలా వున్నవారిని పిలిచి, "మీ నాయకుణ్ణి పిలవండి! అవసరంగా ఓ జరూరు విషయం మాట్లాడాలి!" అన్నాడు.

వెంటనే ఒకడు పరిగెత్తుకువెళ్ళి నాయకుణ్ణి పిలుచుకువచ్చాడు. అతడు వస్తూనే, 'ప్రచండా! ఏమిటి నన్ను విసిగిస్తున్నావ్?" అని విసుక్కున్నాడు.

"ముఖ్యవిషయం చెప్పాలని పిలిపించాను. నీవు నన్ను దొంగదెబ్బకొట్టి తీసుకొచ్చావు కదా! అయినా, నీకు తెలియకుండా పారిపోడానికి నాకు మనసురావడం లేదు. నీకు చెప్పి, నీ కళ్ళుదుట తప్పించుకు పోవాలనుకున్నాను; అందుకే పిలిపించాను!" అన్నాడు.

"మళ్లీ పిచ్చివాగుడు మొదలెట్టావా? ప్రచండా! నీకు మతిభ్రమించిందా ఏమిటి?" ఎప్పుడూ అదేమాట అంటున్నావు; నాప్రాణం తీస్తున్నావు. సరే నీ ఇష్టప్రకారమే నాముందు తప్పించుకు పో; చూద్దాం?" అని విసుగుగా అన్నాడు.

"సంతోషం!" అంటూ ప్రచండుడు తల పైకెత్తి, "మాతా! భవానీ నీ భక్తుణ్ణి

రక్షించు!" అంటూ చేతులు గట్టిగా చరిచాడు.

మరుక్షణం పైనుండి జగ్గడు వదిలిన పూడ క్రిందికి వచ్చింది. ప్రచండుడు దాన్ని పట్టుకుని అందరూ చూస్తుండగానే పైకి వెళ్ళిపోయాడు.

అనుకోనివిధంగా అలా జరగడంతో నాయకుడి నిద్రమత్తు పూర్తిగా వదిలి పోయింది. "ఒరేయ్! వాణ్ని పట్టుకోండి; వదలకండి; చంపండి!" అంటూ గట్టిగా కేకలు వేయసాగాడు.

ఆ కేకలు విని లోపలున్న దొంగలంతా అక్కడికి వచ్చి చేరారు. కానీ ప్రయోజనం లేక పోయింది. కటకటాలకు అటువైపు ప్రచండుడు పూడసాయంతో పైకి పోతున్నాడు. నాయకుడు "ప్రచండుని పట్టుకోండి!" అని అరుస్తున్నాడు. కాని, ఆ గది తాళాలు ఎవరిచేతికీ ఇవ్వలేదు. అందరూ ఆ కటకటాలను పట్టుకుని వెర్రిగా చూడసాగారు

నాయకునికి ఆ సమయంలో ఏం చేయ లో తోచడంలేదు. తన మనుషులు తప్పించుకు పోతున్నవారిని పట్టుకోకుండా మాస్తుండటం చూసి వారిని గట్టిగా ముందుకు తోసి, "తెలివితక్కువ దద్దమ్మల్లారా! వాణ్ని పట్టుకోడానికి శక్తిలేక పోయిందా!" అని గట్టిగా అరిచాడు. అంతలో జగ్గడు తన వద్దనున్న ఎర్రరాతిని ఆ గదిలోకి విసిరి, మనోహర్, ప్రచండుడు ఎక్కివున్న చేపలోకి వేగంగా జొరబడ్డాడు. మరుక్షణం అది వేగంగా ఆకాశంలోకి దూసుకుపోయింది.

క్షణం తరువాత గదిలో పడిన పచ్చరాయి నుండి పొగరావడం మొదలుపెట్టింది. అది దొంగల కళ్ళకు తగిలి, వారు కళ్ళు తెరవ లేక కష్టపడసాగారు. వున్నట్టుండి ఆ గుహ అంతా పెద్దగా శబ్దంచేసుకుంటూ ముక్కలు ముక్కలుగా పగిలి పడిపోయింది. దాంతో బాటు అందులోవున్న దొంగలు కూడా నలిగి పోయి, అందరూ చనిపోయారు. అంతటినీ పైనుండి ముగ్గురు వ్యక్తులుచూసి ముందుకు పయనించసాగారు.

(ఇంకావుంది)

# గండభేరుండుడు

## 14

జరిగిన కథ: ఆకాశంనుండి గండభేరుండ పక్షి, జగ్గని క్రింద వదలడంతో, అతను సరిగ్గా మనోహర్ వస్తున్న చేపవాహనం మీద పడ్డాడు. తరువాత జగ్గడు, మనోహర్ ద్వారా ప్రచండుని దొంగలు బంధించారని తెలుసుకుని, ఆ గుహవద్దకు వచ్చారు. జగ్గడు తన వద్దనున్న పచ్చరాయితో గుహపై బాగా రంధ్రంచేసి, ప్రచండుని పైకి రప్పించాడు. తరువాత ముగ్గురు చేపమీద ఎక్కి, ఎర్ర రాయిని గుహమీద విసిరారు. దాంతో ఆ గుహ ముక్కలు ముక్కలైంది.

రచన: బి.ఆర్. వరదరాజులు

గుహకు వెళ్ళిన పీష్వా, "వర్మా,వర్మా!" అంటూ పిలిచాడు. లోపలున్న వర్మ పరిగెత్తుకువచ్చి, "పీష్వా! వచ్చేశావా? ప్రచండుడూ, మనోహర్ ఏరీ " అనడిగాడు.

"ప్రచండుడు దొంగలవద్దే వున్నాడు. మనోహర్‌ని బయటికి పంపారని విని, నీకు అపాయం కలగబోతుందేమోనని ఇక్కడికి వచ్చాను!" అని అన్నాడు పీష్వా.

"ప్రచండుణ్ణి అయినా నీవు బంధించి తీసుకురాకూడదా?" మనోహర్ అసాధ్యుడు; ఈపాటికి దొంగలవద్దకి వచ్చి, ప్రచండుని విడిపించడానికి ప్రయత్నాలుచేస్తూ వుంటాడేమో! ఎందుకైనా మంచిది, రా, మన మిద్దరం తిరిగి అక్కడికి పోదాం; ఆలస్యం చేయకు!" అన్నాడు వర్మ.

"నీ ఆలోచని సరిగానే వున్నట్టు తోస్తున్నది. సరే ఎందుకైనా మంచిది. రా పోదాం!" అంటూ పీష్వా వెనక్కి తిరిగాడు; వర్మ అతణ్ని అనుసరించాడు.

పీష్వా, వర్మ దొంగల స్థావరంవున్న గుహ పడిపోయి, అక్కడున్న రాళ్ళ గుట్టలు, శవాల గుట్టలు, రక్తప్రవాహాలు చూసి జరిగింది వూహించుకుని ఆశ్చర్యపోయారు.

"చూశావా పీష్వా! మనోహర్ అసాధ్యుడు. వంచలకొలది దొంగలను చంపి, ప్రచండునితో తప్పించుకుని పోయాడంటే, మనం వారికి లెక్కా?" అన్నాడు.

"నిజమే! మనోహర్ శక్తిని తలుచుకుంటే, నాకు చాలా ఆశ్చర్యంగా వుంది ఇక మనం చాలా జాగ్రత్తగా మసలుకోవాలి; లేకపోతే, అతను మన అంతు తేల్చగలడేమో! అయినా, మనం ఇంకెంతకాలం 'పాములలోయకు' పోవడానికి దారి చూపించగలడని ప్రచండుని కోసం వేచివుండడం? ఈ మనోహర్ వున్నంత కాలం ఆ పని జరగనీయడు. ఇక మోసం చేసి అయినా వారివల్ల తెలుసుకోవాలి. ఇక ఏమాత్రం కాలాన్ని వృధా చేయకూడదు. ప్రచండుని వెంటనే కలుసుకోవాలి. ఏవిధంగానైనా పాములలోయకు మార్గాన్ని తెలుసుకు తీరాలి!" అన్నాడు పీష్వా.

"ప్రచండుని వద్దకు వెళ్ళి పాముల లోయకు మార్గాన్ని అడిగితెలుసుకునే ధైర్యం

నీకున్నదా? ఇది సాధ్యమా?" అని ఆశ్చర్యంగా అడిగాడు - వర్మ.

"అదే పీష్వా తెలివి! రేపుదయం మనం ప్రచండుని గుహకు వెళుతున్నాం కదా చూడు అక్కడ నా తెలివిని!" అంటూ వేగంగా ముందుకు నడిచాడు - పీష్వా.

మరునాడు పీష్వా, వర్మ ప్రచండుని గుహకు వచ్చారు. వారిని చూసి ప్రచండుడు ఆశ్చర్యపోతూ, "ఏం పీష్వా! దొంగలనుండి ఎలా తప్పించుకు వచ్చానో తెలుసుకు పోడానికి వచ్చావా, ఏం?" అనడిగాడు.

"ప్రచండా! మనమిద్దరం అజన్మ విరోధులంగా వుంటే, పాములలోయలో వున్న భరిణ ఎవరికీ దక్కకుండా, వుపయోగం లేకుండా పోతుంది. అందుకని నేను ఓ నిర్ణయానికి వచ్చాను; నేను ఇప్పుడు చాలా మారిపోయాను; గుర్తుగా నావద్దనున్న ఈ వజ్రాన్ని నీకు కానుకగా ఇస్తున్నాను; వర్మ దీన్ని నాకు ఇచ్చాడు; నేను నీకు ఇస్తున్నాను; నువ్వు మనోహర్‌కు ఇస్తావుకదూ! అందువల్ల అందరం మిత్రులంగా మారిపోదాం; నువ్వు పాములలోయకు నన్ను తీసుకు వెళ్ళు; నేను లోయనుండి భరిణను తీసుకొస్తాను. అతరువాత మన బలాలు చూసి, ఎవరికి భరిణ దొరుకుతుందోచూస్తాం. ఇది అందరికీ నచ్చుతుందని అనుకుంటాను. ఆని వజ్రాన్ని ప్రచండునికి ఇచ్చాడు - పీష్వా.

ప్రచండుడా వజ్రాన్ని తీసుకుని, "మనోహర్! ఇదేనా నీ వజ్రం?" అనడిగాడు.



మనోహర్ దాన్ని పరిశీలనగా చూసి, "అవును ఇది నా వజ్రమే!" అంటూ దాన్ని తీసుకున్నాడు.

తరువాత ప్రచండుడు, "మనోహర్! పీష్వా చెప్పిన మాటకు మనసమ్మతి తెలియజేద్దామా, లేక ఇందులో మోసం ఏదైనా వుంటుందంటావా?" అని మెల్లగా అడిగాడు.

మనోహర్, "ప్రచండా! ఇది నీకిష్టమేనా? ఆ భరిణ ఎవరికైనా వుపయోగపడాలికదా! మనం బలం గలవాళ్ళంగదా! అందువల్ల ఇక కాలాన్ని వృధాచేయకుండా వెంటనే పాములలోయకు బయలుదేరి వెళ్ళుదాం!" అన్నాడు.

ప్రచండుడు పిష్వా వైపు తిరిగి, "సరే! ఈరోజే మనం బయలుదేరి వెళ్ళుదాం, మోసం ఎక్కడైనా జరిగిందంటే, నీ ప్రాణం అక్కడి కక్కడే తీసేస్తాను, జాగ్రత్త!" అని అన్నాడు.

కొంతసేపటికి అందరూ తయారై పాములలోయకు బయలుదేరారు. పీష్వా, ప్రచండులు వారి వారి వాహనాలు గుహలోనే పెట్టి, అందరూ నడకతో బయలుదేరి, సముద్రతీరం చేరారు. అక్కడున్న పెద్ద పడవ ఎక్కి నడపసాగారు.

రాత్రికి అందరూ ఓ చిన్న దీవిని చేరుకున్నారు. పడవనుండి అందరూ దీవిలోకి వెళ్ళారు. "ఈ దీవిగుండా మనం వెళితే పాములలోయను చేరుకుంటాం. ఈ రాత్రికి ఎక్కడైనా తలదాచుకుని పుదయం బయలుదేరి వెళ్ళవచ్చు!" అన్నాడు ప్రచండుడు.

వున్నట్టుండి వర్షం ప్రారంభించి జోరున కురవసాగింది. అందరూ ముద్దగా తడిసిపోయారు ఎక్కడైన తలదాచుకుందామని గబగబా ముందుకు అడుగులు వేశారు. కొద్ది దూరంలో ఓ పాడుబడిన భవనం కనబడింది దాన్ని చూడ్డంతో అందరికీ ప్రాణం లేచి వచ్చినట్లయి, వేగంగా అటువైపు నడిచారు.

"ఎక్కడో మూలన వున్న దీవిలో, ఇంత పాడుబడిన భవనంలో మనుషులుంటారా?" అన్న అనుమానంతో మనోహర్ వేగంగా ముందుకు అడుగులు వేయసాగాడు.

అందరూ ఆ భవనాని చేరుకున్నారు. లోపల ఎక్కడో చిన్నదీపం వెలుగుతున్న ట్టుంది; వారికి సన్నగా వెలుతురు కనిపించింది. తప్ప ఆ భవనంలో ఎవరైనా వుంటారని తలచి · తలుపులు గట్టిగా తట్టారు. కానీ ఎవరూ వచ్చి తలుపులు తెరవలేదు; బయట వర్షం జోరుగా కురుస్తూంది; అందరూ ముద్దగా తడిసి చలికి వణక సాగారు.

"లోపల ఎవరున్నారు? దయచేసి తలుపులు తెరవండి; బయట వర్షం కుప్ప తెప్పలుగా కురుస్తూంది!" అని పెద్దగా అరిచాడు-జగ్గడు.

అయినా, లోపలినుండి చిన్నశబ్దంకూడా వారికి వినిపించలేదు. అది చూసి మనోహర్, "లోపల ఎవరూ లేనట్టుంది; మనం తలుపులు పగలగొట్టి లోపలికి వెళదాం; లేకుంటే ఈ వర్షంలోనే మన ప్రాణాలు ఎగిరి పోయేటట్టుగా వున్నాయి!" అన్నాడు.

అందరూ సమ్మతించారు; ఒక్కసారిగా ఆ తలుపులను బలంగా, గట్టిగా తోశారు. అదేమి చిత్రమోగాని అంత పాత తలుపులు కొంచెం కూడా చెక్కచెదరకుండా అలాగే నిలిచి వున్నాయి.

అంతలో ఏదో చిటిక వేసిన శబ్దం విని, అందరూ తిరిగి చూశారు. వారివెనక ఓ మామూలు మనిషి 'అరచేయి' మాత్రం గాల్లో నిలబడివుంది. శరీరంలేని ఒట్టి అరచేయి గాల్లో నిలిచి చిటిక వేయడంచూసి వారు



కొంత భయపడ్డారు. ఆలాగే నిలబడి కళ్ళు ఓసారి నులుముకుని, ఇంకా పరీక్షగా ఆ అరచేయి వంక చూడసాగారు.

కొంతసేపటికి వర్మ, "ఎవరు నీవు? ఇలా అరచేయి మాత్రం ఎలా గాల్లో నిలబడి వుంది? ఎవరివో చెప్పు!" అని అరిచాడు.

ఆ మాటలకు అరచేయి చూపుడువేలుతో, వర్మను తనవద్దకు రమ్మన్నట్టు సంజ్ఞ చేసింది. వర్మ భయపడకుండా దానివద్దకు వెళ్ళి నిలిచి, "నువ్వు దెయ్యానివా! భూతానివా?" అని తిరిగి అడిగాడు.

ఈసారి అరచేయి వేగంగా గాల్లోకి లేచి, వర్మచెంపమీద బలంగా కొట్టింది. అంతే! ఆ దెబ్బకు వర్మ ఎగిరి పీప్సా ముందు పడి, "అనుమానంలేదు; ఇది దె దె దెయ్యం!" అన్నాడు.

అంతలో మనోహర్, "వర్మా! పిచ్చిగా వాగకు. ఇంతమందిలో నిన్ను మాత్రం అర చేయి కొట్టిందంటే, దానికి కారణం - నువ్వు దెయ్యం, భూతం అనడంవల్లనే; నువ్వు మాట్లాడకుండా నిలబడు!" అని అరచేయి వైపు తిరిగి, "అయ్యా! మీరెవరో గానీ, ఈ రాత్రికి మేం ఈ భవనంలో తలదాచుకోవాలి; రేపుదయం తిరిగి వెళ్ళిపోతాం! దయచేసి ఈ భవనం తలుపులు తెరవండి!" అన్నాడు.

ఆ మాటలు విని అరచేయి కొంచెం కూడా ముందుకు రాకుండా, వెనక్కి తిరిగింది.

అంతలో జగ్గడు, "మేం పాములలోయకు పోతున్నాం రాత్రిలో ప్రయాణం చేయడం కష్టం; తిరిగి రేపుదయం తప్పక వెళ్ళిపోతాం!" అన్నాడు.

ఆ మాటలు అతను పూర్తిచేయకముందే అరచేయి వేగంగా ముందుకువచ్చి, కిటికీ గుండా భవనంలోకి దూరి, తలుపులకు అటువున్న గడియను తీసింది. అందరూ తలుపులు తెరుచుకుని లోపలికెళ్ళారు. లోపల ఓ గదిలో చిన్నదీపం వెలుగుతూ వుంది. అరచేయి లోపలికి రాకుండా వుండడానికి తలుపులు గట్టిగాబిగించాడు - వర్మ.

అర్ధరాత్రయింది. అందరూ ప్రయాణం బడలికతో హాయిగా నిద్రపోతున్నారు; వున్న

ట్టుండి తలుపులు తెరవమన్నట్టు టక్ టక్ మన్న శబ్దం తలుపుమీద వినిపించింది. ఆ శబ్దానికి అందరూ నిద్రనుండి లేచారు; జగ్గడు తలుపు తెరవడానికి వెళ్లాడు.

అంతలో వర్మ అడ్డుపడి, తలుపులు తెరవకు; అది ఆ అరచేయి దెయ్యంపని; కొంత సేపు కొట్టి అదే తిరిగి వెళ్ళిపోతుందిలే!" అని అన్నాడు.

ఎంతసేపయినా, తలుపులు కొట్టడం ఆగలేదు; మనోహర్ విసుగుతో వెళ్లి, తలుపులు తెరిచాడు.

ఎదురుగా అరచేయి గాల్లో నిలబడివుంది; "మనోహర్ ఎవరుకావాలి?" అనడిగాడు. అందుకు అరచేయి తనతో రమ్మని చూపుడు వేలితో సంజ్ఞచేసింది. మనోహర్ ఆలాగేనని ముందుకు నడిచాడు. వున్నట్టుండి అరచేయి వెనక్కి తిరిగి గదిలోవున్నవారు బయటికి రాకుండా బయట గడియపెట్టి, ముందుకు వెళ్ళనారంభించించి; మనోహర్ దాన్ని అనుచరించాడు.

గదిలో వున్నవారు వున్నట్టుండి తలుపులు మూసుకోగానే, కుయ్యో, మొర్రో - దెయ్యం మనోహర్‌ను తీసుకుపోతుందే!" అని అరుస్తూ తలుపులు గట్టిగా బాదసాగారు.

మనోహర్ ధైర్యం ఆ కటిక చీకటిలో అరచేయి వెనుకనే నడవసాగాడు. ఆ భవనం చాలా పురాతనమైంది. అంతా బూజుపట్టి, చాలా అసహ్యంగా గబ్బిలాలతో నిండివుంది. ఓచోట అరచేయి నిలబడి మనోహర్‌ను నేల మీదవున్న కంబళిని పైకి తీయమని సంజ్ఞ చేసింది.

మనోహర్ దాన్ని పైకి తీశాడు; నేలపై చెక్క తలుపు కనబడింది. దాన్ని తెరిచాడు; క్రిందికి పోడానికి మెట్లు కనిపించాయి; అరచేయి లోపలికి దిగింది; మనోహర్ ఆ మెట్లుగుండా క్రిందికి దిగి నడిచాడు. ఓచోట చీకటిలో ఎవరో నిలబడి వున్నట్టు కనబడింది

(ఇంకావుంది)




## 15

మనోహర్, ప్రచండుడు, జగ్గడు దొంగల స్థావరాన్ని నాశనం చేసి వెళ్ళిన కొంతసేపటికి పీష్వా, వర్మ వచ్చారు. జరిగినది తెలుసుకుని ఓ నిశ్చయానికి వచ్చారు. పీష్వా వజ్రాన్ని ప్రచండునికి ఇచ్చి, పాముల లోయకు పోవుదారిని చెప్పమన్నాడు. ప్రచండుడు అందులకు సమ్మతించాడు. అందరూ పాములలోయకు బయలుదేరారు. దారిలో పాడుపడిన భవనంలో ఓ అరచేయిని చూశారు. అరాత్రి అరచేయి మనోహర్‌ని సారంగంలోకి తీసుకువెళ్ళింది, అక్కడ చీకటిలో ఓ ఆకారం నిలబడి వుండడం గమనించాడు మనోహర్.

రచన: బి.ఆర్. వరదరాజులు



మనోహర్ ఆకారం దగ్గరికివచ్చి "ఎవరవి? ఎందుకు చీకటిలో నిలబడి వున్నారు?" అంటూ చేత్తో తాకాడు. చేతికగట్టిగా ఎముక తగిలింది. మనోహర్ ఆశ్చర్యంతో ఆ వ్యక్తి వద్దకి వెళ్ళి పరీక్షగా చూశాడు.

అది ఓ అస్థిపంజరం; దాన్ని అంత దగ్గిరిగా చూడ్డంతో అతని గుండె ఆగినంత పనయింది. అయినా, తమాయించుకుని ముందుకి నడిచాడు. అక్కడ ఓచోట రత్నాలు, వైడూర్యాలు, వజ్రాలు, బంగారు కడ్డీలు కుప్పలు కుప్పలుగా పోసివున్నాయి. అంతవరకు తనతో వచ్చిన అరచేయి కనబడక పోవడంతో మనోహర్ ఆశ్చర్యపడి చుట్టూ చూడసాగాడు.

వున్నట్టుంది అరచేయి ఎక్కడి నుండో ఒక కాగితాన్ని తీసుకొచ్చి మనోహర్ చేతి కిచ్చింది. అందులో ఏదో వ్రాసి వున్నట్టు చూసి, మనోహర్ దాన్ని ఇలా చదవసాగాడు:

"నాపేరు వీరకేసరి, నేను రత్నాల వర్తకుణ్ణి. నేను, నా మిత్రుడు చంద్రవర్మ పెద్ద వ్యాపారం చేసి, కొన్ని కోట్ల విలువైన రత్నాలను, వజ్రాలను సంపాదించాం. ఆ సంపదంతా చాలా అన్యాయంగా, అక్రమంగా తోటి వర్తకులను మోసంచేసి సంపాదించాం. వాన్నంతటినీ ఎంతోకష్టపడి ఈ పాడుబడిన భవనంలో వున్న సొరంగ గదిలో దాచాం. మేమిద్దరం సమానంగా పంచుకోవాలని ఇక్కడే చాలా రోజులు వున్నాం, ఓరోజు చంద్రవర్మ అడవికి వెళ్ళి వస్తానని, రెండు రోజుల తరువాత ఓ సీసాతో వచ్చాడు. ఆలస్యానికి కారణం అడిగితే, ఏదోచెప్పి వూరుకున్నాడు. కానీ నాకు అతనిమీద అనుమానం కలిగింది. ఆరోజే సంపదనంతా పంచేసుకుందామని చెప్పాను. చంద్రవర్మ అందులకు సమ్మతించక, అంతటినీ తనే తీసుకుంటానని వాదించాడు. నాకు కోపం వచ్చి, నా వద్దవున్న పిడిబాకును బయటికి లాగాను. చంద్రవర్మ అది చూసి బయపడక, "కేసరీ! నా చేతిలో వున్న సీసాలో ద్రావకం వుంది. నువ్వు ఆ కత్తి విసిరేంతలో నా చేతిలోని ద్రావకం నీ శరీరాన్ని కాల్చివేస్తుంది?" అంటూ సీసా మూత తెరిచాడు. నేను పరి

స్థితిని అర్థం చేసుకున్నాను. నా ఇష్టదైవాన్ని తలచుకుని కత్తితో నా ఆరచేయిని కోసి బయటికి విసిరాను. చంద్రవర్మ అదేమీ గమనించక నా మీదికి ద్రావకం కుమ్మరించాడు. అంతే! నా శరీరమంతా పుడికిపోయింది. బాధకు తాళలేక చాలాసేపటివరకు అరచి, అరచి అలాగే క్రిందపడిపోయాను కొంతసేపటికి నా శరీరంనుండి నా ప్రాణం బయటికి వచ్చి క్రిందపడివున్న ఆరచేయిలో కలసి మెల్లగా గాల్లోకి లేసింది.

చంద్రవర్మ నేను చనిపోయానని తలచి, నా శవాన్ని అడవికి తీసుకెళ్ళి, గుంటతవ్వి అందులో పాతేశాడు. తరువాత తిరిగి వజ్రాలు దాచిన సొరంగంలోకి వెళ్ళాడు. అంతటినీ గమనిస్తున్న నాకు అతనిపై బాగా కోపం రెచ్చిపోయింది. నన్ను అన్యాయంగా చంపిన చంద్రవర్మను చంపేయాలనుకుని, నేను సొరంగంలోకి వెళ్లాను. లోపల వజ్రాలు, వైడూర్యాలు తృప్తిగా చూసుకుని తిరిగి, వస్తున్న చంద్రవర్మ గాల్లో వస్తున్న నా ఆర చేతిని చూసి, అలాగే భ్రమించి నిలబడిపోయాడు. కొంతసేపటికి అతను ప్రాణం వదిలాడు పిరికివాడు; వాణ్ని చంపడానికి నాకు అవకాశమివ్వలేదు.

తరువాత నేను బయటికి వచ్చి, ఈ పాడుబడిన భవనంలోనే కాలం గడపసాగాను. ఓసారి ఇక్కడికి ఓ మాంత్రికుడు వచ్చి, నా కథంతా విని జాలిపడి, పాములలోయలో వున్న ఎర్రరంగు మూలికను తెచ్చి, నా ఆర

చేతిలో పట్టుకుంటే, నేను ప్రాణంతో మామూలు రూపానికి వస్తానని చెప్పి వెళ్లాడు.

ఆ రోజునుండి నేను పాములలోయకు ఎవరైనా వెళతారా అని వెతక సాగాను. ఈ రోజు మీరు అక్కడికి వెళతారని తెలిసి నేను తలుపులు తెరిచాను. భవనంలో సంపద ఎక్కువ వుండటంవల్ల నేను కొత్తవారిని లోకి రానిచ్చేవాణ్ని కాను. నాకు సహాయం చేస్తారనే నమ్మకంతో విషయాన్ని మీకు వివరంగా వ్రాశాను. నాయందు దయవుంచి మీరు పాములలోయనుండి మూలికను తేవాలనుకుంటే ఈ కాగితాన్ని చదివి, వజ్రాలమీద పెట్టి వెళ్ళండి; మీకు దాన్ని తేవడానికి ఇష్టం

లేకుంటే, దాన్ని ముక్కలు ముక్కలుగా చింపిపారేసి వెళ్ళండి. ఏది ఏమైయినా మీకు హాని కలిగించను; ఇక మీ ఇష్టం!"

—అనివుంది.

మనోహర్ అంతా చదివి, ఆ కాగితాన్ని వజ్రాలమీద పెట్టి, తిరిగి వెనక్కి నడిచాడు. అక్కడ కనబడిన అస్థిపంజరాన్ని చూసి, మనసులో, "ఇది ఆ ద్రోహి వజ్రవర్మ అస్థి పంజరం వుంది!" అని తలిచి, వేగంగా నడిచి తన గదిని చేరాడు.

గదిలోకి వచ్చిన మనోహర్‌ను చుట్టూ అందరూ చేరి, వూపిరిసలపకుండా ప్రశ్నలు వేయసాగారు. మనోహర్ చిరునవ్వు నవ్వుతూ "ఆ అదంతా దయ్యం చేష్టలు; నన్ను భవనం చుట్టూ తిప్పి, ముప్ప తప్పలు పెట్టింది. తిరిగి ఇక్కడికి తీసుకువచ్చి, వదిలింది. నాకు ఏ అపాయం కలగలేదు. ఇక పడుకోండి!" అనిచెప్పి తరువాత ప్రచండునికి, జగ్గనికి, జీవకుని అరచేయి కథంతా వివరంగా మెల్లగా చెప్పాడు.

అందరూ హాయిగా పడుకున్నారు. ఉదయమయింది. అందరూ నిద్రనుండి లేచి, ప్రయాణానికి సిద్ధమయ్యారు. వర్మ ఓసారి భవనం అంతా తిరిగి, "అరే! రాత్రి కనబడిన దయ్యం కనబడలేదే! ఎక్కడికి వెళ్ళి వుంటుంది?" అని తనలో తాను ప్రశ్నించుకున్నాడు.

అంతలో మనోహర్, "వర్మా! మనం దీన్ని వదిలి వెళుతున్నాం; ఇక ఆ పిచ్చిమాటలు ఆపు!" అంటూ ముందుకు కదిలాడు.

అందరూ అతణ్ని అనుసరించారు; ప్రచండుడు ముందు దారి చూపసాగాడు.

అది చాలా పెద్ద దీవిలా వుంది మధ్యాహ్నం విశ్రాంతి తీసుకోకుండా అందరూ ప్రయాణించసాగారు. రాత్రికి అందరూ పాములలోయను చేరుకున్నారు. అందరికన్నా పీష్వా చాలా సంతోషపడుతూ లోయలోకి తొంగిచూశాడు. చుట్టూ చీకటిగా వున్నా, లోయలో వేలకొలది పాములు తిరుగుతున్నట్లు అనిపించింది.

ప్రచండుడు, "పీష్వా! ఇప్పటికే చాలా చీకటి పడిపోయింది. నిన్ను ఇంతవరకు తీసుకువచ్చాను; ఇక ఆ మంత్రాల భరిణను లోయలోనుండి బయటికి తీసి ఇవ్వు ముందే మనకిది కొత్తచోటు; మనకేదైనా ఆపాయం కలిగినా కలగొచ్చు!" అన్నాడు.

అంతవరకు సంతోషంగా వున్న పీష్వా ముఖం ఆదోలా పెట్టి, "ప్రచండా! అవసరపడకు! గురువుగారు చెప్పినట్లు భరిణను వుదయాన మాత్రమే! తీయడానికి వీలవుతుంది. ఇప్పుడు రాత్రి సమయం; ఇప్పుడు నేను లోయలోకి దిగితే, నాకు ఆపాయం కలగవచ్చు గదా!" అన్నాడు.

"అయితే రాత్రికి మనం ఇక్కడే వుండి, ఉదయం తీసుకుందా మంటావా? ఇందులో మోసం ఏదీ లేదు కదా!" అని అనుమానంతో అన్నాడు ప్రచండుడు

"అయ్యయ్యో ఎంతమాట! ఇంకా నన్ను నమ్మలేదా, మీరు? సరే నేనూ, వర్మా అక్కడే విశ్రాంతి తీసుకుంటాం; మీరు

ఇక్కడే పడుకోండి!" అంటూ పీష్వా అటు వైపు వెళ్ళాడు.

ప్రచండుడు ఏమీ మాట్లాడకుండా మనోహర్ వైపు చూశాడు. మనోహర్ రాత్రికి అక్కడే వుందామన్నాడు; అంచరూ అక్కడే పడుకున్నారు.

అర్ధరాత్రయింది. పీష్వా మెల్లగా పక్క మీదినుంచి లేచాడు; చుట్టూ చూశాడు. మనోహర్ బృందంలోనివారంతా హాయిగా నిద్రపోతున్నారు. మెల్లగా నిద్రపోతున్న వర్మను తట్టి లేపాడు. అతడు నిద్రనుండి లేవగానే పీష్వా అతని చెవిలో ఏదో చెప్పి, ముందుకు పోసాగాడు.

పీష్వా తన కాలి చెప్పునుండి తెల్లటి వేరును తీసి, నిద్రపోతున్న వారి ముక్కుల వద్ద వుంచాడు; మరుక్షణం అందరూ తలలు వాల్చేశారు. ఆది చూసి వర్మ చాలా సంతోషపడ్డాడు.

తరువాత పీష్వా అక్కడ పడివున్న కర్రను పైకి తీసి, దాన్ని తన చెప్పులపైన గట్టిగా రుద్దాడు. మరుక్షణం ఆ కర్ర మండసాగింది. దాన్ని వర్మచేతికిచ్చి, తన దుస్తుల్లో దాచి వుంచిన త్రాడును బయటికి తీసి, అక్కడున్న చెట్టుకు కట్టి ఇంకొక కొనను లోయలోకి వదిలి, వర్మను త్రాడుపట్టుకుని లోయలోకి దిగమన్నాడు. వర్మ భయపడుతూ, నావల్ల కాదన్నాడు. పీష్వా కోపంతో వర్మను లాగి ఒక్కతన్ను తన్నాడు. ఆ దెబ్బకు అతను ఆదిరిపోయి, ప్రక్కనే వున్న పాముల లోయలోకి, మండుతున్న కర్రతో కూడా పడిపోయాడు. క్రించపడేటప్పుడు "అమ్మోయ్ చచ్చానా బాబూ!" అని గట్టిగా అరిచాడు. ఆ అరుపువిని లోయలోని పాములు దివిటీతో పడివున్న వర్మను చూసి, అతని మీదికి ఎగబ్రాకి వాటి ఇష్టప్రకారం కాటు వేయసాగాయి. అన్ని పాములూ అతని చుట్టూ మూగినవి.

అంతలో పీష్వా త్రాడుపట్టుకుని వేగంగా లోయలోకి దిగి, మూలలో వున్న మంత్రాల భరిణను చేతిలోకి తీసుకున్నాడు. అతణ్ణి పాములు గమనించలేదు, మధ్యలో వర్మను చూసి, "పిచ్చివాడా! నాకు ఇలాంటి పనికి వుపయోగ పడతావనే నీతో స్నేహం చేశాను.

నన్ను ఎదిరించేవాడు ఎవడూ లేడు!" అని అనుకుంటూ వేగంగా ముందుకు నడిచాడు.

తెల్లవారింది. నిద్రపోతున్న వారంతా మేల్కొన్నారు; ప్రక్కకు తిరిగి చూశారు అక్కడ రాత్రి పడుకున్న పీష్వా, వర్మ కనిపించలేదు. అదిచూసి ప్రచండుడు "మనోహర్! ఎదో మోసం జరిగింది; పీష్వా కనిపించటం లేదు!" అన్నాడు.

అంతలో మనోహర్ లోయలో పడి చచ్చి వున్న వర్మను చూసి, "ప్రచండా! ఇటు చూడు! లోయలో వర్మ రక్తం కక్కి చచ్చి పడి వున్నాడు; మంత్రాల భరిణ కనిపించడం లేదు. పీష్వా అంచరినీ మోసం చేశాడు!" అన్నాడు.

ప్రచండుడు లోయలోకి చూసి, "నాకు ముందునుంచే అనుమానంగావుంది. అయినా, రాత్రి ఎందుకు ఆలా నిద్రపోయానో అర్థం కావడంలేదు!" అన్నాడు.

"ప్రచండా! జరిగినదాన్ని గురించి వృధా జాలహరణం చేయకు, పీష్వా ఎక్కువ దూరం పోయివుండడు. రండి! మనం వేగంగా వెళితే అతన్ని ఇట్టే పట్టేయవచ్చు!" అన్నాడు జగ్గడు.

వున్నట్టుండి మనోహర్‌కు పాడుబడిన భవనంలో వున్న ఆరచేయి అడిగిన ఎర్ర మూలిక జ్ఞప్తికి వచ్చి, ఆది అందరికీ చెప్పాడు. అందరూ లోయచుట్టూ ఆమూలిక కోసం వెదకసాగారు. చాలాసేపు వెదికాక వారికి పెద్ద పాముపుట్ట మీదఎర్రమూలిక కనిపించింది.

దాన్ని చూసి అందరూ ఆగిపోయారు. మూలికను ఆ పుట్టనుండి ఎలా తీయాలా- అని ఆలోచించసాగారు. అంతలో పుట్టలో నుండి ఓపాము బయటికి వచ్చి, ఆ మూలికను చుట్టుకుని నిలిచింది. జగ్గడు మెల్లగా ముందుకు అడుగు వేశాడు. అతను పుట్ట దగ్గరికి వచ్చేటప్పటికే పాము బుసకొట్టింది. అది చూసి జగ్గడు అడుగు ముందుకు వేశాడు

(ఇంకావుంది)




## 16

జరిగిన కథ: పాములలోయకు పోతున్న దారిలో మనోహర్ బృందాన్ని అరచేయి పాడు పడిన భవనంలోకి తీసుకెళ్ళి తన కదనంతా చెప్పింది. మరునాడు అందరూ పాముల లోయకు చేరుకున్నారు ఆరోజు రాత్రి అందరూ నిద్రపోతుండగా పీష్వా వర్మను పాములలోయలో తోసి, మంత్రాల భరిణను తీసుకుని వెళ్ళిపోయాడు. మరునాడు నిద్ర నుండి లేచిన మనోహర్ బృందం పీష్వా తెలుసుకున్నారు. వారికి కావలసిన ఎర్ర మూలిక పాముపుట్టపై పుంచడం గమనించారు. అంతలో పుట్టలో నుండి పాము బయటికి వచ్చింది.

రచన: బి.ఆర్. వరదరాజులు

జీవకుడు బెదురుతూ, "జగ్గా! వెనక్కి వచ్చేయ్, వెళ్ళిపోదాం. ఆ మూలిక మనకు వుపయోగపడదు. మనం త్వరగా వెళితేనే పీష్వాని పట్టుకోడానికి వీలవుతుంది!" అన్నాడు.

"జీవా! అవసరపడకు. కొంతసేపయినా ఆ మూలికను తీసుకుని వెళదాం. పీష్వా ఎంతత్వరగా వెళ్ళినా, గండభేరుండదీవి దాటి వెళ్లలేడు!" అంటూ మనోహర్ ముందుకు నడిచాడు.

అంతలో ఆకాశంలో పెద్దశబ్దం వినిపించింది. అందరూ తల పైకెత్తి చూశారు. పెద్ద గ్రద్ద ఆకాశంలో తిరుగుతూ వారికి కనిపించింది. అది క్రింద పామును చూసినట్టుంది. అందుకే ఆకాశంలో తిరగసాగింది. పాముకు మూలికను వదిలి పుట్టలోకి పోవడానికి మనసురాలేదు. కానీ ఆకాశంలో తిరుగుతున్న గ్రద్ద తనని ఎక్కడ తన్నుకు పోతుందో నన్న భయంతో, గభాల్న పుట్టలోకి దూరింది; అది చూసి గ్రద్ద వెళ్ళిపోయింది. మనోహర్ ఆ క్షణాన్ని వృధాచేయలేదు. చటుక్కున ఎగిరి పుట్టమీది మూలికను తీసుకుని వెనక్కి వచ్చాడు. అది చూసి అందరూ సంతోషించి, ముందుకు వేగంగా పయనం లంకించుకున్నారు.

పీష్వా మంత్రాల భరిణను తీసుకుని విశ్రాంతి లేకుండా ప్రయాణము చేసి, సముద్ర తీరాన్ని చేరాడు. అక్కడ వారు నిలిపివున్న పడవ అలాగేవుంది. దాన్ని చూడడంతో అతనికి సంతోషంకలిగించి. ఇక తన కేఅపాయం లేదన్న తృప్తితో పడవలో ఎక్కి కూర్చున్నాడు.

మరుక్షణం ఎవరో తన చెంపపై బలంగా చాచి కొట్టారు. ఆ దెబ్బకి అదిరిపోయి, తల ఎత్తి చూశాడు - పీష్వా ఎదురుగా గాలిలో అరచేయి నిలబడి వుంది. దాన్ని చూడంతో పీష్వా భయంతో గజగజ వణకసాగాడు. ఇకఅక్కడవుంటే ప్రమాదం తప్పదని తలచి క్రిందినుండి లేచి, వేగంగా ముందుకు పరిగెత్తసాగాడు. అరచేయి అతని వెనుకనే రాసాగింది. పీష్వా వెనక్కి తిరిగి చూస్తూ ముందుకు పోతూ, పాడుబడిన భవనం వద్ద

నిలిచిపోయాడు. అప్పటికే అతను బాగా అలసివున్నాడు. అందులో అతనికి ఆలోచించడానికి వ్యవధిలేదు. వేగంగా భవనంలోకి దూరి, తలుపులు గట్టిగా బిగించాడు. లోపలున్నపిష్వా తిరిగి బయటికి రాకుండా వుండాలని బయట గడియ పెట్టివెళ్లి పోయింది ఆరచేయి.

లోపలున్న పిష్వా బయట గడియపెట్టిన శబ్దం విని, "అయ్యయ్యో! బయట గడియ పెట్టినట్లుంది!" అంటూ మనసులో అనుకుని, లోపల తలుపుకు వున్న గడియ తీసి, తలుపులు తెరవడానికి ప్రయత్నించాడు. కానీ లాభం లేకపోయింది "అరెరే! నే నెంత మోసపోయాను? ప్రచండుని చేతినుండి తప్పించుకుని, చివరికి ఇక్కడ అన్యాయంగా బంధింపబడ్డానే! ఈ పిచ్చిదెయ్యం ఆసలు తలుపులు తెరుస్తుదో, లేదో? ఆంతలో వారంతా వచ్చేశారంటే, నా ప్రాణం పోయినట్లే! మంత్రాల భరిణ నావద్ద వుంది; కానీ అది ఇప్పుడు వుపయోగపడదు. కాళీమాత పూజ చేసిన తరువాత ఈ భరిణను తెరిస్తేగాని వుపయోగపడదు. ఇప్పు డెలా? నేను ఎలాగైనా ఇక్కడి నుండితప్పించుకుపోవాలి!" అని మనసులో అనుకుంటూ, బయటికి పోవడానికి మార్గాన్ని వెదకసాగాడు.

* * *

ఆర్ధరాత్రికి మనోహర్ బృందం పాడుబడిన భవనాన్ని చేరుకున్నారు. బయటనే ఆరచేయి నిలచి వుండటం అందరూ గమనించారు. మనోహర్ తన వద్దవున్న ఎర్ర మూలికను ఆరచేయికి అందించాడు.

మరుక్షణం వారిముందు ఓ యువకుడు నిలబడ్డాడు. అతడు అందరికీ నమస్కరిస్తూ, "అయ్యా; మీ రెవరోగాని నాకు ఎంతో సహాయం చేశారు. మీ కందరికీ నా ధన్యవాదాలు!" అన్నాడు

అంతలో జీవకుడు, "మే మింత కష్టపడి ప్రయాణం చేసి నీకు మంచి చేశాంగాని, చివరికి మేము మోసపోయాం!" అన్నాడు.

"ఏమైంది? మిమ్మల్ని ఎవరు మోసగించారు?" అన్నా డా వ్యక్తి.

అంతలో మనోహర్ ముందుకువచ్చి,

"వీరకేసరీ! మాతో వచ్చిన పీష్వా అనేవాడు మంత్రాల భరిణను పాములలోయ నుండి తీసుకు పారిపోయాడు. ఇంతకీ అతను నీకు కనబడి వుండాలే!" అన్నాడు.

"ఆఁ కనబడ్డాడు! అతను ఒంటరిగా పరిగెత్తుకు వచ్చి పడవ ఎక్కుతుంటే, అను మానబడి, ఈ భవనంలోనే బంధించి వుంచాను!" అన్నాడు వీరకేసరి.

"చాలా సంతోషం కేసరీ! నీ వింత సహాయం మాకు చేస్తావని అనుకోలేదు. రా, ముందు ఆ ద్రోహిని చూపించు!" అంటూ మనోహర్ త్వరగా ముందుకు నడవసాగాడు. వీరకేసరి భవనం తలుపు గడియతీసి, తలుపులు రెండూ భార్లగా తెరిచాడు; అందరూ లోన ప్రవేశించారు.

కానీ లోపల ఎవరూ కనిపించలేదు; అందరూ ఆశ్చర్యంతో లోపలున్న గదులన్నీ వెదికారు. వీరకేసరి, "అరె! నేను వాణ్ణి ఇక్కడే కదా వుంచాను; ఎక్కడికి పోయి వుంటాడు?" అంటూ గదిని పరిశీలించి చూడసాగాడు. అక్కడో ఊచలులేని చిన్న కిటికీ కనబడింది.

"మనోహర్! చూశావా ఆ ద్రోహి దీన్నుండి తప్పించుకు పోయివుంటాడు; రండి, అతను ఇప్పుడే తప్పించుకుని వెళ్ళివుండాలి!" అంటూ వేగంగా సముద్రతీరంవైపు దారితీశాడు.

సముద్రతీరంలో పడవలేదు. చాలా దూరంలో ఓ పడవ పోతున్నట్టు కనబడింది, "అదిగో! ఆ ద్రోహి పోతున్నాడు; మీరు వెంటనే బయలుదేరండి!" అన్నాడు కేసరి.

"ఎలా మేము వెళ్లేది? వున్న ఒక్క పడవ పీష్వా తీసుకుపోయాడు సముద్రంపై ఎలా వెళ్ళడం?" అన్నాడు మనోహర్

'సరే నావెంట రండి!" అంటూ వీరకేసరి అక్కడున్న చెట్టువైపు వేగంగా పరిగెత్తాడు. అక్కడ చెట్లమరుగులో రెండు పాత పడవలు కనిపించాయి. "నేను, నా మిత్రుడు ఈ దీవిలోకి వచ్చినపుడు వీటి మీదనే వచ్చి, అది ఎవరికీ కనబడకుండా ఇక్కడ దాచి, ఆ భవనంలోకి వెళ్ళాం. ఇప్పుడు ఇవి మీకు వుపయోగపడగలవు ఇందులో

కటి మిరు త్వరగా తీసుకువెళ్ళండి!" అన్నాడు.

అందరూ ఆ పడవను సముద్రతీరం వరకు తీసుకుపోయి, తరువాత వీరకేసరికి కృతజ్ఞతలు తెలుపుకుని, పడవను వేగంగా ముందుకు నడపసాగారు.

ముందుకు పోతున్న పీష్వా తనకు చాలా దూరంలో వెనుక మనోహర్ బృందం పడవలో వస్తున్నట్టు తెలుసుకుని పడవను మరింత వేగంగా ముందుకు నడపసాగాడు.

వున్నట్టుండి పీష్వా పడవకు చిన్నరంధ్రం ఏర్పడి పడవలోకి నీరు చొచ్చుకు రాసాగింది, అయినా, అతను భయపడక పడవను జోరుగా నడపసాగాడు. అతనికి కనుచూపు మేరలో గండభేరుండదీవి కనబడగానే చాలా సంతోషించాడు. కానీ పడవనిండా నీరు నిండడంతో, అటూ ఇటూ వూగసాగింది; కొంత సేపటికి పడవ బరువుకావడంతో ముందుకు సాగలేక బ్లోరా పడింది; పడవతోపాటు పీష్వా ఎగిరి నీట పడ్డాడు; అప్పు డతని చేతిలోని మంత్రాల భరిణ నీటిపైన తేలియాడసాగింది; అది గమనించిన పీష్వా 'అయ్యో! నా భరిణ పోతూందే!" అని నీటిలో ఈదసాగాడు. కాని భరిణ అతని వెనుకగా పోసాగింది. ఎలాగైనా దాన్ని తీసుకోవాలని జోరుగా ఈదసాగాడు.

వున్నట్టుండి సముద్రంలో నుండి పెద్ద చేప బయటికి వచ్చింది; దాన్ని చూడ్డంతో పీష్వా భయపడిపోయాడు. ముందుకు పోదామంటే, భరిణకు అడ్డంగా పెద్ద చేపవుంది. కనుక వెనక వున్న తీరంవైపు ఈదసాగాడు. ఆ చేప తోకతో పీష్వాను ఓ తన్ను తన్నింది. ఆ దెబ్బకు అతని వీపు చీరుకుపోయి, రక్తం స్రవించసాగింది. బాధకు తట్టుకోలేక పీష్వా "అయ్యోయ్యో! రక్షించండి! రక్షించండి!" అని అరవసాగాడు.

అప్పటికే అతనికి దగ్గిరలో పడవమీద వస్తున్న మనోహర్ బృందం జరిగిన దంతా చూశారు. పడవను వేగంగా ముందుకు నడిపారు.

అంతలో ప్రచండుడు, "మనోహర్! అటు చూడు మంత్రాల భరిణ నీటిమీద తేలుతూ



పోతూండి; పడవను అటు నడుపు!" అన్నాడు.

మనోహర్ పడవను అటు పోనిచ్చాడు; ప్రచండుడు వంగి, నీటిమీద తేలుతున్న భరిణని చేతిలోకి తీసుకుని, "అమ్మయ్యా, ఇన్నాళ్ళకు దొరికింది భరిణ!" అంటూ దాన్ని తన దుస్తుల్లో దాచాడు.

తరువాత మనోహర్ పడవను పీష్వా వైపు వేగంగా నడిపాడు; కానీ ప్రయోజనం లేక పోయింది. అప్పటికే ఆ పెద్దచేప పీష్వా రెండు కాళ్ళు కొరికి వేసింది. పీష్వా ముందుకు ఈదలేక, అలాగే నీటిమీద తేలసాగాడు. తరువాత ఆ చేప పీష్వా తలను కొరికివేసింది; ఆ ప్రాంతమంతా రక్తసిక్తమయింది.

ఆ దృశ్యాన్ని చూసి అందరూ ఆరగా నిశ్చేష్టులై పోయారు. పీష్వా వారి కెంత ద్రోహం చేసివున్నా, అలాంటిచావు చచ్చే టపుడు, అందరికీ అతనిపై కరుణ కలిగింది. వారికి తెలియకుండానే వారి కళ్ళనుండి అశ్రుధారలు కారసాగాయి.

వున్నట్టుండి వారిపడవ ఎగిరి బోర్లపడింది. అందరూ నీటిలో పడ్డారు. ఎందుకు అలా పడవ పడిందని తలఎత్తి చూసేసరికి వారి ముందు పెద్ద చేప వుంది. దాన్ని చూడగానే వారికి పీష్వా చావు గుర్తుకు వచ్చింది.

మనోహర్ మాత్రం ధైర్యాన్ని చిక్కబట్టి, చేతిలోకి పిడిబాకు తీసుకుని ఎగిరి చేపమీద పడ్డాడు. వెనుకనే జగ్గడు కత్తితో వెంబడించాడు. ఇక తాము దూరంగా వుండటం మంచిది కాదని ప్రచండుడు, జీవకుడు కత్తులతో ముందుకు ఈదసాగారు.

అందరూ చేపమీదికి ఎక్కి, కత్తులతో బలంగా పొడవసాగారు. దాని శరీరమంతా రక్తమయమయింది. అయినా, అది లెక్కచేయకుండా తోకతో వారిని క్రిందపడ కొట్టడానికి ప్రయత్నించసాగింది. కానీ, వారు అతి జాగ్రత్తగా దాని తోకకు చిక్కకుండా దాని వీపును గట్టిగా పట్టుకుని కూర్చున్నారు.

వున్నట్టుండి జగ్గనికి తన వద్దవున్న పచ్చరాయి గుర్తుకు వచ్చి, దాన్ని చేతితో పట్టుకుని, చేప వీపుమీద ఆ రాయిలో ముక్కి

కోసి; బలంగా అదిమాడు. అంతే; దాని శరీరమంతా ముక్కలైంది. చెపకు కోపం వచ్చి, అటూ ఇటూ తిరగసాగింది. దాని శరీరం ముక్కలు కావడంతో, వాని బలం సన్నగిల్లింది. అది గమనించిన అందరూ సముద్రంలోకి దూకి వేగంగా తీరం వైపుకు ఈదసాగారు. ఆ చేప అలాగే సముద్రంలో మునిగిపోయింది.

అందరూ కష్టపడి గండభేరుండదీవిని చేరుకున్నారు. అది మంచి రోజు కావడంతో ప్రచండుడు కాళీమాతకు పెద్ద ఎత్తున పూజ చేసి, సాయంత్రానికి కాళీమాత విగ్రహం ముందు మంత్రాల భరిణను తెరిచాడు.

అంతే! ఆ గుహ అంతా గిర్రున తిరగ సాగింది. కాళీమాత చేతినుండి తెల్లటివెలుగు ఆ భరిణలోకి ప్రవేశించింది. తరువాత అది చిన్న దీపంగా మారి ప్రచండుని శరీరంలోకి దూరింది.

కొంతసేపటికి గుహ తిరగడం ఆగింది. క్రిందపడిన అందరూ ప్రచండుని వద్దకు పరిగెత్తుకువచ్చారు. అప్పుడే అతని ముఖంలో ఏదో కళ వచ్చినట్లు తెలసింది.

"మనోహరా! నివల్ల నాకు ఎంతో సహాయం లభించింది. ఇప్పుడు నేను మంత్రాల ప్రచండుణ్ణయినాను, నాకుసర్వ మంత్రాలూ తెలుసును; నీకు ఏమికావాలో కోరుకో!" అన్నాడు ప్రచండుడు.

"ప్రచండా! నాకు కోరికలంటూ ఏమీ లేవు; నేను గండభేరుండదీవికి వచ్చిన పని

పూర్తయింది; ఎజ్రం నాకు దక్కింది; ఇక మా రాజ్యానికి పోవాలి. అందుకు నీవే ఏర్పాట్లు చేయాలి!" అన్నాడు.

"ఓ అలాగే!" అంటూ ప్రచండుడు ఏవో మంత్రాలు చదివి, చేతిని గాల్లోకి ఆడించాడు. మరుక్షణం అతని ముందు రంగుల దుప్పటి నిలిచింది.

"మనోహరా! మీ ఇద్దరూ ఈ దుప్పటిపై కూర్చోండి; ఇది క్షణంలో మిమ్మల్ని మీ రాజ్యానికి చేరుస్తుంది!" అన్నాడు.

"చాలా సంతోషం!" అంటూ మనోహర్, జగ్గడు ఆ రంగుల దుప్పటిపై కూర్చున్నారు. ప్రచండుడు చేతిని గాల్లోకి ఆడించాడు. మరు

క్షణం దుప్పటి గుహనుండి బయటికి వచ్చి ఆకాశంలో నుంచి దూసుకుపోయింది.

మరుక్షణం రంగులదుప్పటి వారి రాజ్యం చెరుకుని అంత:పురంపైన నిలిచింది. ఇద్దరూ అందులోనుండి క్రిందికి దిగగానే అది తిరిగి వెళ్ళిపోయింది; సరిగ్గా అంత:పురంపైకి వస్తున్న మహారాజు వారిద్దరినీ చూసి, "మనోహర్! ఎప్పుడు వచ్చావు?" అన్నాడు.

మనోహర్ తన వద్దవున్న వజ్రాన్ని రాజుకు ఇచ్చి, "రాజా! ఇది ఐదవ వజ్రం. మా నాన్నగారు నిర్దోషి. ఈ వజ్రాలు దొంగిలించిన ఐదుమందిని నేను నా చేతులతో చంపలేదు. అందరూ తామే చచ్చారు. కానీ వజ్రాలు మాత్రం దొరికాయి!" అన్నాడు.

"మనోహర్! నీలాంటి కుమారుణ్ణి కన్న రత్నసింహుడు ఎంతో అదృష్టవంతుడు! ఇక నీవు ఎక్కడికీ వెళ్ళవద్దు; నా వద్దనే వుండిపో!" అన్నాడు రాజు.

"లేదు మహారాజా! నాకు ఈ రాజ్యంలో వుండడానికి మనసు రావటంలేదు; నాకు మిత్రుడొకడున్నాడు. ఇద్దరం అలా సంచారంచేస్తూ కాలం గడుపుతాం; మాకు శెలవిప్పించండి!" అన్నాడు మనోహర్. "అలాగే, కానీ ఈ రోజున మీకు పెద్ద విందు ఏర్పాటుచేశాను; అది ముగించుకుని మీరు వెళ్ళండి!" అన్నాడు రాజు.

ఇద్దరూ అందుకు సమ్మతించారు.

మహారాజు పెద్దవిందు ఏర్పాటు చేసి, రాజ్యంలోని పెద్ద మనుషులను పిలిపించి, అందరికీ మనోహర్, జగ్గని సాహసాలను గూర్చి చెప్పి, ఆ ఐదు వజ్రాలను చూపించారు. అందరూ ఇద్దరినీ ఎంతో మెచ్చుకున్నారు.

మరునాడు మనోహర్, జగ్గడు రాజుగారి వద్ద వున్న రెండు తెల్లటి గుర్రాలను తీసుకుని, అందరి వద్ద శెలవు తీసుకుని వేగంగా ముందుకు వెళ్ళిపోయారు.

(అయిపోయింది)